

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 157

మంగళవారం
21-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారీ డీల్

ఉబర్‌కు 25 వేల ఎక్స్‌ప్రెస్-టీ ఈవీలను సరఫరా చేయనున్న టాటా మోటార్స్

- వివరాలు 13లో

మరో బీసీ విప్లవం

- 18 ఎమ్మెల్సీ స్థానాలకుగానూ 14 బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే.. నాలుగు ఓసీలకు
- సీఎం జగన్ ఆవిష్కరించిన సామాజిక మహావిప్లవంలో మేలిమలుపు
- మండలిలో 44కు పెరగనున్న బలం.. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే 30 మంది
- మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యుల్లో ఆయా వర్గాలది 68.18 శాతం
- నాడు మండలిలో టీడీపీకి 48 మంది ఉంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 18 మందికే అవకాశం.. వీరిని 37.5 శాతానికే పరిమితం చేసిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: శాసన మండలిలో 18 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 14 మందిని అభ్యర్థులుగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఖరారు చేశారు. మిగిలిన నాలుగు స్థానాలను నాలుగు ఓసీ సామాజిక వర్గాలకు కేటాయించారు.పట్టభద్రులు, టీచర్ల విభాగం ఎన్నికలను మినహాయిస్తే శాసన మండలికి స్థానిక సంస్థల కోటాలో 9, ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అవుతున్న 7 స్థానాలకు ఎన్నికలతో పాటు గవర్నర్ కోటాలో రెండు స్థానాలను ప్రతిపాదించనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో సీఎం జగన్ ఆవిష్కరించిన సామాజిక మహావిప్లవంలో దీన్ని మేలి మలుపుగా సామాజికవేత్తలు అభివర్ణిస్తున్నారు.

44కి పెరగనున్న అధికార పార్టీ బలం..

తాజాగా నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు వరకు శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ బలం 31 ఉంది. వీరిలో పదవీ కాలం ముగుస్తున్న ఐదుగురు సభ్యులను మినహాయిస్తే 26 మంది ఉంటారు. అందులో బీసీలు 8, ఎస్సీలు 4, మైనార్టీలు నలుగురు కాగా ఓసీలు పది మంది ఉన్నారు. స్థానిక సంస్థల్లోనూ, శాసనసభలోనూ వైఎస్సార్‌సీపీకి తిరుగులేని బలం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 16తోపాటు గవర్నర్ కోటాలో రెండు కలిపి మొత్తం 18 స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కుతాయి. అప్పుడు మండలిలో అధికార పార్టీ బలం 44కు చేరుతుంది. అందులో బీసీలు 19, ఎస్సీలు 6, ఎస్టీ ఒకరు, మైనార్టీలు నలుగురు ఉంటారు. అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సభ్యుల సంఖ్య 30 (68.18 శాతం)కి చేరుకుంటుంది. ఓసీ సభ్యుల సంఖ్య 14 (31.82 శాతం) అవుతుంది. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ శాసన మండలిలో ఈ స్థాయిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఏనాడూ ప్రాతినిధ్యం కల్పించిన దాఖలాలు లేవని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు సైతం సీఎం జగన్ స్థాయిలో రాజ్యాధికారంలో ఆయా వర్గాలకు వాటా ఇచ్చిన దాఖలాలు లేవని ప్రశంసిస్తున్నారు. టీడీపీ హయాంలో 2014–19 మధ్య శాసనమండలిలో ఆ పార్టీకి 48 మంది సభ్యులు ఉండగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 18 మంది (37.5%)కి మాత్రమే చంద్రబాబు అవకాశం కల్పించారని గుర్తు చేస్తున్నారు. నాడు చంద్రబాబు సామాజిక అన్యాయానికి పాల్పడగా సీఎం జగన్ ఆయా వర్గాల సాధికారత కోసం నిబద్ధతతో అడుగులు వేస్తున్నారని సామాజిక వేత్తలు, రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

తొలి అడుగే బలంగా..

2019 ఎన్నికల్లో 50% ఓట్లు సాధించి 151 శాసనసభ స్థానాలు (86.28 %), 22 లోక్‌సభ స్థానాల్లో (88 %) వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సొంతం చేసుకుంది. 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్ జూన్ 8న ఏర్పాటైన మంత్రివర్గం నుంచే

మిగతా 2వ పేజీలో ▶

టీడీపీ టికెట్టా.. వద్దే వద్దు!

గ్రేటర్ రాయలసీమలో టీడీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారిపోతోంది. అంతఃకలహాలు, వర్గ విభేదాలతో టీడీపీ శ్రేణులు బలహీనమయ్యాయి. చాలా మంది నేతలు ప్రత్యామ్నాయం చూసుకున్నారు. మరోవైపు తమ ఇంటర్నల్ సర్వేల్లో సైతం పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవని తేలడంతో టీడీపీ నేతలు పోటీకి విముఖత చూపుతున్నారు. ఏ దారీ లేని వారు.. ఎక్కడా గెలవలేమనుకునేవారు మాత్రం.. పూర్తిగా ఖర్చులు పార్టీ భరిస్తేనే పోటీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబుకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో చంద్రబాబు వ్యాపారవేత్తలు, ఎన్నారైల కోసం వేట సాగిస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లో పూర్తి స్థాయి ఇన్‌చార్జ్‌లను నియమించలేక బాబు తల పట్టుకుంటున్నారు.

- వివరాలు 10లో

స్టార్టప్స్ కేంద్రంగా విశాఖపట్నం



- 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం.. 2023–28 నూతన పారిశ్రామిక విధానంపై సీఎం దిశానిర్దేశం
- ఆలోచన నుంచి ఆరంభం దాకా చేయి పట్టుకుని నడిపిద్దాం.. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించేలా చర్యలు
- అంతర్జాతీయ మార్కెట్లతో ఎంఎస్‌ఎంఈల అనుసంధానం.. పోర్టు ఆధారిత పరిశ్రమలకు మౌలిక వసతులపై దృష్టి

- వివరాలు 3లో

గొప్పగా.. గర్వంగా!

- మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం :ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఎమ్మెల్సీలుగా 18 మంది పేర్లు ఖరారు.. 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే
- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి
- మనం చేస్తున్న సామాజిక న్యాయాన్ని ప్రతి గడపకూ చెప్పాలి
- ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం భేటీ

2లో

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే..

సామాజిక న్యాయానికి ప్రతిరూపం

బీసీలకు రాజ్యాధికారం జగన్‌తోనే సాధ్యం

బీసీ సంఘాల హర్షం.. సీఎం జగన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం

- వివరాలు 2లో

బీసీలకు రాజ్యాధికారం జగన్‌తోనే సాధ్యం

- బీసీలకు 11 ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడం సువర్ణ అధ్యాయం
- బీసీలు సీఎంగా ఉన్న రాష్ట్రాల్లోనూ ఈ స్థాయిలో పదవులు ఇవ్వలేదు
- కొనియాడిన బీసీ సంఘాలు

బీసీలకు రాజ్యాధికారం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని బీసీ సంఘాలు కొనియాడాయి. వైఎస్సార్‌సీపీ సోమవారం ప్రకటించిన 18 మంది ఎమ్మెల్సీల జాబితాలో ఏకంగా 11 మంది బీసీలు ఉండటంపై హర్షం వ్యక్తం చేశాయి. ఇది చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని పేర్కొన్నాయి.

- సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ)

రాజ్యాధికారంలో వాటా కల్పించిన ఘనత జగన్‌కే సాధ్యం



రాజ్యాధికారంలో బీసీలకు వాటా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. దేశంలో సామాజిక న్యాయం అనే పదాన్ని నినాదంలా కాకుండా తమ విధానంగా చాటి చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా నేటికీ చట్టసభల్లో అడుగుపెట్టని కులాలను గుర్తించి మరీ ఎమ్మెల్సీల పదవులు ఇచ్చి ప్రోత్సహించడం హర్షించదగ్గ విషయం. బీసీలు సీఎంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇంత పెద్ద ఎత్తున రాజ్యాధికారంలో బీసీలకు వాటా ఇచ్చిన సీఎం లేరు.

- మారేష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సామాజిక న్యాయ ప్రదాత.. జగన్



బీసీలకు పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయ ప్రదాతగా నిలుస్తున్నారు. 25 మంది మంత్రుల్లో ఏకంగా 11 మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చారు. తాజాగా ప్రకటించిన 18 మంది ఎమ్మెల్సీల్లో ఏకంగా 11 మంది బీసీలకు అవకాశం ఇవ్వడం చరిత్రలో లిఖించదగ్గ సువర్ణ అధ్యాయం.

- కేసన శంకరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

బీసీలకు సముచిత న్యాయం



బీసీలకు వైఎస్సార్‌సీపీ సముచిత న్యాయం చేసింది. భవిష్యత్తులో బీసీ కులాల్లోని అణగారిన వర్గాలకు కూడా ఉన్నత పదవులను కేటాయించి.. వారి అభివృద్ధికి కృషి చేయాలని విన్నవిస్తున్నాం.

- అంగిరేకుల ఆదిశేషు, బీసీ వెల్ఫేర్ జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు

బీసీలకు 65 % పదవులు రికార్డు..



ఎమ్మెల్సీ పదవుల్లో దాదాపు 65 శాతం బీసీలకు వాటా ఇచ్చి సీఎం వైఎస్ జగన్ పదవుల పంపకంలో రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బీసీలకు ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

- లాకా వెంగళరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


సామాజిక న్యాయంలో కొత్త చరిత్ర



సామాజిక న్యాయం ఆచరణలో సీఎం వైఎస్ జగన్ కొత్త చరిత్రను సృష్టించారు. సాహు మహారాజ్, రామ్ మనోహర్ లోహియా, పెరియార్ రామస్వామి నాయకర్, కాన్షీరాం, కత్తి పద్మారావు తదితరులు కులాల వారీగా దామాషా ప్రకారం పదవుల్లో వాటా కావాలని పోరాటం చేశారు. వారి కలలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్.

- చింతపల్లి గురుప్రసాద్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు

బహుజన వర్గాల ఆశాజ్యోతి.. సీఎం జగన్



బహుజన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్. ఎమ్మెల్సీ పదవుల్లో అత్యధికం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చి బహుజన వర్గాల పక్షపాతి అని నిరూపించారు.

- మందపాటి శేషగిరిరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్

బీసీ పక్షపాతి.. జగన్



బీసీల పక్షపాతినని మరోసారి సీఎం జగన్ రుజువు చేశారు. ఆయనను ఇతర రాష్ట్రాల సీఎంలు, పార్టీల అధినేతలు ఆదర్శంగా తీసుకోవాలి. బీసీలకు సీఎం జగన్ చేసిన మేలును వారు మరవలేరు.

- డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్, విజయవాడ

గొప్పగా.. గర్వంగా!

మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయం అమలు చేస్తున్నాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఎమ్మెల్సీలుగా 18 మంది పేర్లు ఖరారు.. 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీలే
- మిగిలిన 4 సీట్లలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి
- మనం చేస్తున్న సామాజిక న్యాయాన్ని ప్రతి గడపకూ చెప్పాలి
- నేను చేయాల్సింది చేశా.. ఇవ్వాల్సింది ఇచ్చా.. ఇక మీ బాధ్యత నెరవేర్చండి
- పదవులు పొందినవారు చురుగ్గా, దూకుడుగా వ్యవహరించాలి
- పార్టీ కోసం ఏం చేయగలుగుతామనే కోణంలో అడుగులు వేయాలి
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం సమావేశం

సాక్షి, అమరావతి: మునుపెన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని, ఇంత గొప్పగా ఎప్పుడూ జరగలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మనం చేసిన సామాజిక న్యాయాన్ని ప్రతి నియోజకవర్గంలో వినిపించాలని, ప్రతి గడపకూ చేరవేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల కోటా, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించిన వారితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..

సుదీర్ఘ కసరత్తు అనంతరం..

గతంలో ఎప్పుడూ చూడనంత, జరగనంత సామాజిక న్యాయాన్ని దేవుడి దయతో మన పార్టీలో చేయగలుగుతున్నామని గర్వంగా చెప్పుకునే గొప్ప పరిస్థితుల్లోకి వచ్చాం. ఇవాళ చాలా సుదీర్ఘ కసరత్తు అనంతరం 18 మందిని ఖరారు చేస్తే వారిలో 14 మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారే. ఇంత గొప్పగా సామాజిక న్యాయం ఎప్పుడూ జరగలేదు. మిగిలిన సామాజిక వర్గాలకు నాలుగు సీట్లిస్తే అందులో కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒకటి చొప్పున కేటాయించాం. మనం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ తెలియాలి, ప్రతి నియోజకవర్గంలోనూ చెప్పాలి.

రాజకీయాల్లో గొప్ప మార్పు

రాజకీయాల్లో ఇంత గొప్ప మార్పు ఎప్పుడూ జరగలేదు. పారదర్శకంగా బటన్ నొక్కి లంచాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నాం. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో మంచి మార్పులు తెచ్చాం. అవన్నీ ఒక ఎత్తు అయితే ఈరోజు మనం చేసిన సామాజిక న్యాయం మరో ఎత్తు.

దీటుగా, మరింత దూకుడుగా..

పదవులు పొందిన వారు పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉండాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లాంటివి ఒక్కటై లేనిపోని విష ప్రచారం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనం కూడా అంతే ధీటుగా, యాక్టివ్‌గా, మరింత దూకుడుగా పనిచేయడం ద్వారా మన వాణిని సమర్థంగా వినిపించాలి.



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మీ నుంచి కోరుకునేది అదే..

మరో 13 – 14 నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించనున్నవారు పార్టీ కోసం ఏం చేయగలుగుతాం? అన్న ఆలోచనతో అడుగులు వేయాలి. నేను చేయాల్సింది చేశాను... మీకు ఇవ్వాల్సిన పదవులు ఇచ్చా. ఇక పార్టీకి ఏ రకంగా మంచి చేయాలనే కీలక బాధ్యతలు మీపై ఉన్నాయని గుర్తుంచుకోవాలి. మీ తరఫు నుంచి నేను అదే కోరుకుంటున్నా. మరింత ఉత్సాహంగా ఉండాలని అందరినీ కోరుతున్నా. పదవులు పొందుతున్న వారందరికీ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

వారిని కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి

ఈ పదవులను ఆశించిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. ఉన్న పదవులు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉంటారు కాబట్టి అందర్నీ సంతృప్తి పరచలేం. కొద్దో గొప్పో కొరత ఉంటుంది. వీరందరికీ కూడా చెప్పే రీతిలో నచ్చచెబుతూ, కన్విన్స్ చేసుకుంటూ వెళ్లాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి ప్రజల పక్షాన నిలబడి రాజకీయాలు చేశాం. అధికారంలోకి వచ్చాం. దేవుడి దయతో మంచి పరిపాలన కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు వై నాట్? అనే రీతిలో అడుగులు ముందుకు వేస్తూ పాలన కొనసాగుతోంది.

మిగతా వారికి ఈసారి

దేవుడు ఆశీర్వదిస్తే గత ఎన్నికల కంటే ఈసారి అత్యధిక స్థానాలు సాధిస్తాం. ఇంకా చాలా మందికి రాబోయే రోజుల్లో ఎక్కువ అవకాశాలు వస్తాయి. చంద్రబాబు అరకొర పదవులిచ్చి బీసీలకు అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకోవటాన్ని మనం చూశాం. ఈసారి మనం వడ్డీలు, వడ్డెర కులాల వారికి అవకాశం ఇచ్చాం. రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇంకా మిగిలిన కులాలకు తదుపరి దఫాలో తప్పకుండా అవకాశం ఇస్తామని భరోసా ఇస్తున్నాం.

మరో బీసీ విప్లవం

▶ మొదటి పేజీ తరువాయి

సామాజిక న్యాయ సాధన కోసం తొలి అడుగే బలంగా వేసి సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. 25 మందితో ఏర్పాటైన మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 14 మందికి (56%) స్థానం కల్పించి రెవెన్యూ, జలవనరులు, మున్సిపల్, విద్య తదితర కీలక శాఖలు అప్పగించారు. రాజ్యాధికారంలో సింహభాగం వాటా కల్పించారు.

- దేశ చరిత్రలో తొలిసారిగా ఎస్సీ మహిళను హోం శాఖ మంత్రిగా నియమించారు.
- ఐదుగురు డిప్యూటీ సీఎంలను నియమించగా అందులో నలుగురికి (80 శాతం) బడుగు, బలహీన వర్గాల నుంచే అవకాశం కల్పించారు.
- శాసనసభ స్పీకర్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్, శాసనమండలి చైర్మన్‌గా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజు, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన మహిళ జకియా ఖానంకు అవకాశం ఇచ్చారు.

సామాజిక మహావిప్లవానికి నాంది

- 2022 ఏప్రిల్ 11న పునర్ వ్యవస్థీకరణ ద్వారా 25 మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో సామాజిక న్యాయం చేయడంలో సీఎం జగన్ మరో అడుగు ముందుకేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 17 మందికి (70 శాతం) మంత్రివర్గంలో స్థానం కల్పించి సామాజిక మహావిప్లవానికి నాంది పలికారు.
- టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో బీసీ వర్గానికి చెందిన ఒక్కరికి కూడా రాజ్యసభకు వెళ్లే అవకాశం ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర కోటాలో 8 స్థానాలు ఖాళీ అయితే అందులో నలుగురు బీసీలను (50%) సీఎం రాజ్యసభకు పంపి చిత్తశుద్ధి చాటుకున్నారు. రాజ్యాధికారం, పరిపాలనలో సింహభాగం వాటా ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం చేయడం అంటే ఇదీ అని దేశానికి సీఎం చాటి చెప్పారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు.

'స్థానిక' సాధికారత..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేస్తే చంద్రబాబు వాటికి వ్యతిరేకంగా టీడీపీ నేతలతో హైకోర్టులో కేసులు వేయించారు. దీంతో బీసీలకు రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గాయి. అయితే టీడీపీ కుట్రలు చేసి రిజర్వేషన్లను తగ్గించినా పార్టీ పరంగా 34 శాతం కంటే ఎక్కువ ఇస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఆ మేరకు స్థానిక సంస్థలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి సింహభాగం పదవులు ఇచ్చారు.
- రాష్ట్రంలో 648 మండలాలకు ఎన్నికలు జరిగితే 637 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో 237 మండల పరిషత్ అధ్యక్ష పదవులను బీసీలకు (38 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి ఎంపీపీ పదవుల్లో 67 శాతం ఇచ్చారు.
- 13 జిల్లా పరిషత్ చైర్మన్ పదవులలో బీసీలకు 6 (46%) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 9 జడ్పీ చైర్మన్ పదవులు (69%) ఇచ్చారు.
- 14 కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించగా మేయర్ పదవుల్లో బీసీలకు ఏకంగా 9 పదవులు (64 శాతం) సీఎం జగన్ ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకొంటే 14 కార్పొరేషన్ మేయర్ పదవులకుగానూ 12 పదవులు (86 శాతం) ఇచ్చారు.
- 87 మున్సిపాల్టీలలో ఎన్నికలు జరగ్గా 84 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో 44 మున్సిపల్ చైర్మన్ పదవులను బీసీలకు (53 శాతం) ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు కలిపి 58 మున్సిపల్ చైర్మన్ పదవులు (69 శాతం) ఇచ్చారు.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు..

నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు సీఎం జగన్ పదవులు ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఆ వర్గాలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశంలో ఇదే మొదటిసారి.

- 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు నియామకాలు చేపట్టగాబీసీలకు 76 పదవులు (39 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కలిపి 117 పదవులు (60 శాతం) ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవులలో 53 పదవులు (39 శాతం) బీసీలకే ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలిపితే 137 పదవుల్లో 79 పదవులు(58 శాత) ఆయా వర్గాలకే ఇచ్చారు. 137 ప్రభుత్వ కార్పొరేషన్ పదవులకు సంబంధించి 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులు ఉండగా 201 పదవులు బీసీలకు (41 శాతం) ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలిపితే 484 పదవుల్లో 280 పదవులు (58%) ఆ వర్గాలకే ఇచ్చారు.
- బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆయా వర్గాల వారినే చైర్మన్లుగా నియమించారు. ఆ కార్పొరేషన్‌లలో 684 డైరెక్టర్ పదవులు ఉంటే అవన్నీ ఆ వర్గాలకే ఇచ్చారు. ఆలయ బోర్డులు, ఆలయ చైర్మన్ పదవుల్లో సగ భాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు. దాదాపు 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో 3,503 సగభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికే ఇచ్చారు.

'సాధికార' బాటలో..

గత 44 నెలలుగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,92,958.90 కోట్లను డీబీటీతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జగన్ జమ చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఖాతాల్లోకే రూ.1,43,178.78 కోట్లు (74.20%) జమ చేశారు. నాన్ డీబీటీ కింద చేకూర్చిన ప్రయోజనాలు వీటికి అదనం. తద్వారా ఆ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు, ఆర్థిక సాధికారతకు బాటలు వేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, నాడు-నేడు ద్వారా ఆధునికీకరణ, అమ్మ ఒడి, విద్యాదీవెన తదితర పథకాల ద్వారా విద్యా సాధికారతకు కృషి చేస్తున్నారు. మహిళలకు వైఎస్సార్ చేయూత, ఆసరా ద్వారా ఆర్థికంగానూ, పదవుల్లో దాదాపు సగ భాగం వాటా ఇవ్వడం ద్వారా మహిళా సాధికారత దిశగా కృషి చేస్తున్నారు. ఆర్థిక, రాజకీయ, విద్య, మహిళా సాధికారత ద్వారా ఆయా వర్గాలు సంపూర్ణ సామాజిక సాధికారత సాధించే దిశగా సీఎం జగన్ నిబద్ధతతో అడుగులు వేస్తున్నారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు.

సామాజిక న్యాయానికి ప్రతిరూపం సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి ప్రతిరూపమని ఎమ్మెల్సీ అభ్యర్థులు చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపికైన వారు సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

- సాక్షి, అమరావతి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం



ఎమ్మెల్సీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం జగన్ ప్రాధాన్యతనిచ్చారు. 2014–19 మధ్య టీడీపీ శాసన మండలికి 48 మందిని పంపితే వారిలో ఓసీలే 30 మంది ఉన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 18 మంది మాత్రమే. - కవురు శ్రీనివాస్

బాబుకి, సీఎం జగన్‌కు మధ్య తేడా ఇదే



చంద్రబాబు 2014 19 మధ్యకాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 37.5 శాతం పదవులే ఇచ్చారు. దీనికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్ 68.18 శాతం కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సాధికారత పట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధిని ఇది నిరూపిస్తోంది. ఇద్దరి మధ్య ఈ తేడాను అందరూ గుర్తించాలి. - వంకా రవీంద్రనాథ్

కుప్పంలో చంద్రబాబును ఓడిస్తాం



రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు రాజ్యాధికారంలో భాగం కల్పిస్తూ సీఎం జగన్ సామాజికన్యాయానికి ప్రతిరూపంగా నిలుస్తున్నారు. బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన సీఎం జగన్ అభినవ పూలేగా చరిత్రలో ఉండిపోతారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబును ఓడిస్తాం. - సిపాయి సుబ్రమణ్యం

టీడీపీ పని అయిపోయింది



సీఎం జగన్ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఎమ్మెల్సీగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తా. టీడీపీ పని అయిపోయింది. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ చేతిలో మరోసారి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఘోరంగా ఓడిపోవడం ఖాయం.

- పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి



శెట్టి బలిజ సామాజికవర్గంలో 36 సంచార జాతులున్నాయి. వెనుకబాటుకు గురైన వీరందరికీ న్యాయం చేస్తా. తూర్పు గోదావరి జిల్లాలో ఈసారీ వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించేందుకు కృషి చేస్తా. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తా.

- కుడిపూడి సూర్యనారాయణ

ధైర్యం చెప్పారు



నేను ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పుడు నిరాశ చెందొద్దని సీఎం జగన్ ధైర్యం చెప్పారు. పార్టీ కోసం పనిచేయి, న్యాయం చేస్తానని చెప్పారు. ఆయన చెప్పినట్లుగానే అడగకుండానే ఎమ్మెల్సీని చేశారు. అత్యధిక జనాభా ఉన్న వడ్డెరల అభివృద్ధికి కృషి చేస్తా. - చంద్రగిరి యేసురత్నం

ఇంత ప్రాధాన్యం ఇదే తొలిసారి



మా జిల్లాలో మాదిగలకు ఇంత పెద్ద రాజకీయ గుర్తింపు ఇవ్వడం ఇదే తొలిసారి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పెద్దల సభకు మాదిగలు వెళ్లటం ఇదే మొదటిసారి. ఇది ఒక్క సీఎం జగన్ వల్లే సాధ్యమైంది. - బొమ్మి ఇజ్రాయిల్

సామాజిక, రాజకీయ విప్లవానికి నాంది



పరిపాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు, మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా సీఎం జగన్ ఆ వర్గాల సాధికారతకు బాటలు వేస్తున్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను శాసన మండలికి ఎంపిక చేసి సామాజిక, రాజకీయ విప్లవానికి నాంది పలికారు. - పోతుల సునీత

ఎస్టీలకు పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్



జగన్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఎస్టీల అభివృద్ధికి సబ్ ప్లాన్‌లో ఈ ఏడాదిలోనే రూ.6,822.65 కోట్లు కేటాయించింది. ఎస్టీ సబ్ ప్లాన్ లో భాగంగా 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ దాకా రూ.15,589.38 కోట్లు ఖర్చు చేసింది. 2024లో జగన్‌ను సీఎంగా చేసేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారు. - కుంభా రవిబాబు

చంద్రబాబును బీసీలంతా నిలదీస్తారు



సీఎం జగన్.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అనేక పదవులిస్తూ పాలనలో ప్రముఖ స్థానం కల్పిస్తున్నారు. చంద్రబాబు హయాంలో చాలా తక్కువ మందికే ఈ అవకాశం దక్కేది. ఈసారి ఎన్నికల్లో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు వైఎస్ జగన్‌కే మద్దతిస్తారు. - నర్తు రామారావు

పార్టీ విజయం కోసం పనిచేస్తా..



చట్ట సభలో అడుగుపెట్టే గొప్ప అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకొని ముందుకు వెళ్తా. వైఎస్సార్‌సీపీ విజయం కోసం పని చేస్తా. - డాక్టర్ ఎ.మధుసూదన్

ప్రజల గుండెల్లో.. సీఎం



సీఎం జగన్ ప్రజల గుండెల్లో ఏనాడో స్టిక్కర్ వేసుకున్నారు. ఎంత మంది ఏకమైనా దాన్ని చెరపలేరు. మాట తప్పని, మడమ తిప్పని గుణం వైఎస్ కుటుంబానిది.

- మర్రి, రాజశేఖర్

ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుతాం



సీఎం జగన్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగారు. అనేక సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేర్చిన వ్యక్తి ఆయన. కులాలను చీల్చే విధంగా కాకుండా స్ఫూర్తిదాయక విధానాలతో పరిపాలన సాగిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో మేమందరం ముందుకు నడుస్తాం. - పెన్మత్స సూర్యనారాయణరాజు

బీసీ అంటే బ్యాక్‌బోన్



బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్‌బోన్ క్లాస్‌గా సీఎం జగన్ గుర్తించారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చారు. స్పీకర్‌గా బీసీకి అవకాశమిచ్చారు. సీఎం జగన్‌కు బీసీలంతా రుణపడి ఉంటారు. - కోలా గురువులు

చంద్రబాబు నాకు ద్రోహం చేశారు



టీడీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు నాకు ద్రోహం చేశారు. ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. కానీ ఏ హామీ ఇవ్వకుండానే సీఎం జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తాను.

- జయమంగళ వెంకటరమణ

ఇలాంటి సీఎం దేశంలోనే లేరు



పేదలకు ఇంతగా మంచి చేసిన సీఎం దేశంలోనే లేరు. మహిళలకు అన్నింటా అగ్రతాంబూలమే. ఏ ప్రభుత్వం చేయని మేలు చేస్తున్నారు. బీసీలు సీఎంగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇంతగా మేలు జరగటంలేదు. - కర్రి పద్మశ్రీ

చాలా ఆనందంగా ఉంది



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం జగన్ గుర్తు పెట్టుకొని మరీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పదవులు బాధ్యతగా తీసుకోవాలని సీఎం జగన్ చెబుతారు. ఆయన చెప్పిన మాటలను శిరసావహిస్తూ బాధ్యతతో పని చేస్తా.

- మేరుగ మురళీధర్

ఇలాంటి సీఎంను జన్మలో చూడలేను



బీసీలకు ఇంతలా చేసిన సీఎంను ఈ జన్మలో చూడలేను. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా సీఎం జగన్ వెంటే ఉంటారు. ఇప్పటికైనా చంద్రబాబు పునరాలోచన చేసుకుని సీఎం జగన్ పథకాలకు జై కొట్టాలి. - ఎస్.మంగమ్మ

ఇదం జగత్



ఆ కొబ్బరి చిప్ప 'డోమ్'లాగా కనిపించిందంట..!?

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

- మొత్తం 18 మంది అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 9 స్థానిక సంస్థల నియోజకవర్గాలతో పాటు.. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న 7 స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఖరారు చేశారు. గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు స్థానాలకు సంబంధించిన అభ్యర్థులను కూడా సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించారు. మొత్తం 18 మంది అభ్యర్థుల వివరాలను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు. బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓసీలకు 4 కేటాయించారు.

సామాజిక వర్గాల వారీగా ఎమ్మెల్సీ అభ్యర్థులు

కోటా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	ఓసీ	మొత్తం
స్థానిక సంస్థలు	6	1	0	2	9
ఎమ్మెల్యేల కోటా	4	1	0	2	7
గవర్నర్ కోటా	1	0	1	0	2
మొత్తం	11	2	1	4	18

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

పేరు	సామాజికవర్గం	కులం	శాసనసభ నియోజకవర్గం	జిల్లా
నర్తు రామారావు	బీసీ	యాదవ	ఇచ్ఛాపురం	శ్రీకాకుళం
కుడిపూడి సూర్యనారాయణ	బీసీ	శెట్టి బలిజ	అమలాపురం	తూర్పుగోదావరి
వంకా రవీంద్రనాథ్	ఓసీ	కాపు	తణుకు	పశ్చిమగోదావరి
కవురు శ్రీనివాస్	బీసీ	శెట్టి బలిజ	పాలకొల్లు	పశ్చిమగోదావరి
మేరుగ మురళీధర్	ఎస్సీ	మాల	గూడూరు	శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు
సిపాయి సుబ్రమణ్యం	బీసీ	వన్నెరెడ్డి	శ్రీకాళహస్తి	చిత్తూరు
పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి	ఓసీ	రెడ్డి	జమ్మలమడుగు	వైఎస్సార్
ఎ.మధుసూదన్	బీసీ	వాల్మీకి బోయ	ఆదోని	కర్నూలు
ఎస్.మంగమ్మ(మాజీ ఎంపీ గంగాధర్ భార్య)	బీసీ	వాల్మీకి బోయ	పెనుకొండ	అనంతపురం

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు

పేరు	సామాజికవర్గం	కులం	శాసనసభ నియోజకవర్గం	జిల్లా
వీవీ సూర్యనారాయణరాజు పెన్మత్స	ఓసీ	క్షత్రియ	నెల్లిమర్ల	విజయనగరం
పోతుల సునీత	బీసీ	పద్మశాలి	చీరాల	బాపట్ల
కోలా గురువులు	బీసీ	వాడ బలిజ	విశాఖ సౌత్	విశాఖపట్నం
బొమ్మి ఇజ్రాయెల్	ఎస్సీ	మాదిగ	అమలాపురం	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
జయమంగళ వెంకటరమణ	బీసీ	వడ్డి	కైకలూరు	ఏలూరు
చంద్రగిరి ఏసురత్నం	బీసీ	వడ్డెర	గుంటూరు వెస్ట్	గుంటూరు
మర్రి రాజశేఖర్	ఓసీ	కమ్మ	చిలకలూరిపేట	పల్నాడు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ప్రతిపాదించిన అభ్యర్థులు

పేరు	సామాజికవర్గం	కులం	శాసనసభ నియోజకవర్గం	జిల్లా
కుంభా రవిబాబు	ఎస్టీ	ఎరుకల	అరకు	అల్లూరి సీతారామరాజు
కర్రి పద్మశ్రీ	బీసీ	వాడ బలిజ(మత్స్యకార)	కాకినాడ సిటీ	కాకినాడ

క్లుప్తంగా...

గవర్నర్‌కు కాగ్ నివేదిక

సాక్షి, అమరావతి: 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక అకౌంటింగ్ నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్)... గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు సమర్పించింది. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కాగ్ నివేదికను రాజ్యాంగంలోని ఆర్టికల్ 151(2) ప్రకారం గవర్నర్‌కు సమర్పించినట్లు కాగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

నేడు మాతృభాష సేవా శిరోమణి పురస్కారాల ప్రదానం

అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వేడుక నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. వివిధ భాషలకు చెందిన కోవిదులను, కళాకారులను ఒకే వేదికపైకి తెచ్చి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా సన్మానించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఉదయం విజయవాడలో జరిగే ఈ వేడుకలో మరాఠీ, పంజాబీ, ఒరియా, తమిళ, మలయాళ, ఉర్దూ, లంబాడీ, బంజారా, సంస్కృతం, హిందీ, గుజరాతి, అస్సామి, కొంకణి, ఆంగ్ల తదితర భాషలకు చెందిన 28 మందికి 'మాతృ భాష సేవాశిరోమణి' పురస్కారాలు ప్రదానం చేస్తారని తెలిపారు. వివిధ భాషల్లో నిష్ణాతులను ఒకే వేదికపైకి ఆహ్వానించి సత్కరించడం రాష్ట్రంలో ఇదే ప్రథమమన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్న వేడుకలో భాగంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తెలిపారు.

ఏబీడీఎంలో ఎనిమిది పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) కార్యక్రమం కోసం ఎనిమిది పోస్టుల భర్తీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు గడువు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 21 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కాగా, విద్యా, ఇతర అర్హతల వివరాలు నోటిఫికేషన్‌లో ఉన్నాయి. http://hmfw.ap.gov.in/ వెబ్‌సైట్‌లో పూర్తి నోటిఫికేషన్, ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. భర్తీ చేస్తున్న పోస్టుల్లో జాయింట్ డైరెక్టర్ (కో–ఆర్డినేషన్), ప్రాజెక్ట్ మేనేజర్, ఐటీసీ ఎక్స్‌పర్ట్, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మిగిలిన నాలుగు పోస్టులు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పోస్టులుగా ఉన్నాయి. అభ్యర్థులు తమ సమస్యలను, సందేహాలను apabdmrecruitment@gmail.comకు మెయిల్ చేయడం ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

ఏయూ వీసీపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో వీసీ ప్రసాదరెడ్డి రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకులు సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీడీపీ నేతలు నక్కా ఆనంద్ బాబు, అశోక్‌బాబు వెలగపూడిలో సీఈసీ ముఖేశ్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా యూనివర్సిటీలో వీసీ ప్రసాదరెడ్డి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

రూ.10 లక్షల జరిమానా



నిందితుడు ధనపాల్ రాజా

తిరుపతి లీగల్: తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా పోలూరు తాలూకా, ఇరుంజీ గ్రామానికి చెందిన ఎర్రచందనం స్మగ్లర్ ధనపాల్ రాజా కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నాగరాజు సోమవారం తీర్పు చెప్పినట్లు ఆ కోర్టు ఏపీపీ కె.నగేష్ తెలిపారు. కోర్టు కానిస్టేబుళ్లు నందకుమార్, శివకుమార్ తెలిపిన కేసులోని వివరాల మేరకు.. శేషాచలం అటవీ ప్రాంతంలోని ఎర్రచందనం దుంగల రక్షణ కోసం ఎస్‌వీఎన్‌పీ శ్యామల రేంజ్ నాగపట్ల సెక్షన్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ హరిబాబు, సిబ్బంది 2016 ఆగస్టు 29వ తేదీ సాయంత్రం కూంబింగ్ నిర్వహించారు. చెట్లు నరుకుతున్న శబ్దం విని పోలీసులు తోళ్లగుంట రిజర్వు ఫారెస్ట్ వద్దకు వెళ్లగా సుమారు 20 నుంచి 30 మంది స్మగ్లర్లు పోలీసులపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు తమ రక్షణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాలతో రెండు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో స్మగ్లర్లు పరారయ్యారు. 2016 ఆగస్టు 30వ తేదీ రాత్రి పోలీసులు అదే ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించి నిందితుడు ధనపాల్ రాజాని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి నిందితుడు ధనపాల్ రాజాకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ము చెల్లించని యెడల మరో రెండేళ్లు అధికంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

'బొమ్మ' అదిరింది..

భారీగా పెరుగుతున్న 'మేకిన్ ఇండియా' బొమ్మల ఎగుమతులు

రాష్ట్రంలో బొమ్మల తయారీకి సర్కారు ప్రోత్సాహం



2013-14లో రూ.167 కోట్లు ఉన్న ఎగుమతులు ఇప్పుడు రూ.2,601 కోట్లకు చేరిక

- ఇదే సమయంలో 70 శాతం పడిపోయిన దిగుమతులు
- 2018–19లో రూ.2,960 కోట్ల విలువైన బొమ్మల దిగుమతులు
- అదే 2021–22లో రూ.870 కోట్లకు పరిమితం
- వోకల్ ఫర్ లోకల్ టాయ్స్ పేరుతో స్థానిక బొమ్మలకు అంతర్జాతీయంగా డిమాండ్
- 2021–22లో రాష్ట్రం నుంచి రూ.3.66 కోట్ల ఎగుమతులు

సాక్షి, అమరావతి : దేశీయ బొమ్మల పరిశ్రమ దశ తిరిగింది. ఈ రంగం ఇప్పుడు వేగంగా విస్తరిస్తోంది. ఇంతకాలం చిన్నపిల్లల ఆట వస్తువుల కోసం దిగుమతులపై ఆధారపడిన భారత్ ఇప్పుడు ఏకంగా ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుంటోంది. కేవలం తొమ్మిదేళ్ల కాలంలో బొమ్మల ఎగుమతులు ఆరు రెట్లకు పైగా పెరిగాయి. 2013–14 ఆర్థిక సంవత్సరంలో దేశీయ బొమ్మల ఎగుమతులు రూ.167 కోట్లుగా ఉంటే అది 2021–22 నాటికి రూ.2,601 కోట్లకు చేరుకుంది. కానీ, దేశీయ ఎగుమతులు భారీగా పెరుగుతున్నప్పటికీ అంతర్జాతీయ బొమ్మల మార్కెట్లో ఇది ఒక శాతంలోపే ఉంది. ప్రస్తుతం అంతర్జాతీయ బొమ్మల ఎగుమతుల మార్కెట్ విలువ రూ.12,64,000 కోట్లుగా ఉంది. భారత్ నుంచి వీటిని దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉంది. ఇక దేశీయ బొమ్మల ఎగుమతుల్లో 77 శాతం అమెరికాకే జరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో దేశంలో బొమ్మల దిగుమతులు భారీగా పడిపోయాయి. 2018–19లో భారత్ రూ.2,960 కోట్ల విలువైన ఆట బొమ్మలను దిగుమతి చేసుకుంటే అది 2021–22 నాటికి 70 శాతం తగ్గి రూ.870 కోట్లకు పరిమితమయ్యింది. ఇందులో 90 శాతం చైనా నుంచే వస్తున్నాయి.

'వోకల్ ఫర్ లోకల్ టాయ్స్'తో సత్ఫలితాలు

మరోవైపు..స్థానిక ఆట బొమ్మలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వోకల్ ఫర్ లోకల్ టాయ్స్' విధానం సత్ఫలితాలిస్తోంది. దేశీయ ఆట బొమ్మల మార్కెట్‌ను ఎటువంటి ప్రమాణాల్లేని చైనా వస్తువులు ఆక్రమించడంతో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. స్థానిక చేతి వృత్తి కళాకారులు తయారుచేసే బొమ్మలకు ప్రచారం కల్పిస్తూనే మరోపక్క దిగుమతులకు అడ్డుకట్ట పడే విధంగా వివిధ ఆంక్షలను విధించింది. ముఖ్యంగా ఆటబొమ్మల దిగుమతులపై సుంకాన్ని 2020లో 20 శాతం నుంచి ఏకంగా 60 శాతానికి పెంచింది. అంతేకాక.. పిల్లల ఆరోగ్యంపై ఎటువంటి దుష్ప్రభావం చూపకుండా ఉండేందుకు దిగుమతి అయ్యే బొమ్మలపై క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్‌ను తప్పనిసరి చేసింది. ఇదే సమయంలో బొమ్మలు తయారు చేసే ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహించడానికి రూ.55.65 కోట్లతో ఒక ఫండ్‌ను ఏర్పాటుచేసింది.

రూ.3,500 కోట్లతో మరో పథకం

అదే విధంగా.. ఇతర దేశాలతో పోటీపడేలా బొమ్మల తయారీని పెద్దఎత్తున ప్రోత్సహించడానికి రూ.3,500 కోట్లతో ఉత్పత్తి ఆధారిత, ప్రోత్సాహక ఆధారిత పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో కేంద్రం ఉంది. ఈ చర్యలు రాష్ట్రంలోని బొమ్మల తయారీ కళాకారులకు చేయూతనిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందినఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కింద చేర్చి ఎగుమతులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో 2021–22లో రాష్ట్రం నుంచి రూ.3.66 కోట్ల విలువైన బొమ్మలు ఎగుమతి అయినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

స్టార్టప్స్ కేంద్రంగా విశాఖ



నూతన పారిశ్రామిక విధానంపై ప్రాథమిక సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త భవనం

2023 - 28 నూతన పారిశ్రామిక విధానంపై సీఎం జగన్ దిశా నిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఒక మంచి ప్రాంతాన్ని ఎంపిక చేసి, సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో స్టార్టప్స్ కోసం కొత్త భవనాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. అదే భవనంలో పరిశ్రమల శాఖ కార్యాలయం కూడా ఉండాలన్నారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో 2023 – 28 నూతన పారిశ్రామిక విధానంపై ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ఆలోచన దగ్గర నుంచి ఉత్పత్తి ప్రారంభించే వరకు పారిశ్రామికవేత్తలకు సహకరిస్తూ ప్రతి దశలో చేయి పట్టుకుని నడిపించే విధంగా నూతన పారిశ్రామిక విధానాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. కేవలం యూనిట్లను నెలకొల్పే విధంగా ప్రోత్సహించడమే కాకుండా, తయారైన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగంలో పోటీ చాలా ఎక్కువగా ఉంటుందని, సరైన మార్కెటింగ్ విధానాలను చూపించినప్పుడే అవి నిలదొక్కుకొని, అభివృద్ధి సాధించగలుగుతాయని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లతో ఎంఎస్ఎంఈలను అనుసంధానించాలని సూచించారు. యూనిట్ల ఏర్పాటుకు తగిన సూచనలు చేయడం మొదలు అవి ప్రారంభమయ్యే వరకు అన్ని దశల్లో ప్రభుత్వం చేయూత అందించే విధంగా ఎంఎస్ఎంఈ పాలసీ ఉండాలని నిర్దేశించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న పోర్టుల వద్ద పోర్టు ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించే విధంగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ దిశగా పారిశ్రామిక విధానంలో ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ఆర్థిక శాఖ కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, గుల్జార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

18 ఎమ్మెల్సీ పదవుల్లో 11 బీసీలకు ఇవ్వడంపై బీసీ సంఘాల హర్షం



విజయవాడలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి అమరావతి/విజయవాడ పశ్చిమ: వైఎస్సార్‌సీపీ తాజాగా ప్రకటించిన 18 ఎమ్మెల్సీ పదవుల్లో 11 బీసీలకు కేటాయించడంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ విజయవాడలో సోమవారం ఆయన చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించాయి. బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు మారేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహిధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్ వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, బీసీ నాయకులు హుస్సేన్, శేషగిరిరావు, తారక మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి ఒకటి నుంచి ఫేస్ రికగ్నిషన్

ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న టీటీడీ

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనం, లడ్డూ ప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు తదితర అంశాల్లో మరింత పారదర్శకత పెంచేందుకు వీలుగా మార్చి ఒకటో తేదీ నుంచి ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని టీటీడీ ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. సర్వదర్శనం కాంప్లెక్స్‌లో ఒకే వ్యక్తి అధిక లడ్డూ టోకెన్లు పొందకుండా నివారించడానికి, గదుల కేటాయింపు కేంద్రాలు వద్ద, కాషన్ డిపాజిట్ కౌంటర్ల వద్ద ఈ టెక్నాలజీని వినియోగిస్తారు. అదేవిధంగా దళారీలను ఏరివేసేందుకు కూడా ఇది ఎంతగానో దోహదపడనుంది. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 79,555 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టికెట్లు లేని వారికి ఆరు గంటల్లో దర్శనం లభిస్తోంది. శ్రీవారిని సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జయరామ్ ఠాకూర్, ఎస్పీఎఫ్ డీజీ సంతోష్ మెహ్రా, నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ (న్యూఢిల్లీ) దర్శించుకున్నారు.

శారీరక శ్రమతోనే ఎన్‌సీడీ సమస్యలకు చెక్

- నడక, వ్యాయామాలకు విద్యాసంస్థలు సహకరించాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: బీపీ, షుగర్, ఇతర నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) నుంచి బయటపడడానికి నడక, వ్యాయామం వంటి శారీరకశ్రమే శరణ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. ఆయన సోమవారం మంగళగిరిలోని తన కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ప్రైవేట్, ఎయిడెడ్, సాంకేతిక విద్యాసంస్థల యజమానులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సమస్యల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఎం జగన్ ఆదేశించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలను డ్రైవ్‌లా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. దీనికి ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు నడక, వ్యాయామాలు చేసుకోవడానికి వీలుగా స్థలాలు, క్రీడామైదానాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనిపై విద్యాసంస్థల యాజమాన్యాలు రెండు, మూడురోజుల్లో తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలపాలని కోరారు. రాష్ట్రంలో 1990లో 30 శాతం ఉన్న ఎన్‌సీడీ ప్రభావం ప్రస్తుతం 63 శాతానికి పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో 68 శాతం మరణాలకు ఎన్‌సీడీ సమస్యలే ప్రధాన కారణమన్నారు. ఈ క్రమంలో ఎన్‌సీడీ సమస్యల కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. 30 ఏళ్లు పైబడిన వారికి వైద్య శాఖ స్క్రీనింగ్ చేసి ఆరోగ్య సమస్యలు గుర్తిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఐదుగురిలో ఒకరు బీపీ/షుగర్‌తో ఉన్నట్టు తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, కమిషనర్ సురేష్‌బాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జగన్ మంటల్లో కాలిపోవడం ఖాయం: చంద్రబాబు



సాక్షి, అమరావతి: సీఎం జగన్ మంటల్లో కాలిపోవడం ఖాయమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శాపనార్థాలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ అరాచకాలు చేస్తుంటే పోలీసులు ఏ గాడిదలు కాస్తున్నారని ప్రశ్నిస్తూ ఆయన సోమవారం ఒక ట్వీట్ చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిని, వాహనాలను తగులబెట్టిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా చేశారని విమర్శించారు. పోలీసు శాఖను మూసేశారా, పోలీసు శాఖను వైఎస్సార్‌సీపీలో విలీనం చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని, కారకులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మళ్లీ చేతల్లో చూపాం

- అధికారం చేపట్టిన నాటి నుంచి బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకేప్రాధాన్యం
- ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో సీఎం జగన్ నిబద్ధత మరోసారి తేటతెల్లం
- మండలిలో 68.18 శాతం పదవులు ఆయా వర్గాలకే.. బాబు హయాంలో 37.5 శాతమే
- ప్రభుత్వ సలహాదారు సజ్జల



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేస్తున్న ప్రతి అడుగులో సామాజిక న్యాయం తన విధానమన్నది ప్రస్ఫుటంగా కనిపిస్తోందని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి సీఎం జగన్ మరోసారి పెద్ద పీట వేశారని చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

- 18 స్థానాలకు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేయగా బీసీలు 11 మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, నలుగురు ఓసీలు ఉన్నారు. స్థానిక సంస్థల్లో, శాసన సభలో వైఎస్సార్‌సీపీకి బలం ఉన్నందున ఎన్నిక లాంఛనప్రాయమే.
- 2014–19 మధ్య టీడీపీ హయాంలో శాసనమండలిలో టీడీపీకి 48 మంది ఎమ్మెల్సీలు ఉండగా ఓసీలకు 30 పదవులు (62.5 శాతం), బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 18 (37.5 శాతం) మాత్రమే ఇచ్చారు.
- శాసన మండలిలో నాడు చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 37.5 శాతం పదవులు మాత్రమే ఇవ్వగా ఇప్పుడు సీఎం జగన్ ఆయా వర్గాలకు 68.18 శాతం పదవులు ఇచ్చి సమున్నతంగా నిలిపారు. సామాజిక న్యాయంలో సీఎం జగన్, చంద్రబాబుకు మధ్య తేడా ఇదీ. దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో సామాజిక న్యాయం చేసిన దాఖలాలు లేవు.
- టీడీపీ అధి కారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యను చంద్రబాబు రాజ్య సభకు పంపకుండా మోసగించారు. ఆ తరువాత అధికారం కోల్పోయాక శాసనసభలో తగినంత బలం లేకున్నా రాజ్యసభ అభ్యర్థిగా ఆయన్ను పోటీకి నిలిపి సామాజిక అన్యాయానికి పాల్పడ్డారు.
- బీసీ అధ్యయన కమిటీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధ్యయన కమిటీల నివేదిక ఆధారంగా ఆయా వర్గాల సామాజిక సాధికారతకు కృషి చేస్తానని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. బీసీలను సమాజానికి బ్యాక్ బోన్ క్లాస్‌గా మార్చుతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట ప్రకారం కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకు సింహభాగం పదవులు ఇచ్చారు.
- సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాధికారత, పదవుల్లో సగభాగం వాటాతో మహిళా సాధికారత, అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం చదువులు, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యా సాధికారత తీసుకొచ్చి సీఎం జగన్ అడుగులు వేస్తున్నారు. సామాజిక న్యాయం చేయడమంటే ఇదీ అని దేశానికి చాటిచెబుతున్నారు.
- మరో ఏడాదిన్నరలో ఎన్నికలు ఉన్నందున చంద్రబాబు, ఎల్లో మీడియా రోజువారీ తోలు బొమ్మలను తెచ్చి ప్రదర్శనలు ఇస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చూస్తున్నారు.
- టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం జగన్ మాదిరిగా శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 68.18 శాతం పదవులు ఎందుకు ఇవ్వలేదని ప్రజలు చంద్రబాబును నిలదీయాలి. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఆయా వర్గాలకే రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తెచ్చి మరీ పదవులిచ్చిన సీఎం జగన్ తరహాలో చంద్రబాబుకు నిబద్ధత ఎందుకు లేదని ప్రశ్నించాలి.

'కానిస్టేబుల్' పరీక్షలకు 1 నుంచి వెబ్‌సైట్‌లో కాల్‌లెటర్లు

- మార్చి 1 నుంచి 10 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- పోలీసు నియామక మండలి వెల్లడి
- దేహదారుఢ్య పరీక్షలు మార్చి 13 నుంచి..
- ఏప్రిల్‌లో మెయిన్ పరీక్షలు..



సాక్షి, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకోసం దేహదారుఢ్య, మెయిన్ పరీక్షలకు కాల్ లెటర్లను మార్చి 1 నుంచి 10వ తేదీలోగా తమ వెబ్‌సైట్ slprb.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పోలీసు నియామక మండలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో 4,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకోసం ప్రిలిమినరీ పరీక్షను జనవరిలో నిర్వహించారు. అందులో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య, మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నారు. దేహదారుఢ్య పరీక్షలను మార్చి 13 నుంచి నిర్వహించాలని పోలీసు నియామక మండలి సూత్రప్రాయంగా నిర్ణయించింది. మెయిన్ పరీక్షను ఏప్రిల్ మొదటివారంలో నిర్వహించాలని భావిస్తోంది. ఈ పరీక్షల తేదీలను పోలీసు నియామక మండలి త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.

ఆక్వా.. వహ్వా..

- జోనేషన్ విధానం అమలు
- తద్వారా మరింతగా విస్తరణకు మత్స్యశాఖ ప్రణాళికలు
- నాన్ ఆక్వా జోన్ భూములను జోన్‌లోకి తీసుకువచ్చేందుకు చర్యలు
- తద్వారా రైతులకు మేలు



పెరవలిలో ఆక్వా సాగు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు, రైతులకు మరింత అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా జోనేషన్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు ఇప్పటికే సబ్సిడీపై విద్యుత్ అందజేస్తున్న విషయం తెలిసిందే. జోన్‌లో లేని వారిని సైతం ఇందులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకుగాను క్షేత్ర స్థాయిలో మత్స్య, విద్యుత్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన సర్వే నిర్వహించింది. ఆక్వా సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు, విద్యుత్ వినియోగం తదితర సమగ్ర వివరాలను 'ఈ–ఫిష్' యాప్‌లో నమోదు చేసింది. సర్వే ప్రారంభించిన మత్స్యశాఖ అధికారులు ఇంకా నమోదు చేసుకోని రైతులకు జోనేషన్ విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఆక్వా సాగు చేపట్టే ప్రతి రైతునూ జోన్ పరిధిలోకి తీసుకు వచ్చేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సర్వే, జోన్‌లో నమోదయ్యే భూముల వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీకి ఇప్పటికే సమర్పించారు. కమిటీ ఆమోద ముద్ర వేసిన అనంతరం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించనున్నారు. తద్వారా ప్రతి రైతుకూ సబ్సిడీపై విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశం నెరవేరనుంది.

జోన్ పరిధిలో 400 ఎకరాలే..

జిల్లాలో ఆక్వా రంగంపై ఆధారపడి 1,500 మందికి పైగా రైతులు జీవనం సాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల ఎకరాల్లో ఆక్వా (చేపలు, రొయ్యలు) సాగు జరుగుతోంది. ఇందులో అధికారికంగా 2,270 ఎకరాలు ఉంది. వీటన్నింటికీ మొత్తం విద్యుత్ కనెక్షన్లు 1000 ఉన్నాయి. అధికారిక సాగు విస్తీర్ణంలో 400 ఎకరాలు మాత్రమే ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయి. వీటిలో సబ్సిడీ విద్యుత్ అందుకుంటున్న సర్వీసులు 150 ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన వాటిని కూడా జోన్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివలన రైతులకు ఎంతో మేలు జరగనుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వలన హెక్టారు చెరువుకు నెలకు రూ.22 వేల వరకూ విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. అదే జోన్ పరిధిలో లేని చెరువులకు కేవలం రూ.8 వేలు మాత్రమే మిగులుతుంది.

విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నారిలా..

ఆక్వా రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల్లో రాయితీ ఇస్తోంది. పదెకరాల్లోపు, పదెకరాలకు పైబడి సాగు చేస్తున్న వారిగా విభజించి సబ్సిడీ ఇస్తోంది. గతంలో నాన్ జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.6.40కి ఇచ్చేవారు. దానిని ప్రభుత్వం రూ.3.85కు తగ్గించింది. ఆక్వా జోన్ పరిధిలో ఉన్న సాగుదార్లకు మాత్రం రూ.1.50కే సరఫరా చేస్తోంది.

నమోదు ఇలా..

ఆక్వా జోన్ పరిధిలోకి రావాలంటే తొలుత ఈ–ఫిష్‌లో నమోదవ్వాలి. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా నడుస్తోంది. పదెకరాల్లోపు విస్తీర్ణం కలిగిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఆక్వా సాగు చేసే పరిధిలోని సచివాలయంలో మత్స్యశాఖ ఉద్యోగి ద్వారా నమోదు చేసుకోవాలి. సాగు విస్తీర్ణ ధ్రువీకరణ పత్రాలు, సర్వే నంబర్, విద్యుత్ సర్వీస్ నంబర్, ఆధార్ కార్డు, మత్స్యశాఖ జారీ చేసిన లైసెన్స్, కార్డు సమర్పించాలి.

వెయ్యి ఎకరాలు ప్రతిపాదించాం



ఆక్వా సాగు చేస్తున్న ప్రతి రైతుకూ విద్యుత్ సబ్సిడీ అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా ఆక్వా జోన్ పరిధిలోకి రాని రైతులను అందులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. జోనేషన్ వలన రైతులకు కలిగే ప్రయోజనాలను గ్రామసభల ద్వారా వివరిస్తున్నాం. జోన్‌లోకి కొత్తగా మరో వెయ్యి ఎకరాలు తీసుకువచ్చేందుకు మంత్రి సారథ్యంలోని హైపవర్ కమిటీకి ప్రతిపాదించాం. కమిటీ నిర్ణయం అనంతరం విద్యుత్ సబ్సిడీ అందజేస్తాం.

– బి.కృష్ణారావు, ఫిషరీస్ జేడీ

వైభవంగా అమరేశ్వరుని రథోత్సవం



అమరేశ్వరుని రథోత్సవం

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా పల్నాడు జిల్లా అమరావతి క్షేత్రంలో శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దివ్య రథోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన చింకా, ఆలపాటి, కోనూరు, కామిరెడ్డి వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన దివ్య రథంపై ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుని కొలువు దీర్చారు. స్వామివారి రథోత్సవాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయ ఈవో సునీల్‌కుమార్, దేవాదాయశాఖ ఉత్సవ అధికారి శ్రీనివాసరావులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.



ఒక మనిషి ఆత్మలోకి చూడాలనీ, ఆ మనిషిని తెలుసుకోవాలనీ అనుకుంటే– అతడు ఎలా నవ్వుతున్నాడో గమనించండి. అతడు మంచిగా నవ్వితే అతడు మంచి మనిషి.

– ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 21

గుర్తింపుపై తొందరేల?!

ఆదమరిచివున్న ఉద్ధవ్ ఠాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) సర్కారును నిరుడు జూలై మొదటివారంలో పడగొట్టి ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన శివసేన చీలిక వర్గం నాయకుడు ఏక్‌నాథ్ శిందే చివరకు పార్టీని, విల్లు–బాణం చిహ్నాన్ని కూడా సొంతం చేసుకున్నారు. ఆయన వర్గమే అసలు సిసలు శివసేన అని ఎన్నికల సంఘం శనివారం ధ్రువీకరించి ఓ పని పూర్తిచేసింది. సర్కారు పతనమైనప్పుడు జరిగిన రాజకీయ పరిణామాలకు సంబంధించిన వివాదాన్ని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా లేదా అనే అంశంలో సుప్రీంకోర్టులోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ సాగిస్తుండగానే ఎన్నికల సంఘం నిర్ణయం వెలువడింది. దీంతో ముడిపడివున్న ఇతర అంశాలు సుప్రీంకోర్టు తేల్చవలసివున్నందున ఎన్నికల సంఘం నిర్ణయాన్ని వాయిదా వేయాలన్న ఉద్ధవ్ వర్గం వినతి వీగిపోయింది. పార్టీ ఎమ్మెల్యేలు 55 మందిలో 40 మంది...18 మంది ఎంపీల్లో 13 మంది శిందే వర్గంలో ఉన్నందువల్ల ఆ వర్గంవైపే మెజారిటీ ఓటర్లున్నట్టని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. ఉద్ధవ్ ఠాకరే వర్గం కోరినట్టు పార్టీ నియమావళి జోలికి పోనవసరం లేదని నిర్ణయించింది.

అసమ్మతిని సకాలంలో పసిగట్టలేకపోవటం, తిరుగుబాటు ఎమ్మెల్యేల మనోభావాలేమిటో, వారు కోరుకుంటున్నదేమిటో గుర్తించి ప్రభుత్వాన్ని కాపాడుకోలేకపోవటం ఉద్ధవ్ చేతకానితనమే. అయితే రాజకీయాలపై కనీస అవగాహన ఉన్నవారు సైతం ఎన్నికల సంఘం నిర్ణయంలోని మతలబును అర్థం చేసుకోలేరు. శివసేన అధినేత బాల్ ఠాకరే కన్నుమూశాక పార్టీ పగ్గాలు ఉద్ధవ్ చేతికొచ్చాయి. ఆయన నేతృత్వంలోనే 2019 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని శివసేన పోటీచేసింది. అనంతర పరిణామాలలో సీఎం పదవిని తొలి దఫాలో తమకు ఇవ్వటానికి నిరాకరించినందుకు ఎన్‌సీపీ, కాంగ్రెస్‌లతో చేతులు కలిపి ఎంవీఏ కూటమి సర్కారును ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో ఎక్కడా ఏక్‌నాథ్ శిందే స్వరం వినబడింది లేదు. ఉద్ధవ్ ఆశీస్సులతో ఆయన మంత్రి అయ్యారు. ఇంత స్పష్టంగా కనబడుతుండగా కొంతమంది ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ కూడగట్టుకున్నంత మాత్రాన పార్టీ ఆయనకే దక్కడమేమిటి? అసెంబ్లీలో ఉండే బలాబలాలే ప్రభుత్వ భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. సంఖ్యాబలం ఎవరికి అధికంగా ఉంటే వారిదే ప్రభుత్వం అవుతుంది. అసలు ఎమ్మెల్యేలు ప్రలోభపడి తమ రాజకీయ అభిప్రాయాలనూ, విశ్వాసాన్నీ వీడినంత మాత్రాన ఓటర్లు సైతం ఆ బాటే పట్టారని నిర్ధారణకు రావటం ఏం సబబు? ఇంతక్రితం పార్టీ వేరు...లెజిస్లేచర్ పార్టీ వేరు అనే విభజన ఉండేది. లెజిస్లేచర్ పార్టీలో జరిగే పరిణామాల ప్రభావం పార్టీపై ఉండేది కాదు. 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని హస్తగతం చేసుకున్న చంద్రబాబునాయుడు ఆ తర్వాత కూడా పార్టీనీ, పార్టీ గుర్తునూ కూడా కొల్లగొట్టారు. న్యాయస్థానాలు సైతం చంద్రబాబు నీతిమాలిన చర్యకు వత్తాసు పలకటం అప్పట్లో దేశవ్యాప్తంగా అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. 60వ దశకంలో ఇందిరా గాంధీ హయాంలో కాంగ్రెస్‌లో చీలిక వచ్చినప్పుడు ఏ వర్గం అసలైందో తేల్చటానికి మూడు గీటురాళ్లు నిర్ధారించారు. ఆ మూడూ– పార్టీ నియమావళి ఏం చెబుతుందో చూడటం, పార్టీలో మెజారిటీ పక్షం ఎవరివైపుందో తెలుసు కోవటం, చట్టసభలో అధికసంఖ్యాకులు ఎవరివైపున్నారో నిర్ధారించుకోవటం. 1996లో బాల్ ఠాకరే నాయకత్వంలో పార్టీ ఆమోదించిన నియమావళిపై 1999లో ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేసిందని, కానీ ఉద్ధవ్ 2018లో ఆ నిబంధనలే తిరిగి తెచ్చారని ఎన్నికల సంఘం ఇప్పుడంటున్నది. కొద్దిమంది గుప్పెట్లో అధికారాన్ని కేంద్రీకృతం చేసే ఆ నిబంధనలు అప్రజాస్వామికమని చెబుతోంది. అయితే 2019 ఎన్నికలకు ముందుగానీ, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాకగానీ ఆ విషయంలో ఎన్నికల సంఘం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కాదు.

శివసేనలో చీలిక వెనక కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి సర్కారుకు నాయకత్వంవహిస్తున్న బీజేపీ ఆశీస్సులున్నాయన్నది బహిరంగ రహస్యం. అసమ్మతి చిచ్చు రగిల్చినప్పుడే శిందే తన వర్గం ఎమ్మెల్యేల శిబిరంలో ఈ మాట చెప్పారు. ఇప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయం వెలువడ్డాక కూడా ఆ మాటే మరోసారి అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన వెనక కొండలా నిలబడతానని భరోసా ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకున్నారని ఒక కార్యక్రమంలో చెప్పారు. తమనుంచి పార్టీనీ, గుర్తునూ కొల్లగొట్టేందుకు రూ. 2,000 కోట్ల ఒప్పందం జరిగిందన్న శివసేన ఉద్ధవ్ వర్గం నాయకుడు సంజయ్ రౌత్ చేసిన ప్రకటనకు పెద్దగా విలువనివ్వాల్సిన అవసరం లేదు. సాక్ష్యాధారాల్లేకుండా మాట్లాడితే ఎవరూ విశ్వసించరు. ఆ మాటెలావున్నా వివాదానికి సంబంధించిన అనేక అంశాలు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నాయి గనుక అప్పటివరకూ ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని వాయిదా వేసివుంటే బాగుండేది. బృహన్ ముంబై కార్పొరేషన్ ఎన్నికలు ముంగిట్లో ఉన్నందున విల్లు–బాణం శిందేకు అప్పగించి ఆయనదే నిజమైన శివసేన అనే అభిప్రాయం కలిగించటానికి ఈసీ తహతహలాడిందని ఉద్ధవ్ వర్గం ఆరోపిస్తోంది. అందులో నిజానిజాల మాటెలా వున్నా ఇన్నేళ్ల అనుభవాల్లో ఫిరాయింపుల చట్టం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో తెలుస్తున్నది గనుక దాన్ని సవరించి మరింత సమగ్రమైన చట్టం తీసుకురావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు.
ఫాల్గుణ మాసం, తిథి: శు.పాడ్యమి ఉ.11.24 వరకు, తదుపరి విదియ.
నక్షత్రం: శతభిషం ఉ.11.23 వరకు, తదుపరి పూర్వాభాద్ర.
వర్జ్యం: సా.5.25 నుండి 6.56 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.33 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.44 వరకు.
అమృతఘడియలు: రా.2.30 నుండి 4.01 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

నివారించలేం, జననష్టం తగ్గించగలం

సుమారు 46,000 మందిని బలిగొన్న టర్కీ భూకంపంలో ఇంతటి భారీ ప్రాణనష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉండిందా? దాదాపు టర్కీ మొత్తం భూకంప ప్రమాద పరిధిలోనే ఉన్నప్పటికీ, ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి ఫలితంగా భవన నిర్మాణ నియంత్రణలు అమల్లోకి రాలేదు. భవిష్యత్తులో వచ్చే భూకంపాలను సమర్థంగా ఎదుర్కొనేందుకని 'భూకంప పన్ను' కూడా వసూలు చేశారు. ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు పెట్టారన్న విషయంలో అనేక ప్రశ్నలున్నాయి. ఈ మొత్తాన్నీ గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతోంది. భూకంప ముప్పును ఎదుర్కొనే విషయంలో టర్కీ వద్ద ఉన్న జ్ఞానానికీ, ఆచరణకూ మధ్య అంతరం ఉంది.



''ఇలాంటి విధ్వంసానికి సన్నద్ధంగా ఉండటం అసంభవం.'' ఫిబ్రవరి ఆరున టర్కీని భారీ భూకంపం తాకిన రెండు రోజులకు అత్యంత దారుణంగా దెబ్బతిన్న ప్రాంతంలో పర్యటించిన తర్వాత ఆ దేశ అధ్యక్షుడు రీజెప్ తాయిప్ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్య ఇది. నిజంగానే ఇంతటి విధ్వంసపు స్థాయి ఇంతకుముందు చూడనిదే. తెలతెల వారుతూండగానే 7.8 తీవ్రతతో భూకంపం రావడం, వేల మందిని బలితీసుకోవడం ఘోరమే. (సుమారు 46,000 మంది చనిపోయారని అంచనా.) అత్యంత హృదయ విదారకమైన ప్రకృతి వైపరీత్యాల్లో ఇదీ ఒకటి. అయితే, ఇంతటి ప్రాణనష్టాన్ని, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అవకాశం ఉండిందా? పూర్తిగా కాకపోయినా పాక్షికంగానైనా తగ్గించే వీలు లేకపోయిందా? అసాధ్యమని ఎవరైనా చెబితే అది రాజకీయ ప్రకటనే అవుతుంది. టర్కీకి భూకంపం ముప్పు ఉందని తెలిసినా అందుకు సన్నద్ధంగా లేకపోవడం కచ్చితంగా ఓ వైరుధ్యమే.

చేజారిన అవకాశాలు

భూకంప ముప్పునకు సంబంధించి టర్కీ ఒక వ్యూహను రూపొందించింది. 2018 లోనే దీన్ని సమీక్షించి, మార్పులు చేర్పులు చేసి ప్రచురించారు కూడా. దాని ప్రకారం దాదాపు దేశం మొత్తానికి భూకంప ప్రమాదం ఉంది. తూర్పు అనతోలియా ఫాల్ట్ జోన్, ఉత్తర అనతోలియా ఫాల్ట్ జోన్ రెండూ దేశాన్ని అల్లుకుని ఉన్నాయి! దాదాపు 1,400 కిలోమీటర్ల పొడవైన ఉత్తర అనతోలియా ఫాల్ట్ జోన్ టర్కీ ఉత్తరార్థ భాగంలో తూర్పు నుంచి పశ్చిమానికి ఉంది. దేశంలోని ప్రధాన నగరాలైన అంకారా, ఇస్తాంబుల్‌తో పాటు, పారిశ్రామిక వాడలు కూడా ఈ ఫాల్ట్ జోన్ వెంబడే ఉన్నాయి. మరోవైపు తూర్పు అనతోలియా ఫాల్ట్ జోన్ వెయ్యి కిలోమీటర్ల పొడవుతో దేశ ఆగ్నేయ ప్రాంతం గుండా ప్రయాణిస్తూంటుంది. లక్షల జనాభా ఉన్న చిన్న చిన్న నగరాలు, పల్లెలు ఈ జోన్‌లోనే ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు టర్కీ ఇప్పటికి చాలా ప్రయత్నాలే చేసింది. 1959లో ఆ దేశ పార్లమెంటు 'డిజాస్టర్ లా 7269'(విపత్తు చట్టం)ను ఆమోదించింది. ప్రకృతి వైపరీత్యాల నష్టాన్ని నివారించేందుకు ప్రణాళికలను రూపొందించాలనీ, జాతీయ స్థాయి నుంచి మున్సిపాలిటీల వరకూ నియమ, నిబంధనలు సిద్ధం చేయాలనీ తీర్మానించారు. ఈ ఏర్పాట్లన్నీ ప్రజల్లో భూకంప విపత్తుపై కొంత అవగాహనైతే పెంచాయి కానీ, 1990లలో గణనీయమైన స్థాయిలో ఉన్న ఐదు భూకంపాలు చోటు చేసుకున్నా మార్పులేమీ కనబడకపోవడంతో ఆ చట్టంపై ఆశలు సన్నగిల్లాయి.

1999లో మార్మరా ప్రాంతంలో వచ్చిన భూకంపాల్లో సుమారు 17 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తరువాత టర్కీ ప్రభుత్వం భూకంపాలను తట్టుకునే భవనాల నిర్మాణానికి, ప్రోత్సాహానికి ఒక కార్యక్రమం చేపట్టింది. అయినాసరే, ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి ఫలితంగా ఈ భవన నిర్మాణ నియంత్రణలు అమల్లోకి రాలేదు. భవిష్యత్తులో భూకంపాలు వస్తే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకని ప్రభుత్వం 'భూకంప పన్ను' పేరుతో పన్నులు వసూలు చేసింది కూడా. దీనిద్వారా సుమారు 460 కోట్ల అమెరికన్ డాలర్ల మొత్తం జమకూడింది. అయితే ఈ మొత్తాన్ని ఎలా ఖర్చు పెట్టారన్న విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తాయి.

2009లో టర్కీ 'నేషనల్ డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ అథారిటీ' (జాతీయ విపత్తు మరియు అత్యవసర పరిస్థితి నిర్వహణ సంస్థ) ఒకదాన్ని ఏర్పాటు చేసింది. విపత్తు నిర్వహణకు సిబ్బందిని సిద్ధం చేయడం, తద్వారా ప్రమాద నష్టాన్ని తగ్గించడం దీని ఉద్దేశం. రాష్ట్ర, మున్సిపాలిటీ స్థాయిల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, భూకంపాలు వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు వివరించడం దీని పని. 2014లోనూ టర్కీ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ప్లాన్ (జాతీయ విపత్తు సంసిద్ధతా పథకం) ఒకదాన్ని సిద్ధం చేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించాలో సూచించిందీ పథకం. పోషకాహారం, అత్యవసర గృహ వసతి, సమాచార వ్యవస్థలు.. ఇలా వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి వాటికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించారు.

2014లోనే సోమా ప్రాంతంలో భూగర్భ గనిలో ఓ అగ్ని ప్రమాదం చోటు చేసుకుని 301 మంది మరణించారు. ఈ ఘటనపై సమీక్షించిన టర్కీ ప్రభుత్వం జాతీయ విపత్తు పథక పునఃసమీక్షకు నిర్ణయించింది. జపాన్, అమెరికా, యూరప్ ప్రతినిధులతో కూడిన సలహా కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచించిన మార్పులను జాతీయ విపత్తు పథకంలో చేర్చారు. నిరంతర నిఘా, విపత్తు నిర్వహణ సిబ్బందికి మరింత ఆధునికమైన శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం, సంస్థల మధ్య సమన్వయం వంటి మార్పులు చేశారు. అయితే ఈ ప్రణాళికలను 2015 జనవరి నుంచే సైద్ధాంతికంగా అమల్లో పెడుతున్నట్లు నేతలు ప్రకటించారు కానీ, వాస్తవ ఆచరణ ఇప్పటికీ జరగలేదు. నేషనల్ డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ అథారిటీ నాయకత్వాన్ని మార్చడంతో సరిపెట్టింది ప్రభుత్వం. పైగా మంచి శిక్షణ, ఆధునిక సమాచార వ్యవస్థలు కావాలని కోరిన వారిని పదవుల నుంచి తప్పించింది. ఈ మార్పులు స్థానిక ప్రభుత్వాలపై తీవ్ర ప్రభావం చూపాయి.

జపాన్, కాలిఫోర్నియా పాఠాలు...

మార్పులు చేసిన నేషనల్ డిజాస్టర్ ప్లాన్ అమలు చేయకపోవడం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. భూకంప ముప్పును ఎదుర్కొనే విషయంలో టర్కీ వద్ద ఉన్న జ్ఞానానికీ, ఆచరణకూ మధ్య అంతరం ఉంది. భూకంపాలను ఎలాగూ ఆపలేము. కానీ వాటిని తట్టుకోగల భవనాలను నిర్మించవచ్చు. జపాన్, కాలిఫోర్నియాల్లో ఇదే జరిగింది. భూకంపాలను తట్టుకోగల భవనాలకు సంబంధించిన నియమావళిని టర్కీ రూపొందించింది. దేశంలో 1.50 లక్షల మంది సివిల్ ఇంజినీర్లు ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా రోడ్లు, భవనాలు, వంతెనలు ఎలా కట్టాలో వీరికి తెలుసు. అయితే ఇప్పటికే ఉన్న భవనాలను కొత్త ప్రమాణాల ప్రకారం కట్టేందుకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువ కావడంతో ఆ కార్యక్రమం చాలా నెమ్మదిగా సాగుతోంది. భవనాల డిజైన్ నియంత్రణలు 2000 సంవత్సరం నుంచే అమల్లో ఉన్నా, వాటి అత్యాధునిక అవసరాలను స్థానిక ఇంజినీర్లు పెద్దగా అర్థం చేసుకోలేకపోయారు. భవన నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకూ 2010 నుంచి ఒక కమిటీ ఉంది కానీ దేశంలోని కోటీ అరవై లక్షల భవనాలను పర్యవేక్షించ లేకపోతోంది.

భవిష్యత్తు దశ, దిశ

2023 ఫిబ్రవరి ఆరున సంభవించిన భారీ భూకంపంతో టర్కీ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. స్వల్పకాలికం మాత్రమే కాదు, సుదీర్ఘకాలం పనిచేయగల ప్రణాళికలు అత్యవసరంగా అమలు చేయాల్సిన పరిస్థితిని ఆ దేశం ఎదుర్కొంటోంది. గృహ నిర్మాణాన్ని ఇప్పటిలానే లోపాలతో కొనసాగించడమా, వ్యయప్రయాసలకు ఓర్చి అత్యాధునిక, దృఢమైన, మెరుగైన డిజైన్ కలిగిన భవన నిర్మాణాలను చేపట్టడమా అన్నది నిర్ణయించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయడం ద్వారా భూకంపాలతో వచ్చే ముప్పును గుర్తించే సమాజాన్ని సిద్ధం చేయాలి. అంతే కాకుండా తగిన ప్రణాళిక, ఆచరణలతో నష్టాన్ని తగ్గించవచ్చునన్న తెలివిడి కూడా వీరికి కలిగించాల్సిన అవసరం ఉంది.

– లూయిస్ కె. కంఫర్ట్, ప్రొఫెసర్, పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ
– పోలాత్ గుల్కన్, ప్రొఫెసర్, బాష్కెంట్ యూనివర్సిటీ
– బుర్చాక్ బాష్బూ ఎర్కాన్
అసోసియేట్ ప్రొఫెసర్, మిడిల్ ఈస్ట్ టెక్నికల్ యూనివర్సిటీ

('ద కాన్వర్సేషన్' సౌజన్యంతో)

సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గట్టి వ్యతిరేకత



క్యూబా, వెనిజులా కన్నా అత్యంత సామ్రాజ్యవాద వ్యతిరేక దేశాలు– ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్గానిస్తాన్.

– సమీరా ఖాన్, 'యాంటీ–వోక్' జర్నలిస్ట్

కష్టం చూల్లేదు



మూడేళ్లు ఇండియాలో నివసించిన తర్వాత, నేను గట్టిగా చెప్పగలిగింది ఏమంటే – చాలామంది అమెరికన్లకు కష్టపడి పనిచేయడం అంటే ఏమిటో తెలీదు.

– అమృత్ సింగ్, యూఎస్ ఆంట్రప్రెన్యూర్

తమదాకా వస్తే...



ఎవరైనా అక్రమంగా తుపాకీని కలిగివుంటే పాకిస్తాన్‌లో వాళ్లను తీవ్రవాదులు అంటారు, అదే వ్యక్తి నియంత్రణ రేఖను దాటి ఇండియాకు వస్తే 'ముజాహిద్' అవుతాడు. రాళ్లు విసిరేవాళ్లు పాకిస్తాన్‌లో తుంటరి మూక అవుతారు, కానీ జమ్ము కశ్మీర్‌లో అమాయకుడు అవుతాడు. తుపాకీ వాడటం అనేది జమ్ము కశ్మీర్‌లో ప్రతిఘటన అవుతుంది, అదే పాకిస్తాన్‌లో అయితే తీవ్రవాదం అవుతుంది.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ న్యాయవాది

హృదయంలో భారత్



నా పాస్‌పోర్టు నేను యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దాన్నని చెబుతుంది. కానీ నా హృదయం మేడ్ ఇన్ ఇండియా అంటుంది. ఇండియా నిజంగా ప్రపంచంలోని అత్యంత గొప్ప దేశాల్లో ఒకటి. నా జీవితాన్ని మార్చినందుకు నేను ఈ దేశానికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే.

– రెనీ లిన్, కాలమిస్ట్

భరించలేని పథకం



ప్రభుత్వంలో పని చేయడం అనేది ఎవరూ దేశానికి ఉపకారం చేస్తున్నట్టు కాదు. మీకు ప్రభుత్వోద్యోగపు షరతులు నచ్చకపోతే (ఉదాహరణకు కొత్త పింఛన్ పథకం) దయచేసి దాన్ని వదిలేసి, మరింత మెరుగైన ఉద్యోగం చూసుకోండి. పాత పింఛన్ పథకం అనే పరాన్న భోజనాన్ని ఇండియా భరించలేదు.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

ఎందుకింత సంక్లిష్టత?



ప్రియమైన రెస్టారెంట్ ఓనర్లు – మీరు బయట తినడం అనే అనుభవాన్ని ఈ క్యూఆర్ కోడ్లతో బరువుగా మార్చేస్తున్నారు. బహుశా ఇలాంటివి జనరేషన్ జడ్ కోసం ఉద్దేశించినవి. ఇతరుల సంగతేమిటి? అసలు బయట తినడం అనే ఆలోచనే ఈ ఫోన్ వైపు చూడకుండా ఉండే సౌకర్యం కోసం. నా ఫోన్‌తో పని పడేట్టయితే, నేను స్విగ్గీ వాడుకుంటాను కదా!

– మాహ్‌రుఖ్ ఇనాయత్, సంపాదకురాలు

నాసిరకం మనుషులు



ఒక ఎమ్మెల్యే కొడుకు, ఇంకా అతడి పెద్ద గ్యాంగు ఒక ఖరీదైన రెస్టారెంటులో భోంచేసి బిల్లు చెల్లించకపోవడం చూశాను. బిల్లు చెల్లించడానికి వాళ్ల దగ్గర డబ్బు లేక కాదు, ఆ సంస్కృతి లేక. ఎన్నికలు వస్తున్నాయి, కచ్చితంగా వాళ్లు అన్నింటికీ కలిపి తగిన మూల్యం చెల్లిస్తారు.

– శిశిర, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

బహుభాషా వాదమే శరణ్యం

సందర్భం



పి. విజయబాబు

మనిషిని మృగం నుంచి వేరు చేసింది భాష. మస్తిష్కంలోని భావాలను బయట పెట్టేది భాష. సమాజంలో చైతన్యాన్ని నింపేది భాష. ఇలా నాభిహృత్ కంఠ రసనాల నుంచి ఉద్భవించే భాష శతాబ్దాల కాలంలో ఎన్ని రకాలుగా రూపాంతరం చెందిందో, సంస్కృతి నాగరికతలకు ఎంత ఆలంబనగా నిలిచిందో, మనిషి విజ్ఞాన వినువీధుల్లో విహరించడానికి ఎంత పట్టుకొమ్మగా నిలిచిందో చర్చించనవసరం లేదు. అయితే కృత్రిమ మేధ నానాటికీ విస్తరిస్తున్న నేపథ్యంలో భాష భవిష్యత్తు గురించి ఇప్పుడు ప్రపంచ దేశాలూ, ప్రపంచ సంస్థలూ తీవ్రంగా చర్చిస్తున్నాయి. ఉన్న భాషల మధ్య సామీప్యం, సారూప్యం గురించి ఆలోచిస్తున్నాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో భిన్న సంస్కృతులు, భిన్న భాషల మధ్య వైవిధ్యాన్ని గౌరవిస్తూనే ఏకత్వాన్ని సాధించగలిగినప్పుడు విశాల విస్తృత సమాజాన్ని నిర్మించుకోగలమని యునెస్కో భావిస్తోంది. అందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలనే ఆలోచన చేసింది. ఇందుకు చొరవ చూపింది బంగ్లాదేశ్. 1999లో యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ ప్రతిఏటా అంతర్జాతీయ భాషా దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ భాషా దినోత్సవాలు జరుగుతున్నాయి.

యునెస్కో ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఈసారి అంటే 2023వ సంవత్సరానికి గాను... భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవిస్తూ, బహుభాషా వాదాన్ని ప్రోత్సహించాలని తీర్మానించింది. ఆ విధంగా ఈసారి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటున్నారు.

బహుభాషా వాదాన్ని ప్రోత్సహించినప్పుడే ప్రపంచంలో సుస్థిర సమాజాలను నిర్మించగలమనీ, జాతుల పేరుతో, సంస్కృతుల పేరుతో, ప్రాంతాల పేరుతో వైషమ్యాలు పెంచుకునే సంస్కృతి అంతరించి భిన్నత్వంలో ఏకత్వం అనే విశ్వాసం వేళ్లూనుకుంటుందనీ యునెస్కో భావించింది. భిన్న భాషలను నేర్చుకోవడం వల్ల ప్రపంచమే ఒక కుగ్రామం అనే నేపథ్యంలో ఏ ప్రాంతం వారు ఎక్కడైనా సరే సౌఖ్యంగా మనగలిగే పరిస్థితులు ఏర్పడతాయి.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా సరిగ్గా ఇదే ఆలోచన చేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఎక్కడైనా మనగలగాలంటే, తెలుగు భాషా సంస్కృతులు విశ్వజనీనం కావాలంటే... తెలుగు భాషతో పాటు చిన్నప్పటినుంచే ప్రపంచ భాషగా చలామణి అవుతున్న ఇంగ్లిష్‌ను నేర్చుకోవాలనీ, ఆ తర్వాత వారి వారి స్థాయిని బట్టి, వారి ఆసక్తిని బట్టి ఇతర భాషలు కూడా నేర్చుకోవచ్చనీ భావించారు. ఆ ఉద్దేశంతోనే ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల బోధన ప్రవేశ పెట్టారు.



మరోవైపు గత ప్రభుత్వాలు అటకెక్కించిన అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించి తెలుగు భాష ప్రాచుర్యానికీ, పరిపాలనలో తెలుగు భాష అమలుకూ కృషి చేస్తున్నారు.

భారతదేశంలో 19,500 కంటే ఎక్కువ భాషలు లేదా మాండలికాలు మాతృభాషగా వ్యవహారంలో ఉన్నాయి. 10,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే భాషలు 121 ఉన్నాయి. వీటిని రెండు భాగాలుగా పరిగణిస్తే– భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చిన భాషలు 22. దానిలో చేర్చని భాషలు 99.

8వ షెడ్యూల్లో చేర్చిన 22 భాషలు... అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, కొంకణీ, మలయాళం, మణిపురీ, మరాఠీ, నేపాలీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ, బోడో, సంథాలీ, మైథిలీ, డోంగ్రీ. తొలిగా 14 భాషలకు మాత్రమే రాజ్యాంగ గుర్తింపు ఇచ్చారు. తర్వాత సింధీని 1967లో, కొంకణీ, ఆపై 1992లో మణిపురీ, నేపాలీ; 2004లో బోడో, డోగ్రీ, మైథిలీ, సంథాలీ భాషలను కూడా చేర్చడమైంది. ఆ విధంగా మొత్తం 22 భాషలను రాజ్యాంగం గుర్తించినట్లయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా భాషలు అంతరించి పోతున్నాయని యునెస్కో ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రజా జీవితంలో మాతృభాష అభివృద్ధికి నిబద్ధతను చూపించే దిశగా అడుగులు వేసేందుకు స్ఫూర్తిని ఇవ్వాలని యునెస్కో భావిస్తోంది.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం 24వ ఎడిషన్ ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టింది. ఇందులో బహుభాషా విద్య – విద్యా విధానం మారవలసిన ఆవశ్యకత' ప్రధానమైనది. కేవలం మాతృభాషపై ఆధారపడితే మునుగడ కష్టసాధ్యమనీ, అందుకే బహు భాషావిద్య చాలా అవసరం అనీ యునెస్కో భావించింది. ఫిబ్రవరి 21న యునెస్కో నిర్వహించే కార్యక్రమంలో బహుభాషావాదం సంభావ్యతను అన్వేషిస్తుంది, చర్చిస్తుంది.

విస్తృత స్థాయిలో బహుభాషా విద్య ఆవశ్యకతను తెలియజెప్పటం, వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితులతో సహా, సంక్షోభ పరిస్థితుల్లో మనగలగడానికి బహుభాషా విద్యకు, బహుభాషా వాదానికి మద్దతు ఇవ్వడం రెండో అంశం. కనుమరుగవుతున్న లేదా అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న భాషలను పునరుద్ధరించడం మూడోది. ఈ ప్రధాన అంశాలపై విస్తృత స్థాయి ప్రచారం అవసరమని యునెస్కో భావించింది. తెలుగువారిగా మనం కూడా అమ్మ భాషను ఆదరిస్తూనే అన్య భాషలనూ అభ్యసిద్దాం!

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు

(నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)

భక్తిశ్రద్ధల బుధవారం

భస్మ బుధవారం క్రైస్తవులకు పవిత్రమైన రోజు. వీరు ఆచరించే 'లెంట్' కాలం భస్మ బుధవారంతో మొదలవుతుంది. ఈస్టర్‌కు ముందున్న నలభై ఆరు దినాలలో ఆదివారాలు మినహాయించగా మిగిలిన నలబది దినాలను 'లెంట్ దినాలు' అంటారు. లెంట్ అనగా లేచుట, చిగుర్చుట అని అర్థం. ఆంగ్లోశాక్సన్ పదం లెంక్టన్ నుండి లెంట్ అనే పదం వచ్చింది. లెంట్ దినాలను శ్రమల దినాలనీ, ఉపవాస దినాలనీ కూడా పిలుస్తారు. భస్మ బుధవారాన్ని లెంట్ బుధవారం అని కూడా కొందరు అంటారు.

భస్మ బుధవారం తేదీలు ప్రతి సంవత్సరం మారుతూ ఉంటాయి. సాధారణంగా ఫిబ్రవరి నాల్గవ తేదీ నుండి మార్చి పది మధ్య ఎప్పుడైనా భస్మ బుధవారం రావచ్చు. ఈ సంవత్సరం అనగా 2023లో భస్మ బుధవారం ఫిబ్రవరి ఇరవై రెండున వచ్చింది. 2024లో ఇది ఫిబ్రవరి 14న వాలెంటైన్ రోజున వస్తుంది. ఈ విధంగా తేదీలు మారడానికి గల కారణం దీనిని చాంద్రమానం ప్రకారం నిర్ణయించడమే. ఉత్తరాయణ సూర్యుడు భూమధ్య రేఖను దాటే సమయంలో మొదటి పౌర్ణమి తరువాత వచ్చే ఆదివారాన్ని ఈస్టర్‌గా నిర్ణయిస్తారు. ఈస్టర్‌కు ముందున్న ఏడవ బుధవారాన్ని భస్మ బుధవారం అని పిలుస్తారు. క్రీ.శ. 325లో నైసియా కౌన్సిల్ భస్మ బుధవారం తేదీలను పైవిధంగా నిర్ణయించాలని సూచించింది.

భస్మ బుధవారం పేరు ఎలా వచ్చిందో చూద్దాం. గత సంవత్సరం మట్టలాదివారం (పాల్మ్ సండే) రోజు వినియోగించిన ఖర్జూర మట్టలను దాచి, ఎండబెట్టి కాల్చగా వచ్చిన బూడిదను యాజకులు భద్రపరుస్తారు. ఈ బూడిదను ఎంతో పవిత్రంగా భావిస్తారు. దీనిని క్రైస్తవ యాజకులు తమ నొసట రుద్దుకొంటారు. తమ ఎదుట మోకరిల్లిన భక్తులకు వారి నుదుట అద్దుతారు. 'నీవు మట్టిలో నుండి వచ్చావు తిరిగి మట్టిలోనే కలిసిపోతావు గుర్తుంచుకో' అనే హెచ్చరిక అందులో ఇమిడి ఉంది. భక్తులలో ఒక ఆధ్యాత్మిక చింతన ఆరంభమవుతుంది. అంతే కాక ఈ బూడిద తగ్గింపు స్వభావానికీ, పశ్చాత్తాపానికీ, దుఃఖానికీ, నిరసనకూ సాదృశ్యంగా ఉంటుంది.

బైబిల్‌లో బూడిద ప్రస్తావన అనేకసార్లు రావడం గమనార్హం. 'బూడిదలో పడి పశ్చాతప పడుతున్నాను' అని యోబు భక్తుడు అన్నాడు. 'ఆ సంగతి నీనెవే రాజుకు వినపడినప్పుడు బూడిదలో కూర్చుండెను' అని రాజు తగ్గింపునకు క్షమాపణకు గుర్తుగా ఆ వాక్యం బైబిల్‌లో రాయబడింది. 'మొర్దెకై బూడిద పోసికొని రాజు గుమ్మము నొద్దకు వచ్చెను' అను వాక్యం తన బాధనూ, నిరసననూ మొర్దెకై తెలియజేసే సమయంలో రాయబడింది. ఇలాంటి సందర్భాలు బైబిల్‌లో కోకొల్లలు. భస్మ బుధవారం రోజును క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ విధంగా నలభైరోజులు ఉపవాస దినాలను క్రైస్తవులు పాటించి తమ జీవితాలను క్రమబద్ధీకరించుకుంటారు.

– పులుకూరి లాబాను ప్రభుదాసు, కావలి

(రేపు భస్మ బుధవారం)

క్లుప్తంగా...

లలితా త్రిపురసుందరీ దేవిగా చండీమాత



యజ్ఞాంని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష చండీ మహాయజ్ఞం పదవ రోజు సోమవారం విజయవంతంగా కొనసాగింది. ఇప్పటికి 69,120 హవనాలు పూర్తయ్యాయి. నిత్యం 1,760 మంది బ్రాహ్మణులు యజ్ఞంలో ఆహుతులు సమర్పిస్తూ రోజుకు 6,912 హవనాలు చేస్తున్నారు. యజ్ఞ భూమిలో చండీ మాత లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంటీ మాత విశేష పూజలు నిర్వహించారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నంది, కామధేను వాహనాలపై స్వామివారి దర్శనం



అధికార నంది-కామధేను వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులు

శ్రీకాళహస్తి రూరల్ (తిరుపతి జిల్లా)/ ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం స్కందరాత్రి ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారు అధికార నంది, అమ్మవారు కామధేను వాహనాలపై ఆశీనులై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్లు గజ వాహనం, సింహ వాహనాలపై ఊరేగుతూ కనువిందు చేశారు. అర్ధరాత్రి తర్వాత శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పలు జంటలు ఒక్కటయ్యాయి. నూతన వధూవరులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు మీద స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బంగారు తాళిబొట్లు, పట్టు వస్త్రాలు, పూలమాలలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు. జ్ఞాన ప్రసూనాంబికాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్లకు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ సోమవారం పట్టు వస్త్రాలు సమర్పించారు.

గెలిపించి ఉంటే కేంద్రమంత్రి అయ్యేదాన్ని!


- నాలాంటి వారి ప్రతిభ వృధా కాకూడదనే గవర్నర్ పదవులు: తమిళిసై
- నేను పనిచేస్తుంటే కన్నా.. పడి పోతేనే పెద్దవార్త అవుతోంది
- రెండు రాష్ట్రాలనే పర్యవేక్షిస్తున్నా.. రెండు ఫోన్లను భరించలేనా?
- తమిళనాడు పర్యటనలో గవర్నర్ సరదా వ్యాఖ్యలు




సాక్షి, చెన్నై: తన లాంటి ప్రతిభావంతులను ప్రజలు గుర్తించడం లేదని తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. తనలాంటి వారి ప్రతిభ వృథా కాకూడదనే కేంద్ర ప్రభుత్వం గవర్నర్ పదవులు అప్పగించిందన్నారు. సోమవారం తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన స్టాఫ్ డే (ఉద్యోగ దినోత్సవం) కార్యక్రమంలో తమిళిసై ప్రసంగించారు. తాను ఈ కార్యక్రమానికి వచ్చే సమయంలో ఓ పెద్దాయన తన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను చూసి, రెండు ఫోన్లను ఎలా భరిస్తున్నారని ప్రశ్నించారని చెప్పారు. తాను రెండు రాష్ట్రాలనే పర్యవేక్షిస్తున్నప్పుడు.. ఈ రెండు ఫోన్లను భరించలేనా? అని సమాధానం ఇచ్చానని వివరించారు. ఇక ఆదివారం ఓ కార్యక్రమంలో తాను కిందపడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'రోజుకు 48 గంటలు ఉన్నా కూడా నేను పనిచేయడానికి సిద్ధం. అయినా నేను కిందా మీదా పడి పనిచేస్తుంటే అది వార్తగా రావడం లేదు. అదే కింద పడితే మాత్రం అతిపెద్ద వార్తగా వచ్చేస్తున్నాయి' అని తమిళిసై చమత్కరించారు. రాజకీయాల్లో ఆమె ప్రస్థానంపై మీడియా అడిగిన పలు ప్రశ్నలకూ ఆసక్తికరంగా సమాధానమిచ్చారు. 'తమిళ ప్రజలు నన్ను గుర్తించలేదు. గుర్తించి ఉంటే పార్లమెంట్ వెళ్లి, ఆ తర్వాత కేంద్రమంత్రిని కూడా అయ్యేదాన్ని. ప్రజలు ఓడించినా నాలాంటి వారి ప్రతిభ వృధా కాకూడదనే ఉద్దేశంతోనే కేంద్రం గవర్నర్ పదవులను కేటాయిస్తోంది' అని పేర్కొన్నారు.

రెండు రెట్లు కడలి పాలు

- ఏటా **46,224.32** టీఎంసీలు సముద్రంలోకి
- దేశంలోని నదుల్లో **70,591.75** టీఎంసీల లభ్యత
- ప్రస్తుతం వినియోగించుకుంటున్నది **24,367.43** టీఎంసీలే
- జలాశయాల నిల్వ సామర్థ్యం **9,103.34** టీఎంసీలు
- మన రాష్ట్రంలోని 166 జలాశయాల నిల్వ సామర్థ్యం **983.59** టీఎంసీలు
- జనాభాకు అనుగుణంగా పెరగని తలసరి నీటి లభ్యత
- 2051 నాటికి **1,228** క్యూబిక్ మీటర్లకు తగ్గిపోయే ప్రమాదం
- నదీ జలాలను మళ్లించకుంటే తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులే
- కేంద్ర జలసంఘం తాజా అధ్యయనంలో వెల్లడి





సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా తాగు, సాగునీటి కోసం వినియోగిస్తున్న నదీ జలాల కంటే దాదాపు రెండు రెట్లు అధికంగా కడలి పాలవుతున్నట్లు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నదీ జలాలను మళ్లించకుంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని హెచ్చరించింది. దేశంలో సగటు వర్షపాతం, నదుల్లో ప్రవాహం, ఉపయోగించుకోదగిన జలాలు, ప్రస్తుతం వాడుకుంటున్న నీరు, భవిష్యత్ అవసరాలపై సీడబ్ల్యూసీ సమగ్రంగా అధ్యయనం చేసింది. అందులో ప్రధానాంశాలు ఇవీ..

- దేశంలో ఏటా సగటున 1,298.6 మి.మీ. వర్షపాతం కురుస్తోంది. వర్షపాతం రూపంలో 1,37,002.08 టీఎంసీల నీరు లభ్యమవుతోంది.
- వర్షపాతం వల్ల గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా నదుల్లో ప్రవాహం రూపంలో 70,591.75 టీఎంసీలు లభిస్తుండగా ప్రస్తుతం జలాశయాల ద్వారా 24,367.43 టీఎంసీలను ఉపయోగించుకుంటున్నాం. అంటే ఏటా 46,224.32 టీఎంసీలు కడలిలో కలుస్తున్నట్లు స్పష్టమవుతోంది. వాడుకుంటున్న నీటి కంటే దాదాపు రెండు రెట్లు అధికంగా నదీ జలాలు కడలిలో కలుస్తున్నట్లు వెల్లడవుతోంది.
- దేశవ్యాప్తంగా వివిధ నదులపై నిర్మించిన 5,745 డ్యామ్‌ల నీటి నిల్వ సామర్థ్యం 9,103.34 టీఎంసీలు. ఈ డ్యామ్‌లలో నీటిని నిల్వ చేస్తూ సాగు, తాగునీటి అవసరాల కోసం 24,367.43 టీఎంసీలను వాడుకుంటున్నాం.
- ఆంధ్రప్రదేశ్‌లో 166 డ్యామ్‌ల నిల్వ సామర్థ్యం 983.59 టీఎంసీలు. 1.05 కోట్ల ఎకరాలకు నీళ్లందించేలా ఆయకట్టును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది.
- దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జలాశయాలను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించకుంటే సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవు.
- నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపర్చకుంటే ఆహార ధాన్యాల దిగుబడి పెరగదు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగకుంటే ఆహార సంక్షోభానికి దారి తీస్తుంది.
- దేశంలో ప్రజల రోజువారీ అవసరాలు, తాగు నీటి కోసం తలసరి నీటి లభ్యత 2001లో 1,816 క్యూబిక్ మీటర్లు (వెయ్యి లీటర్లు ఒక క్యూబిక్ మీటర్‌కు సమానం) ఉంది. 2011 నాటికి 1,545 క్యూబిక్ మీటర్లకు, 2021 నాటికి 1,486 క్యూబిక్ మీటర్లకు తగ్గిపోయింది. నదీ జలాలను మళ్లించకుంటే తలసరి నీటి లభ్యత 2031 నాటికి 1367 క్యూబిక్ మీటర్లకు, 2041 నాటికి 1282 క్యూబిక్ మీటర్లకు, 2051 నాటికి 1228 క్యూబిక్ మీటర్లకు తగ్గుపోతుంది. తాగు, రోజువారీ అవసరాల కోసం నీటి కొరత తీవ్రమవుతుంది.

ఘనంగా శ్రీముఖలింగంలో త్రిశూల చక్రతీర్థ స్నానం

జలుమూరు: శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత శ్రీముఖలింగం పుణ్యక్షేత్రంలో సోమవారం స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానం ఘనంగా జరిగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఈ క్రతువు నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఊరేగించి వంశధార మిరియాపల్లి రేవుకు తీసుకెళ్లారు. భారీగా తరలివచ్చిన భక్తజనం మధ్య భక్తిశ్రద్ధలతో త్రిశూల చక్రతీర్థ స్నాన కార్యక్రమం జరిపారు.



వంశధారలో భక్తజనం మధ్య శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం

సరుకు రవాణాలో టార్గెట్‌ను చేరిన
విజయవాడ రైల్వే డివిజన్

- ఈ ఆర్థిక సంవత్సరంలో 30.1 మిలియన్ టన్నుల రవాణా
- 40 రోజుల ముందుగానే లక్ష్యం పూర్తి



సరుకు రవాణ చేస్తున్న గూడ్స్ రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌కు 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన లక్ష్యాన్ని 40 రోజులు ముందుగానే చేరుకున్నట్లు సీనియర్ డీసీఎం వి.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30.1 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించగా, ఈ నెల 19వ తేదీన లక్ష్యాన్ని చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి వరకు విజయవాడ డివిజన్ రూ.4,407 కోట్లు ఆదాయం పొందగా, దానిలో సరుకు రవాణా వాటా రూ.3,309.74 కోట్లు అని తెలిపారు. సరుకు రవాణాలో వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లడం ద్వారా విజయవాడ డివిజన్ 2018–19 ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యధిక ఆదాయం అయిన రూ.5,136 కోట్లు మైలురాయిని అధిగమించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ ఘనత సాధించడంపై సీనియర్ డీసీఎం రాంబాబు, సీనియర్ డీవోఎం ఎస్.నరేంద్రవర్మ, ఇతర అధికారులను డీఆర్‌ఎం శివేంద్రమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

మల్లన్న సేవలో గవర్నర్ దంపతులు



ఆలయ ఆవరణలో గవర్నర్ దంపతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన గవర్నర్ దంపతులకు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో గవర్నర్ దంపతులకు ఆశీర్వచనాలు, స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందించి సత్కరించారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలు వద్దు

- ప్రభుత్వ ఖర్చుతోనే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు
- రైతులు పైసా చెల్లించాల్సిన అవసరం ఉండదు
- ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న జస్టిస్ నాగార్జునరెడ్డి. పక్కన రామ్‌సింగ్, రాజగోపాలరెడ్డి

తిరుపతి రూరల్: వినియోగదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 18వ రాష్ట్రస్థాయి సలహామండలి(ఎస్ఏసీ) సమావేశం జరిగింది. అనంతరం జస్టిస్ నాగార్జునరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. ప్రభుత్వ ఖర్చుతోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని, రైతుల నుంచి ఎటువంటి చార్జీలను వసూలు చేయడం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసినట్లు చెప్పారు. రానున్న 30ఏళ్ల పాటు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు 'సెకీ' ద్వారా ఇప్పటికే ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా 75 కేంద్రాల నుంచి వినియోగదారులు తమ సూచనలు, సలహాలను తెలియజేశారని వివరించారు. డిస్కంలు ప్రతిపాదించిన విద్యుత్ చార్జీల పెంపు అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయం

- 876వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసిన జగనన్నకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బహుజనులు జీవితాంతం రుణపడి ఉంటారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 876వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎప్పుడైనా బహుజనులకు న్యాయం చేశాడా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని వదిలేసిన చంద్రబాబు కేవలం తన సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తూ పదవులను దోచిపెట్టి మిగిలిన వర్గాలను నిలువునా మోసం చేశాడన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల ఎంపికలో సామాజికంగా పేదలకు ఉన్నత స్థానం కల్పించిన జగనన్న బహుజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని చెప్పారు. బాబు అండ్ కో అమరావతి పేరుతో ఆడుతున్న నాటకాలకు ఇక పూర్తిగా తెరపడడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి కోడెదూడ అరుదైన రికార్డు

- నాదెండ్లకు చెందిన కోడెదూడకు గిన్నిస్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- 25 నెలల వయసులో 65 అంగుళాల ఎత్తుతో ప్రత్యేక గుర్తింపు



రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న వేణుగోపాలరావు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన ఒంగోలు జాతి కోడెదూడ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. 25 నెలల వయసు గల ఈ ఒంగోలు జాతి కోడెదూడ 65 అంగుళాల ఎత్తు పెరిగి రికార్డు సృష్టించింది. ఈ మేరకు ఒకేసారి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. సాధారణంగా ఈ వయసు గల కోడెదూడలు 60 అంగుళాలలోపే ఎత్తు పెరుగుతాయి. కానీ, నాదెండ్లకు చెందిన రైతు నల్లమోతు వేణుగోపాలరావు వద్ద ఉన్న ఒక కోడెదూడ మాత్రం 25 నెలల్లో 65 అంగుళాల ఎత్తు పెరిగి రికార్డు నెలకొల్పింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన తెలంగాణలోని మేళ్లచెరువులో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించగా, వేణుగోపాలరావుకు చెందిన ఎడ్ల జత 10 నిమిషాల వ్యవధిలో 3,671.10 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎడ్ల జతలోని 25 నెలల వయసు కలిగిన ఒక కోడెదూడ 65 అంగుళాల ఎత్తు ఉండటాన్ని గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధి బింగి నరేంద్ర గౌడ సర్టిఫికెట్లను వేణుగోపాలరావుకు అందించారు.

శ్రీశైల మహాక్షేత్రంలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వైభవంగా నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువుకు సోమవారం పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వారి యాగశాలలో వేదపండితులు చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి రుద్రహోమ పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజ పతాకావరోహణ చేశారు. అనంతరం సదస్యం–నాగవల్లి కార్యక్రమాలు చేపట్టారు. ఆయా పూజా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో ఎస్.లవన్న పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు మంగళవారం సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి అశ్వవాహన సేవ, ఊరేగింపు, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

జోగయ్య వ్యాజ్యం పిల్ కిందకు వస్తుంది

- స్పష్టం చేసిన హైకోర్టు
- ఫైల్‌ను సీజే ముందుంచాలని రిజిస్ట్రీకి జస్టిస్ రఘునందన్‌రావు ఆదేశం

సాక్షి, అమరావతి: ఉన్నతవర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్) వారికి రిజర్వేషన్లకు సంబంధించి కాపు సంక్షేమసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈడబ్ల్యూఎస్ వారికి విద్య, ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్టానికి అనుగుణంగా రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతంలో తెచ్చిన చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని సంబంధిత బెంచ్ ముందుకు వచ్చేందుకు వీలుగా కేసు ఫైల్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సర్కారు వరం

- మాటల వంటకం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించుకున్న జగన్ సర్కారు
- బడ్జెట్‌లో డైట్ చార్జీలకు రూ.755 కోట్లు.. కాస్మోటిక్ చార్జీలకు రూ.78 కోట్లు కేటాయింపు
- తాజా పెంపుతో డైట్ చార్జీలకు రూ.112 కోట్లు.. కాస్మోటిక్ చార్జీలకు రూ.48 కోట్లు అదనపు కేటాయింపు
- బలహీన వర్గాల సంక్షేమంపై వైఎస్సార్‌సీపీ సర్కారు చిత్తశుద్ధికి ఇది నిదర్శనం
- కానీ, డైట్ చార్జీలు సక్రమంగా అమలుచేయని చంద్రబాబుపై ఈనాడుకు ఎక్కడలేని ప్రేమ
- డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే తరుణంలో ఈనాడు దుష్ప్రచారం



సాక్షి, అమరావతి: బలహీన వర్గాల పిల్లల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తన చిత్తశుద్ధిని చాటుకుంది. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపు విషయంలో ఎల్లో మీడియా ఎంత రాద్ధాంతం చేసినా తమది మాటల వంటకం కాదని.. చేతల ప్రభుత్వమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా నిరూపించారు. ఈ ఛార్జీల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం జీఓ–8, 9 ఉత్తర్వులు జారీచేశారు.

బడ్జెట్‌లో కన్నా అధికంగా కేటాయింపు

రాష్ట్రంలో ప్రస్తుతం సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో డైట్ చార్జీలకు రూ.755 కోట్లు, కాస్మోటిక్ చార్జీలకు రూ.78 కోట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. తాజాగా.. ఈ చార్జీలను పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు రూ.160 కోట్ల అదనపు భారం పడుతుంది. వీటిలో డైట్ చార్జీలకు రూ.112 కోట్లు, కాస్మోటిక్ చార్జీలకు రూ.48 కోట్లు ప్రభుత్వం అదనంగా కేటాయిస్తోంది. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల విషయంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సర్కారుకు వారిపట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో రాష్ట్రంలో 5.92 లక్షల మంది బడుగు, బలహీనవర్గాల పిల్లలకు మేలు చేకూరుతుంది.

బాబు బకాయిలు రూ.132 కోట్ల చెల్లింపు

నిజానికి.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ చార్జీలను 2012లో పెంచారు. అప్పటి నుంచి ఆరేళ్లపాటు వాటిని పట్టించుకున్న నాథుడే లేడు. 2019 ఎన్నికలకు ముందు హడావుడిగా, మొక్కుబడిగా 2018 జూన్ 5న డైట్ చార్జీలు పెంచుతూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీనిని 2018 జూలై 1 నుంచి అమలులోకి తెచ్చారు. కానీ, వాటిని కూడా సక్రమంగా అమలు చేయలేదు. 2018 జూలై నుంచి 2019 ఫిబ్రవరి వరకు కేవలం ఎనిమిది నెలల కాలానికి మాత్రమే తూతూమంత్రంగా అమలుచేసింది. పైగా డైట్ చార్జీలు చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది. దీంతో రూ.132 కోట్ల బకాయిలను సీఎం వైఎస్ జగన్ సర్కార్ చెల్లించింది.

చంద్రబాబు కోసమే ఈనాడు వంకర రాతలు

వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, ఇతర సంక్షేమ విద్యా సంస్థల్లోని బోర్డర్ల (విద్యార్థులు)కు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచేందుకు సీఎం వైఎస్ జగన్ పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ఏర్పాటుచేసిన కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు రూపొందించారు. వాటిని సర్కారు ఆమోదించే తరుణంలో చంద్రబాబు ప్రయోజనాల కోసం 'మాటల వంటకం' అంటూ ఈనాడు ఇటీవలే విషప్రచారం చేసింది.

తాజా జీఓ ప్రకారం ఒక్కో విద్యార్థికి నెలకు డైట్ చార్జీలు ఇలా.. (రూపాయల్లో)

తరగతి	సంస్థలు	ప్రస్తుతం	పెంచింది
3, 4	అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, హోమ్స్	1,000	1,150
5 నుంచి పది	అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు,	1,250	1,400
ఇంటర్, ఆపైన	అన్ని మెట్రిక్ విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ కాలేజీలు	1,400	1,600

ఒక్కో విద్యార్థికి నెలకు కాస్మోటిక్ చార్జీలు ఇలా.. (రూపాయల్లో)

తరగతి	ఎవరికి	ప్రస్తుతం	పెంచింది
3 నుంచి 6	బాలురు	100	125
3 నుంచి 6	బాలికలు	110	130
7 నుంచి పది	బాలురు	125	150
7 నుంచి పది	బాలికలు	160	200
ఇంటర్, ఆ పైన	బాలురు	125	200
ఇంటర్, ఆపైన	బాలికలు	160	250

జుట్టు కత్తిరింపునకు మూడు నుంచి ఆ పైన తరగతుల బాలురుకు రూ.30 నుంచి రూ.50కు పెంచారు.

క్లుప్తంగా...

మోదీ వివాదాస్పద వ్యక్తి!

మస్క్‌తో కలిపి ఒకేగాటన కట్టిన చాట్‌జీపీటీ
జాబితాలో పుతిన్, ట్రంప్, బోరిస్, బోల్సొనారో

న్యూయార్క్: ప్రధాని నరేంద్ర మోదీని 'వివాదాస్పద వ్యక్తి'గా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీ పేర్కొంది! ప్రపంచ కుబేరుడు, ట్విట్టర్ సీఈఓ ఎలాన్ మస్క్‌ను 'అత్యంత వివాదాస్పద వ్యక్తి'గా అది ఇటీవలే పేర్కొనడం తెలిసిందే. ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖుల్లో వివాదాస్పదుల జాబితాను చాట్‌జీపీటీ తాజాగా వెల్లడించింది. అందులో మోదీతో పాటు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సొనారో, బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ తదితరులున్నారు. వీరందరినీ ప్రత్యేకంగా పరిగణించాల్సి ఉంటుందని కూడా చాట్‌జీపీటీ పేర్కొనడం విశేషం. వివాదాస్పదులు కాని వారి జాబితాలో అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, మాక్రాన్, కుబేరులు బిల్ గేట్స్, జెఫ్ బెజోస్ తదితరులను పేర్కొంది.

26న సీబీఐ ముందు హాజరవనున్న సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈ నెల 26వ తేదీన విచారణకు రావాలంటూ ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు సీబీఐ తాజాగా నోటీసులు పంపింది. ఈనెల 19వ తేదీనే ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నందున వచ్చే వారం వస్తానంటూ ఆయన ఆదివారం ఈడీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో, విచారణ తేదీని 26వ తేదీకి మారుస్తూ తాజాగా సమన్లు జారీ చేసినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి.

25, 26 తేదీల్లో భారత్‌లో జర్మనీ అధ్యక్షుని పర్యటన

న్యూఢిల్లీ: జర్మనీ అధ్యక్షుడు ఒలాఫ్ షోల్జ్ ఈ నెల 25, 26వ తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఏడాది క్రితం అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షోల్జ్ భారత్ రానుండటం ఇదే మొదటిసారి. సీనియర్ అధికారులు, ఉన్నత స్థాయి వాణిజ్య ప్రతినిధి వర్గంతో 25న ఆయన ఢిల్లీకి చేరుకుంటారని విదేశాంగ శాఖ తెలిపింది. షోల్జ్, ప్రధాని మోదీ పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరుపుతారు. 26న బెంగళూరులో జరిగే కార్యక్రమాల్లో జర్మనీ అధ్యక్షుడు షోల్జ్ పాల్గొంటారు. అదేవిధంగా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ కూడా మార్చి 8వ తేదీన భారత్‌లో పర్యటనకు రానున్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు తదితర అంశాలపై ఆయన ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరుపుతారు. ఇరువురు నేతలు కలిసి అహ్మదాబాద్‌లో జరిగే భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌ను తిలకించనున్నారు. ఈ పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

విద్వేషమే విడదీసింది!

ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య దశాబ్దాల వైరం

ఉభయ దేశాల యుద్ధంలో లక్షలాది మంది బలి ● కిమ్ వరుస క్షిపణి ప్రయోగాలతో ఉద్రిక్తతలు

ఉత్తర కొరియా. ప్రపంచంలో దూర్త దేశాల్లో ఒకటిగా అగ్రరాజ్యం అమెరికాతోపాటు యూరప్ దేశాలు గుర్తించిన దేశం. అమెరికా హెచ్చరికలను ఖాతరు చేయకుండా వరుస క్షిపణి ప్రయోగాలతో దూకుడు ప్రదర్శిస్తోంది. యథేచ్ఛగా ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది. అణ్వాయుధాలకూ పదును పెడుతోంది. తమవైపు కన్నెత్తి చూస్తే ఖబడ్దార్ అంటూ ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ హెచ్చరిస్తున్నారు. అమెరికా–దక్షిణ కొరియా కూటమి సంయుక్తంగా సైనిక విన్యాసాలపై మండిపడుతున్నారు. తాజాగా 48 గంటల వ్యవధిలో రెండుసార్లు క్షిపణి ప్రయోగాలు జరిపారు! ఉభయ కొరియాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతుండటం ప్రపంచ దేశాలను ఆందోళన పరుస్తోంది. వీటి మధ్య ఇంతటి విద్వేషానికి కారణమేమిటి...? **- సాక్షి, నేషనల్ డెస్క్**



ఉత్తర, దక్షిణ కొరియాల శత్రుత్వానిది దశాబ్దాల చరిత్ర. స్వతంత్ర దేశమైన ఉమ్మడి కొరియా ద్వీపకల్పాన్ని 1910లో జపాన్ ఆక్రమించుకుంది. 1945 దాకా నిరంకుశ పాలనలో కొరియా మగ్గిపోయింది. జపాన్ పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టింది. కమ్యూనిస్టు నేత కిమ్ ఇల్–సంగ్ కొరియా విముక్తి కోసం మంచూరియా నుంచి జపాన్ సైన్యంపై గెరిల్లా యుద్ధం చేశారు. 1945లో రెండో ప్రపంచ యుద్ధం చివర్లో జపాన్ అధీనంలో ఉన్న కొరియాలోకి సోవియట్ సేనలు అడుగుపెట్టాయి. 38వ ప్యారలెల్ లైన్ దాకా దూసుకొచ్చాయి. దాని దిగువ ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంది. అలా కొరియా విభజనకు బీజం పడింది. 1945లో ప్యారలెల్ లైన్‌కు ఎగువన తమ అధీనంలోని కొరియా ప్రాంతంలో పాంగ్యాంగ్ రాజధానిగా సోవియట్ సైనిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అదే ఉత్తర కొరియా. దిగువ ప్రాంతంలో అమెరికా సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పింది. అదే దక్షిణ కొరియా!

ప్రచ్ఛన్నయుద్ధం చిచ్చు

కొరియాకు స్వాతంత్ర్యం ఇవ్వడానికి ఉమ్మడి వేదిక ఏర్పాటు చేయాలని సోవియట్ యూనియన్, మిత్రదేశాలు భావించాయి. ప్రపంచాధిపత్యం కోసం అమెరికాతో సాగిన ప్రచ్ఛన్న యుద్ధంలో ఉత్తర కొరియా మద్దతు కోసం అక్కడి కమ్యూనిస్టులను సోవియట్ ప్రోత్సహించింది. దాని అండతో కిమ్ ఇల్ సంగ్ పెద్ద నేతగా అవతరించాడు. 1948లో ప్రధానిగా పీఠమెక్కాడు. అనంతరం సోవియట్ సేనలు ఉత్తర కొరియాను వీడాయి. మరోవైపు దక్షిణ కొరియాలో అమెరికా సైన్యం కమ్యూనిస్టులను కఠినంగా అణచివేసింది. అమెరికాలో చదివిన కమ్యూనిస్టు వ్యతిరేకి సైంగ్ మాన్ రీకి మద్దతిచ్చింది. 1948లో జరిగిన ఎన్నికల్లో అయిన సైంగ్‌మాన్ రీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1949లో అమెరికా సైన్యం దక్షిణ కొరియా వీడింది. అక్కడి నుంచి ఇరు కొరియాల మధ్య కొట్లాటకు బీజం పడింది. కొరియా ద్వీపకల్పం మొత్తాన్ని తామే పాలిస్తున్నామని, ఉభయ ప్రభుత్వాలు వాదించడం మొదలుపెట్టాయి. కిమ్ ఇల్ సంగ్ నాటి సోవియట్, చైనాల్లోని కమ్యూనిస్టు పాలకులు స్టాలిన్, మావోల మద్దతు కోరారు. ఇటు సైంగ్ మాన్ రీ కూడా ఉత్తర కొరియాను జయించాలన్న ఆకాంక్షలను దాచుకోలేదు. ఇది కొరియన్ యుద్ధానికి దారితీసింది.

కొరియన్ యుద్ధం

1950 నాటికి సైనిక శక్తి పరంగా ఉత్తర కొరియాదే పైచేయి. కొరియా ద్వీపకల్పంపై ఆధిపత్యమే లక్ష్యంగా 1950 జూన్ 25న దక్షిణ కొరియాపై దండెత్తి చాలా ప్రాంతాలను ఆక్రమించుకుంది. అమెరికా జోక్యం చేసుకోబోదని, దక్షిణ కొరియా తన పరమవుతుందని కిమ్ భావించారు. కానీ, పోరాటం కాస్తా పోర యుద్ధంగా మారింది. కమ్యూనిస్టుల విస్తరణను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా నేతృత్వంలోని ఐక్యరాజ్యసమితి సేనలు దక్షిణ కొరియాకు మద్దతుగా రంగంలోకి దిగాయి. ఉత్తర కొరియాను ఓడించినంత పనిచేశాయి. ఐరాస సైన్యం ఉత్తర కొరియాను దాటుకొని చైనా సరిహద్దు సమీపానికి చేరుకుంది. దాంతో ఉత్తర కొరియాకు అండగా చైనా రంగప్రవేశం చేసింది. చివరకు ఎటూ తేలకుండానే 1953లో యుద్ధం ముగిసింది. ప్రజలు, సైనికులు కలిపి 30 లక్షలకు పైగా బలయ్యారు.

దశాబ్దాలుగా అదే పగ

అమెరికా జోక్యం వల్లే దక్షిణ కొరియా తమకు దక్కకుండా పోయిందని కిమ్ పెంచుకున్న ద్వేషం తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. కిమ్ తర్వాత కుమారుడు కిమ్ జోంగ్ ఇల్, ఇప్పుడు మనవడు కిమ్ జోంగ్ ఉన్ ఆ పగను అలాగే కొనసాగిస్తున్నారు. చైనా అండదండలతో ఉత్తర కొరియా, అమెరికా సహకారంతో దక్షిణ కొరియా సైనిక, ఆయుధ బలాన్ని పెంచుకుంటున్నాయి. తరచూ కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. దక్షిణ కొరియాలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకోగా, ఉత్తర కొరియాలో మాత్రం నియంతృత్వం సాగుతోంది. 70 ఏళ్లలో దక్షిణ కొరియా అద్భుతమైన అభివృద్ధి సాధించగా ఉత్తర కొరియాలో మాత్రమే వెనకబాటుతనమే రాజ్యమేలుతోంది. వాటి నడుమ విద్వేషాలు చల్లారుతాయా, మళ్లీ ఒక్కటవుతాయా అంటే కాలమే సమాధానం చెప్పాలి!

మరో రెండు క్షిపణుల్ని ప్రయోగించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా మూడు రోజుల వ్యవధిలోనే మరోసారి క్షిపణులను ప్రయోగించింది. శనివారం ఐసీబీఎంను ప్రయోగించిన ఆ దేశం సోమవారం రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఆ దేశం పశ్చిమతీరంలోని పట్టణం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా తెలిపింది. ఈ రెండు క్షిపణులు తమ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ వెలుపల సముద్ర జలాల్లో పడిపోయాయని జపాన్ తెలిపింది. తమ దీర్ఘశ్రేణి రాకెట్ యూనిట్లు రెండు రాకెట్లను ప్రయోగించినట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ ధ్రువీకరించింది. ఇవి 395 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించాయని పేర్కొంది. తాజా ఉద్రిక్తతలపై చర్చించేందుకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని వెంటనే సమావేశపరచాలని జపాన్ కోరింది. అమెరికా– దక్షిణ కొరియాల భారీ సైనిక విన్యాసాలు తమ దేశాన్ని ఆక్రమించడానికేనని ఆరోపిస్తూ ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తుండటంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.



మహిళా ఐపీఎస్, ఐఏఎస్‌ల గొడవ

ఇద్దరికీ నోటీసులిచ్చిన కర్ణాటక సర్కారు


రోహిణి సింధూరి


రూపా మౌద్గిల్

బనశంకరి: కర్ణాటకలో ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిపై ఐపీఎస్ రూపా మౌద్గిల్ బహిరంగ ఆరోపణలు, ఆమె ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంపై రగడ రాజుకుంది. దీంతో ప్రభుత్వం సోమవారం ఇద్దరికీ నోటీసులను జారీచేసింది. ఇద్దరూ వేర్వేరుగా రాష్ట్ర సీఎస్ వందిత శర్మను కలిసి వివరణ ఇచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు రోహిణిపై రూపా ఫేస్‌బుక్ ద్వారా తీవ్ర ఆరోపణలను గుప్పించారు. సోమవారం రోహిణి సింధూరి బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న రూపాకు చికిత్స చేయించాలన్నారు. ప్రచారం కోసమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను గతంలో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను సేకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వీరి వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రమైందిగా భావిస్తోందని హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర తెలిపారు. వారి వ్యవహారంపై తాము కళ్లు మూసుకుని కూర్చోలేదని, చర్యలు తీసుకుంటామని, ఇద్దరూ హద్దు మీరి ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అంటే ప్రజాసేవకులని, ఆ హోదాలకు అవమానం చేశారని అన్నారు. తనకు తెలిసిన మేరకు వారిద్దరూ వ్యక్తిగత సమస్యల వల్లే దూషణలకు దిగుతున్నారని తెలిపారు. రోహిణి భర్త సుధీర్ రెడ్డి బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. తన కంటే పదేళ్ల జూనియర్ అయిన రోహిణీ సింధూరికి మంచి పేరు రావడం ఇష్టం లేకనే రూపా ఇలా ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. రోహిణి ఫోన్‌ను బ్లూటూత్ ద్వారా హ్యాక్ చేసి వ్యక్తిగత ఫొటోలను రూపా కాజేశారంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జేడీయూ నుంచి వైదొలిగిన ఉపేంద్ర కుష్వాహ

పట్నా: జేడీయూ అసంతృప్త నేత ఉపేంద్ర కుష్వాహ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. కొత్తగా రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ జనతా దళ్ పేరుతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బిహార్ మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు లభిస్తున్న ప్రాముఖ్యంపై అసంతృప్తితో ఉన్న కుష్వాహ గత కొంత కాలంగా జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌పై విమర్శలు చేస్తున్నారు. ఆయన రాజీనామాపై జేడీయూ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ స్పందించారు. 'జేడీయూ నుంచి వెళ్లిపోయి సొంతంగా రాష్ట్రీయ లోకసమతా పార్టీ పెట్టుకున్న కుష్వాహను 2021లో తిరిగి పార్టీలోకి కేవలం సీఎం నితీశ్ కుమార్ జోక్యంతోనే తీసుకున్నాం. స్థాయికి మించిన ఆశలు ఆయనకున్నాయి. అందుకే వెళ్లిపోతున్నారు' అని పేర్కొన్నారు.



భర్త, అత్తను చంపి, ముక్కలుగా నరికి..

- ప్రేమికుడు, స్నేహితుడి సాయంతో అస్సాం మహిళ దారుణం
- ఏడు నెలల తర్వాత మేఘాలయలో దొరికిన శరీర భాగాలు



గువాహటి: అస్సాం రాజధాని గువాహటికి చెందిన ఓ మహిళ దారుణానికి తెగించింది. తన భర్త, అత్తను చంపి ముక్కలుగా నరికి శరీర భాగాలను మేఘాలయలోని కొండప్రాంతంలో పడేసింది. ఏడు నెలల తర్వాత ఈ దారుణం వెలుగుచూసింది. పోలీసులు గాలించి ఆదివారం కొన్ని శరీర భాగాలను కనుగొన్నారు. గత ఏడాది జూలై–ఆగస్ట్ నెలల మధ్యలో ఈ దారుణం చోటుచేసుకుంది. తన భర్త అమర్‌జ్యోతి డే, అత్త శంకరి డే కనిపించడం లేదంటూ బందనా కలిటా(32) అనే మహిళ గత ఏడాది సెప్టెంబర్‌లో నూన్‌మతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల తర్వాత అమర్‌జ్యోతి బంధువు కూడా అదే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరి అదృశ్యం వెనుక బందనా కలిటా హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వీటిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు. బందనాతోపాటు, ఆమె సన్నిహితులైన ధాంతి డేకా(32), అనూప్ డేకా(27)లను దోషులుగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురూ కలిసి గువాహటిలోని చాంద్‌మరి, నారెంగి ప్రాంతాల్లో అమర్‌జ్యోతి, శంకరిలను చంపి నాలుగైదుముక్కలుగా చేశారు. అనంతరం ప్లాస్టిక్ బ్యాగుల్లో వాటిని ప్యాక్ చేసి, మేఘాలయకు కారులో తీసుకెళ్లారు. అక్కడి కొండప్రాంతంలో పడేశారు. విచారణలో వెల్లడించిన సమాచారం ఆధారంగా శరీర భాగాల్లో కొన్నిటిని స్వాధీనం చేసుకున్నారు. హత్యకు కారణాలతోపాటు పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

ఢిల్లీలోని ఒవైసీ ఇంటిపై రాళ్ల దాడి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని తన నివాసంపై కొందరు దుండగులు రాళ్లతో దాడి చేశారంటూ ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు తన నివాసంపై దాడులు జరిగాయన్నారు. తాజా దాడిలో కిటికీల అద్దాలు పగిలాయన్నారు. రాజస్తాన్ పర్యటన నుంచి ఆదివారం రాత్రి తిరిగి వచ్చిన తనకు పనివారు ఈ విషయం చెప్పారన్నారు. అత్యంత భద్రత ఉండే చోట దాడికి పాల్పడిన వారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఒవైసీ కోరారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు డీసీపీ ప్రణవ్ తయాల్ చెప్పారు.

ఉక్రెయిన్‌లో బైడెన్

యుద్ధానికి ఏడాదవుతున్న వేళ ఆకస్మిక పర్యటన

- రష్యాను గొప్పగా నిలువరించారు
- మీ పోరాట స్ఫూర్తి ప్రశంసనీయం
- ప్రపంచమంతా అండగా ఉంటుంది
- మద్దతు కొనసాగుతుందంటూ హామీ
- జెలెన్‌స్కీతో కలిసి కీవ్‌లో పర్యటన
- మరో 50 కోట్ల డాలర్ల ప్యాకేజీ



కీవ్: రష్యా ఆక్రమణతో ఏడాదిగా అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. రష్యాపై యుద్ధంలో మరోసారి సంఘీభావం ప్రకటించారు. రాజధాని కీవ్‌లో పలు ప్రాంతాలను జెలెన్‌స్కీతో కలిసి సందర్శించారు. యుద్ధం తాలూకు విధ్వంసానికి గుర్తులుగా మిగిలిన కూలిన భవనాలు, శిథిలాలు తదితరాలను వీక్షించారు. మరణించిన ఉక్రెయిన్ సైనికుల స్మారక నిర్మాణం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఏడాది కింద రష్యా ఉన్నట్టుండి ఉక్రెయిన్‌పై దురాక్రమణకు పాల్పడిందంటూ బైడెన్ గుర్తు చేసుకున్నారు. ''ఉక్రెయిన్‌ను పుతిన్ సేన చూస్తుండగానే కబళించేస్తుందని భయపడ్డాం. కానీ ఏడాది గడిచినా ఉక్రెయిన్ ఏ మాత్రమూ తలవంచకుండా నిలబడింది. దీటుగా పోరాడుతోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని సమున్నతంగా నిలబెడుతోంది. వారి పోరాట స్ఫూర్తికి సలాం'' అంటూ ప్రశంసించారు. ''ఈ ఆటవిక, అక్రమ యుద్ధం ఇంకా ముగియలేదు. మరింత కష్టకాలం ముందుంది. కానీ ఈ పోరాటంలో అమెరికా మీతో ఉంది. మొత్తం ప్రపంచమే మీతో ఉంది. యుద్ధం ఎంత కాలం కొనసాగినా మీకు దన్నుగా నిలుస్తాం'' అంటూ భరోసా ఇచ్చారు. ''సమయం గడిచే కొద్దీ ఉక్రెయిన్‌కు తమ సాయం సన్నగిల్లుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ భ్రమ పడ్డారు. ఆయన దురాక్రమణ ఆకాంక్షలు ఆవిరి కాక తప్పదు. స్వేచ్ఛ అమూల్యమైనది. దానికోసం ఎంతకాలమైనా పోరాడాల్సిందే'' అన్నారు. ఉక్రెయిన్‌కు మరో 50 కోట్ల డాలర్ల సాయాన్ని ఈ సందర్భంగా బైడెన్ ప్రకటించారు. ఇందులో హొవిట్జర్ శతఘ్నులు, ట్యాంక్ విధ్వంసక క్షిపణులు, గగనతల పర్యవేక్షణ రాడార్లు తదితరాలున్నాయి. వీటితో పాటు మరిన్ని లాంగ్‌రేంజ్ వెపన్స్‌తో పాటు మరిన్ని కొత్త తరహా ఆయుధాలు కూడా అందించేందుకు బైడెన్ అంగీకరించినట్టు జెలెన్‌స్కీ చెప్పారు. ఆయనతో చర్చలు ఫలప్రదంగా జరిగాయన్నారు. వేసవి సమీపిస్తుండటంతో యుద్ధం మరింత తీవ్రతరం కావడం ఖాయమన్న అంచనాల మధ్య బైడెన్ పర్యటనకు చాలా ప్రాధాన్యం ఏర్పడింది. తద్వారా యుద్ధం ఇంకెంత కాలం కొనసాగినా ఉక్రెయిన్‌కు మద్దతిస్తూనే ఉంటామన్న సందేశాన్ని ఇచ్చారని భావిస్తున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

బైడెన్ పర్యటన అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కొనసాగింది. ఆయన కీవ్‌లో ఉన్నంతసేపూ ఈ–3 సెంట్రీ ఎయిర్‌బోర్న్ రాడార్ వంటి అమెరికా నిఘా విమానాలు, ఆర్‌సీ–135డబ్ల్యూ రివెట్ జాయింట్ ఎయిర్‌క్రాఫ్ట్ తదితరాలు పోలండ్ గగనతలం నుంచి ఉక్రెయిన్‌పై గట్టి నిఘా వేసి ఉంచాయి. బైడెన్ సోమవారం ఉదయమే కీవ్‌లో అడుగుపెట్టి ఐదు గంటలకు పైగా గడిపారు. ఇలా అమెరికాకు గానీ, దాని మిత్ర దేశాలకు గానీ గగనతల నియంత్రణ లేని యుద్ధ క్షేత్రంలో యూఎస్ అధ్యక్షుడు పర్యటించడం చాలా అరుదు. బైడెన్ ఉక్రెయిన్ పర్యటన గురించి రష్యాకు అమెరికా ముందుగానే సమాచారమిచ్చింది.

కాంట్రాక్టులన్నీ అదానీకే ఎందుకు: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ఎయిర్‌పోర్టుల కాంట్రాక్టులను అదానీ గ్రూప్‌కే కట్టబెట్టడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ మేజిక్‌తో అదానీ లాభపడ్డారని పేర్కొన్నారు. సోమవారం మిత్ర–కాల్ పేరుతో రాహుల్ గాంధీ తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఒక వీడియోను విడుదల చేశారు. 'మిత్ర–కాల్‌లో కబ్జారాజ్యం నడుస్తోంది. విమానాశ్రయాలు, పోర్టులు, రోడ్లు, భద్రతాబలగాలు, మీడియా, బొగ్గు, ఇంధనం..ఇలా అన్నిటిపై పెత్తనాన్ని ఒక్కరికే అప్పగించారు. వీటిపై మీడియా మాట్లాడదు. నా ప్రశ్నలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పరు' అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌లో అక్రమాలు, దేశ సంపద లూటీ అవుతున్న తీరుపై పార్లమెంట్‌లో వెల్లడించిన నిజాలను ప్రభుత్వం రికార్డులనుంచి తొలగించిందని అందులో పేర్కొన్నారు. 'ఫకీర్ తన మేజిక్‌తో సంచీలోంచి తీసిన ఎయిర్‌పోర్టును అదానీ చేతుల్లో పెట్టారు' అంటూ ఆయన ట్వీట్ చేశారు. గుత్తాధిపత్యాన్నే వ్యతిరేకిస్తాను తప్ప వ్యాపార సంస్థలను కాదని రాహుల్ చెప్పారు.

ఛత్తీస్ కాంగ్రెస్ నేతల ఇళ్లలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: కోల్ లెవీ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని అధికార కాంగ్రెస్ నేతల నివాసాల్లో సోదాలు జరిపినట్లు ఈడీ తెలిపింది. రాయ్‌పూర్‌లో ఈనెల 24–26వ తేదీల్లో కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలుండగా దాడులు జరగడం గమనార్హం. దాదాపు డజను ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి సోదాలు కొనసాగుతున్నాయని ఈడీ పేర్కొంది. భిలాయ్‌లోని కాంగ్రెస్ ఎమ్మెల్యే దేవేంద్ర యాదవ్, రాష్ట్ర పీసీసీ ట్రెజరర్ రాంగోపాల్ అగర్వాల్, పార్టీ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్‌తోపాటు, పలువురు పార్టీ నేతలకు చెందిన ప్రాంతాలపైనా సోదాలు జరిగాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి రవాణా అయ్యే ప్రతి టన్ను బొగ్గుపై రూ.25 చొప్పున అక్రమంగా వసూలు చేసి సీనియర్ అధికారులు, వ్యాపార వేత్తలు, దళారులు, రాజకీయ నేతలు పంచుకున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని ఈడీ అరెస్ట్ చేసింది. ఈడీతో దాడులు చేయిస్తూ కేంద్రంలోని బీజేపీ వేధింపు, కక్షసాధింపు, దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది.

నీతి ఆయోగ్ సీఈఓగా బీవీఆర్ సుబ్రహ్మణ్యం

ప్రపంచ బ్యాంకు ఈడీగా పరమేశ్వరన్ అయ్యర్



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ కొత్త సీఈవోగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. నీతి ఆయోగ్ ప్రస్తుత సీఈవో పరమేశ్వరన్ అయ్యర్‌ను ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లపాటు సుబ్రహ్మణ్యం ఆ పదవిలో ఉంటారని తెలిపింది. 1987 బ్యాచ్ ఛత్తీస్‌గఢ్ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన సుబ్రహ్మణ్యం ప్రస్తుతం ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్(ఐటీపీవో) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయ్యర్ వాషింగ్టన్‌లో ఉన్న ప్రపంచబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఈడీగా మూడేళ్లపాటు పని చేయనున్నారు.

దివ్యాంగ వృద్ధుడికి డ్రోన్ ద్వారా పెన్షన్

నౌపద: హితారామ్ సత్నామీ. వయోభారంతో ఆరోగ్యం క్షీణించిన వృద్ధుడు. పైగా దివ్యాంగుడు. ఒడిశా రాష్ట్రం నౌపద జిల్లాలో మారుమూల గ్రామం భుత్కాపడని నివసిస్తున్నాడు. ఒడిశా ప్రభుత్వం అమలు చేస్తున్న 'మధుబాబు పెన్షన్ యోజన' లబ్ధిదారుడు. స్వయంగా నడవలేడు. ప్రతి నెలా దట్టమైన అడవిలో రెండు కిలోమీటర్లు ఇతరుల సాయంతో ప్రయాణించి, పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పెన్షన్ తెచ్చుకొనేవాడు. ఫిబ్రవరిలో మాత్రం అతడికి ఈ ప్రయాణ బాధ తప్పింది. గ్రామ సర్పంచి డ్రోన్ ద్వారా పెన్షన్ అందజేసే ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం. సర్పంచ్ సరోజ్ అగర్వాల్ డ్రోన్ ద్వారా పెన్షన్ డబ్బులను తన ఇంటి వద్దకే చేర్చారని హితారామ్ సత్నామీ ఆనందం వ్యక్తం చేశాడు. వృద్ధుడు హితారామ్ గురించి తెలిసిన తర్వాత సొంత డబ్బులతో ఆన్‌లైన్‌లో డ్రోన్ కొనుగోలు చేశామని, ప్రతినెలా డ్రోన్ సాయంతో అతడికి పెన్షన్ అందజేయాలని నిర్ణయించామని సర్పంచ్ సరోజ్ అగర్వాల్ చెప్పారు.

లింగ, మతప్రమేయం లేని...

ఉమ్మడి చట్టాలు చేయొచ్చా?

- కోర్టులు అలా నిర్దేశించొచ్చా?
- సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు



న్యూఢిల్లీ: శాసన వ్యవస్థ పరిధిలోని అంశాలపై న్యాయ వ్యవస్థ జోక్యంపై సుప్రీంకోర్టు సోమవారం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లిళ్లు, విడాకులు, మనోవర్తి, వారసత్వం వంటి అంశాల్లో లింగ, మతప్రమేయం లేకుండా పౌరులందరికీ సమానంగా వర్తించేలా ఉమ్మడి చట్టాలు చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జె.బి.పార్దీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ''వీటిపై శాసన వ్యవస్థకు కోర్టులు సలహాలు, సూచనలు ఇవ్వొచ్చా? ఈ మేరకు కేంద్రానికి నిర్దేశాలు జారీ చేయొచ్చా?'' అంటూ సందేహాలు లేవనెత్తింది. శాసన వ్యవస్థ పరిధిలోని ఈ అంశాలపై న్యాయ జోక్యం ఏ మేరకు ఉండొచ్చన్నదే ఇక్కడ కీలక ప్రశ్న అని అభిప్రాయపడింది. ఇలాంటి అంశాల్లో ఉమ్మడి చట్టాలకు అభ్యంతరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించాలో, వద్దో అప్పుడు తేలుస్తామని పేర్కొంది.

'అందరికీ ఒకే వివాహ వయసు' పిటిషన్ కొట్టివేత

స్త్రీ, పురుషులందరికీ చట్టబద్ధంగా ఒకే కనీస వివాహ వయసుండేలా చట్టం తేవాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం కొట్టేసింది. 'ఇది పార్లమెంటు పరిధిలోని అంశం. దానిపై మేం చట్టం చేయలేం. రాజ్యాంగానికి మేం మాత్రమే ఏకైక పరిరక్షకులం కాదు. పార్లమెంటు కూడా ఆ భారం వహిస్తోంది' అని అభిప్రాయపడింది. కనీస వివాహ వయసు పురుషులకు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు.

ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలి: ఉద్ధవ్

న్యూఢిల్లీ/ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. 'శివసేన పేరు, విల్లు, బాణం గుర్తును మా వద్ద నుంచి దొంగిలించారు. కానీ, ఠాకరే పేరును మాత్రం దొంగిలించలేరు' అని సోమవారం మీడియాతో అన్నారు. ఈసీ అంత హడావుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై తాము వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో బహుశా మంగళవారం విచారణకు రావొచ్చని అన్నారు. ''ఎన్నికల సంఘం ఉత్తర్వులు తప్పు. సుప్రీంకోర్టే మా చివరి ఆశా కిరణం'' అని ఉద్ధవ్ పేర్కొన్నారు. దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థలను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. 'నేడు మాకు జరిగినట్లే రేపు మరొకరికి జరగొచ్చు. ఇలాగే కొనసాగితే 2024 తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఉండదు. ఎన్నికలూ ఉండవు' అని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల నేపథ్యంలో మమతా బెనర్జీ, శరద్ పవార్, నితీశ్ కుమార్, తదితర విపక్ష నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారన్నారు.



సుప్రీం తలుపుతట్టిన ఉద్ధవ్ వర్గం

షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తిస్తూ, విల్లు, బాణం ఎన్నికల గుర్తు కేటాయించడాన్ని ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం తిరస్కరించింది. ''నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయి. సరైన ప్రక్రియను అనుసరించి మంగళవారం న్యాయస్థానం ముందుకు రండి'' అని సీజేఐ సూచించారు.

అసెంబ్లీ ముందు సీఎం, సభాపతులు, మంత్రులు, ఎమ్మెల్యేల బృంద చిత్రం



న్యూస్‌రీల్

మీ గొడవల్లో నా కుమారుడి పేరు లాగొద్దు



ఐఏఎస్ డీకే రవి తల్లి గౌరమ్మ

దొడ్డబళ్లాపురం: ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి, ఐపీఎస్ అధికారి రూప మధ్య జరుగుతున్న వార్ మధ్యలో తన కుమారుడు దివంగత ఐఏఎస్ అధికారి డీకే రవి పేరు లాగడం పట్ల రవి తల్లి గౌరమ్మ నొచ్చుకున్నారు. ఈ మేరకు ఆమె సోమవారం చెన్నపట్టణ తాలూకా కదరమంగళ గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ... మీరిద్దరూ తిట్టుకోండి, కొట్టుకోండి, నాకు అభ్యంతరం లేదు, అయితే అనవసరంగా ఈ భూమి మీద లేని నా కుమారుడు రవి పేరు దయచేసి తీసుకురావద్దని కోరారు. తన కుమారుడు బతికి ఉన్నన్ని రోజులు కుసుమ తన కోడలు అన్నారు. ఇప్పుడు ఆమె కూడా తనతో లేదన్నారు. కావున ఎవరూ ఏ సందర్భంలోనూ తన కుమారుడి పేరు వాడుకోవద్దని కోరారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

మైసూరు: భార్యను హత్య చేసిన భర్తకు మైసూరు ఐదో అదనపు సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలు...మైసూరు జిల్లా హుణసూరు తాలూకా రామేనహళ్లి కంచిగౌడ.. 22 ఏళ్ల క్రితం సుందరమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. తరచూ భార్యను అనుమానించి గొడవపడేవాడు. 2019, జూన్ 9న భార్యతో గొడవ పడి కోపంలో సుందరమ్మ తలపై కొట్టాడు. కింద పడిపోయిన ఆమె గొంతుకు చున్నీ చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. ఈ ఘటనపై హుణసూరు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి మల్లికార్జున... దోషి కంచిగౌడకు జీవిత ఖైదుతో పాటు రూ. 17 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సభకు రాని సభ్యులపై స్పీకర్ ఆగ్రహం

శివాజీనగర: వచ్చే ఎన్నికల్లో గెలుపు ఓటముల గురించి ఆలోచించేందుకు సభకు రాకపోవడం సరికాదని సభ్యులపై స్పీకర్ విశ్వేశ్వర హెగ్డె కాగేరి సోమవారం శాసనసభలో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ధారించిన సమయం కంటే ఆలస్యంగా అసెంబ్లీ సమావేశాలు ఆరంభం కావటంతో మాట్లాడిన ఆయన, గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించిన చేసిన ప్రసంగంపై 15 మంది సభ్యులు మాట్లాడారు. మొత్తం పదమూడున్నర గంటలపాటు చర్చ జరిగింది. జేడీఎస్‌కు చెందిన ఏడుగురు, అధికార పార్టీకి చెందిన ముగ్గురు, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు సభ్యులు చర్చల్లో పాల్గొని మాట్లాడారని తెలిపారు. ఆ తరువాత సభ్యుల హాజరు తక్కువగా ఉంటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల దృష్టితో పార్లమెంటరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేయరాదు. అందరికీ ఎన్నికల్లో మంచి జరగాలి. ఈ వ్యవస్థపై విశ్వాసం కలిగేలా, వ్యవస్థకు అధిక శక్తి నింపే విధంగా బాధ్యతతో పాల్గొనాలి. అంతకంటే ఏమి చెప్పనని విచారం వ్యక్తం చేశారు.

రూపా వర్సెస్ రోహిణి

పతాకస్థాయికి పోరాటం

- ఇద్దరికీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పిలుపు
- చూస్తూ ఉండలేమన్న హోంమంత్రి



ఐపీఎస్ రూపా మౌద్గిల్



విధానసౌధ వద్ద మీడియా ముందుకు వస్తున్న ఐఏఎస్ రోహిణి సింధూరి

బనశంకరి: ఐపీఎస్ అధికారిణి డి. రూపా మౌద్గిల్– ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి మధ్య మాటల పోట్లాట సోమవారం సర్కారు వద్దకు చేరింది. రోహిణిపై రూపా ఫేస్‌బుక్ ద్వారా రెండురోజులుగా తీవ్రమైన ఆరోపణల పరంపరను సాగించారు. రోహిణి కూడా ప్రత్యారోపణలు చేశారు. రూపా మానసిక వైద్యం చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ యంత్రాంగానికి రెండు కళ్ల వంటి ఐపీఎస్– ఐఏఎస్ అధికారులు, అందులోనూ ఇద్దరూ మహిళలు దూషణలకు దిగడంతో ప్రభుత్వం ఆలస్యంగానైనా మేలుకుంది. వారిద్దరినీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందితా శర్మ సోమవారం విధానసౌధకు వేర్వేరుగా పిలిపించి వివరణలు తీసుకున్నారు. ఇకపై నోరు మెదపరాదని ఆదేశించినట్లు తెలుస్తోంది.

రూపావన్నీ తప్పుడు ఆరోపణలు: రోహిణి

సీఎస్‌ను కలిసిన తరువాత ఐఏఎస్ రోహిణి విధానసౌధ బయట మీడియాతో మాట్లాడారు. రూపా గురించి సీఎస్‌కు 4 పేజీల ఫిర్యాదు లేఖను అందజేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా, మీడియాలో తప్పుడు ఆరోపణలు చేసి సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించిన ఐపీఎస్ అధికారి రూపామౌద్గిల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె నా వ్యక్తిగత జీవితంపై మాట్లాడింది, నేను సోషల్ మీడియాలో చురుకుగా లేను. వ్యక్తిగత ఆరోపణలు పట్ల నా భర్త మాట్లాడారని రోహిణి చెప్పారు. జాలహళ్లిలో ఉన్న ఆస్తి గురించి రూపా ప్రస్తావించారు, ఆ ఆస్తి నా భర్త తల్లికి చెందినదని, తమది కాదని పేర్కొన్నారు.

సీఎస్‌ను కలిసిన రూపా

ఐపీఎస్ అధికారి రూపా మౌద్గిల్ కూడా సీఎస్ వందితా శర్మను కలిసి వివరణ ఇచ్చారు. ఐఏఎస్ రోహిణి సింధూరి అవినీతి అక్రమాలకు పాల్పడిందని రూపా ఫిర్యాదు చేశారు. రోహిణిపై లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఫేస్‌బుక్‌లో తెలిపారు.

ఐపీఎస్‌కు ఎంపీ మద్దతు

ఐపీఎస్ అధికారిణి డి.రూపా అడిగిన ప్రశ్నలు నైతికంగా సరైనవేనని, వాటికి రోహిణి, ఆమె బంధువులు సమాధానం ఇవ్వాలని మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా అన్నారు. మైసూరులో బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ప్రతాప్ సింహా మాట్లాడుతూ చామరాజనగర జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 24 మంది కోవిడ్ బాధితులు మరణించారని, ఆ ఆస్పత్రికి ఆక్సిజన్ సరఫరా చేసే బాధ్యత మైసూరు జిల్లాధికారిదని అన్నారు. ఆ సమయంలో జిల్లాధికారిగా ఉన్న రోహిణి సింధూరి దీనికి పూర్తి బాధ్యత వహించాలని, ఆమె బదులివ్వాలని అన్నారు.

ఇక ఊరుకోం: న్యాయమంత్రి

ఇద్దరు అధికారులూ ఇలాగే పరస్పర దూషణలకు దిగితే చర్యలు తప్పవని న్యాయ మంత్రి మాధుస్వామి విధానసౌధలో తెలిపారు. ఇప్పటివరకు వ్యక్తిగత విషయం అని ఊరుకున్నామని, విధానసౌధ వరకు వచ్చింది కాబట్టి ఇక మేము ఊరుకునేదిలేదని, ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వదిలిపెట్టేది లేదు: రోహిణి

ఈ విషయాన్ని వదిలిపెట్టేదిలేదని రోహిణి హెచ్చరించారు. వ్యక్తిగతంగా నాపై ఆరోపణలు చేయడం తగదు, ఏదైనా ఉంటే ముందుగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. ఈ విషయాన్ని వదిలే ప్రసక్తి లేదు, అన్ని చర్యలకూ సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపారు. ప్రొఫెషనల్‌గా మాట్లాడాలి కానీ పర్సనల్‌గా కాదన్నారు. రూప నాపై దుష్ప్రచారం చేయడం తప్పు, చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటానని తెలిపారు. గెట్ వెల్ సూన్ అని కౌంటర్ ఇచ్చారు.

ఇద్దరిపైనా చర్యలు తప్పవు: హోంమంత్రి జ్ఞానేంద్ర

ఐపీఎస్– ఐఏఎస్‌ల గొడవను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర తెలిపారు. వారి వ్యవహారంపై తాము కళ్లు మూసుకుని కూర్చోలేదని, చర్యలు తీసుకుంటామని, ఇద్దరు అధికారులూ హద్దుమీరి ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి వ్యక్తిగత విషయం ఏమైనా చేసుకోని, కానీ మీడియా ముందు బహిరంగంగా మాట్లాడటం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అంటే ప్రజాసేవకులని, కానీ వారు ఆ హోదాలకు అవమానం చేశారని ఆయన అన్నారు. సీఎస్, డీజీపీ తో మాట్లాడానని, సీఎం బొమ్మై సైతం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

సవాళ్ల మధ్య సీఎంనయ్యా: బొమ్మై

శివాజీనగర: కోవిడ్, వరదలు వంటి సవాళ్ల మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 15 వేల కోట్లకు పన్నుల వసూళ్లతో ఆర్థిక ప్రగతిని సాధించిందని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై శాసనసభలో తెలిపారు. సోమవారం గవర్నర్ ప్రసంగంపై చర్చకు సమాధానమిస్తూ గవర్నర్ ప్రసంగం వాస్తవాల ఆధారంగానే ఉందని చెప్పారు. వరదలు, కోవిడ్ తదతర అనేక సమస్యల మధ్య తాను ముఖ్యమంత్రి అయ్యానన్నారు. ఆర్థిక, సామాజిక చక్రం నిరంతరం తిరుగుతుండాలి, లేదంటే ఇబ్బందులు తప్పవన్నారు. ఎంతో క్లిష్టంగా కోవిడ్‌ను ఎదుర్కొన్నట్లు, అప్పటి నుంచి అనేక వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వివరించారు.

ఉద్వేగంగా గ్రూప్ ఫొటో

మరో రెండు మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఇవే చివరి శాసనసభ సమావేశాలు. సోమవారం సాయంత్రం సౌధ ముందు సీఎం, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రూప్ ఫోటో తీసుకున్నారు. అందరూ గత ఐదేళ్ల జ్ఞాపకాలను తలచుకుని ఉద్వేగానికి లోనయ్యారు.

కాల్పుల్లో ఇద్దరు దుర్మరణం

యశవంతపుర: బైకుపై వెళ్తున్న వ్యక్తులను పొరపాటున కాల్చిచంపాడో దుండగుడు. ఈ సంఘటన చిక్కమగళూరు తాలూకా బిదిరె గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. బిదిరెకి చెందిన ప్రవీణ్(24), ప్రకాశ్ (25)లు మృతులు. వివరాలు.. అదే ఊరిలో అంగన్‌వాడీ సహాయకురాలు రోడ్డు మీద వెళ్తుండగా దుండగుడు రమేశ్ ఆమెను అటకాయించాడు. తను చెప్పినట్లు వినాలని, లేదంటే కాల్చి చంపుతానని బెదిరించారు. ఆమె ససేమిరా అనడంతో తుపాకీతో కాల్పులు జరిపాడు. అవి గురితప్పి రోడ్డు మీద బైక్‌పై వెళ్తున్న ప్రవీణ్, ప్రకాశ్‌లకు యెద భాగంలో తగలడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. జిల్లా ఎస్పీ ఉమా ప్రశాంత్ సంఘటనాస్థలిని పరిశీలించారు. నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

బీజేపీ అసలైన పార్టీ: నడ్డా



శివాజీనగర: పవిత్ర కృష్ణ మఠానికి వచ్చి మాట్లాడుతున్నాను. ఉడుపికి భారతీయ జనతా పార్టీలో ప్రత్యేక స్థానముంది. 1968లో తొలిసారిగా ఉడుపి నగరసభలో భారతీయ జన సంఘం ఆవిర్భవించింది, తద్వారా దక్షిణ భారతదేశంలో బీజేపీ విస్తరణకు బీజం పడిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. దివంగత నేత వీ.ఎస్.ఆచార్య తన మిత్రుడని చెప్పుకునేందుకు ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. సోమవారం ఉడుపి ఎంజీఎం కాలేజీ మైదానంలో బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటకలో తాము పలుసార్లు ప్రతిపక్షంలో ఉన్నాం, ఇప్పుడు అధికారంలో ఉన్నామని, బీజేపీ కార్యకర్తగా పనిచేయడమనేది అదృష్టమని ఆయన పేర్కొన్నారు. అత్యధికంగా కార్యకర్తలను కలిగి, ఒక సిద్ధాంతంతో పనిచేస్తున్న ఏకైక అతిపెద్ద పార్టీ బీజేపీ అని, మిగతా పార్టీలన్నీ కూడా కుటుంబ రాజకీయ పార్టీలేనని, కాంగ్రెస్‌లో తల్లి, కుమారుడు, కుమార్తె ఆజమాయిషీ ఉందని విమర్శించారు.

లారీ, కారు ఢీ, ఇద్దరు దుర్మరణం





మృతులు షాకీబ్, సద్దాం (ఫైల్)

మండ్య: కారు లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మద్దూరు తాలూకా గెజ్జలగెరె వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. మృతులను మండ్య గుత్తలు లేఔట్ కారు డ్రైవర్ షాకీబ్ (25), సద్దాం షరీఫ్ (23)లు గా గుర్తించారు. వివరాలు...సద్దాం షరీఫ్‌తో పాటు ఇతరులు బంధువుల ఇంటిలో విందు కోసం బెంగళూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్ షాకీబ్, సద్దాంను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మండ్య మిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

కొడుక్కి తండ్రి మరణశిక్ష!



మైసూరు: దురలవాట్లకు బానిసయ్యాడని కుమారుడిని ఒక తండ్రి హత్య చేశాడు. ఈ ఘటన కొడగు జిల్లా మరగోడు సమీపంలోని కట్టిమాడు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన నందేటి నిరేన్ (28)తో తండ్రి చిట్టియప్ప కుటుంబ కలహాలతో గొడవపడ్డాడు. నిత్యం మద్యం తాగుతూ గొడవలకు దిగుతూ ఉండడంతో అతన్ని తండ్రి మందలించగా గొడవ చెలరేగింది. ఆవేశం పట్టలేని తండ్రి ఇంట్లోని తుపాకీ తీసుకుని నిరేన్‌ను కాల్చి చంపినట్లు తెలుస్తోంది. తర్వాత తండ్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. జిల్లా పోలీసు ఎస్పీ రామ్‌రాజన్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మడికెరి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది.

మహదేశ్వర కొండపై నుంచి దూకి ఆత్మహత్య

కొండపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా మలేమహదేశ్వర బెట్టలో జరిగింది. బెంగళూరు కెంగేరి సమీపంలోని మారుతినగర నివాసి శ్రీనిధి (26) అనే యువకుడు నాగమలెగె వెళ్లి మహదేశ్వర దర్శనం చేసుకున్నాడు. తరువాత కొండపై అంచు వద్దకు చేరుకుని అక్కడి నుంచి దూకడంతో ప్రాణాలు పోయాయి. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అడవి ఏనుగు అకృత్యం

- దక్షిణ కన్నడ జిల్లాలో యువతి, వ్యక్తి బలి



రంజిత (ఫైల్)

యశవంతపుర: అడవి ఏనుగు దాడిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకా మీనాడి వద్ద సోమవారం ఉదయం జరిగింది. పేరడ్క పాల సహకార సొసైటీలో పని చేస్తున్న రంజిత (21), ఇంటి నుండి విధులకు వెళ్తుండగా అడవి ఏనుగు దాడి చేసి తొక్కేసింది. రంజిత ఆర్తనాదాలు పెట్టడంతో స్థానికుడు రమేశ్ రై (55) కాపాడేందుకు వెళ్లగా అతన్ని కూడా ఏనుగు తొండంతో పట్టుకుని కొట్టి పరారైంది. గాయాలైన వారిద్దరినీ స్థానికులు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. కడబ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఏనుగు బెడద గురించి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపించారు. అటవీ శాఖకు వ్యతిరేకంగా ప్రజలు ధర్నా చేశారు.

అమ్మవారికి సోమావాస్య పూజలు



బనశంకరి: బనశంకరీ దేవీ సన్నిధిలో సోమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవీ మూలవిరాట్ కు అభిషేకం, అర్చనలు చేపట్టి విశేషాలంకరణ చేశారు.

పదేళ్ల తరువాత ఫలితాలు!

- బెంగళూరు వర్సిటీ ఘనత

శివాజీనగర: సాధారణంగా పరీక్ష ఫలితాలు నెల, రెండు నెలలు ఆలస్యం కావడం చూశాము, అయితే ఏకంగా పదేళ్ల క్రితం రాసిన డిగ్రీ, పీజీ పరీక్ష ఫలితాలను వెల్లడిస్తామని ప్రకటించి బెంగళూరు విశ్వవిద్యాలయం ఒక అరుదైన ఘనతను సాధించింది. వివరాలు...2013లో 110 మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ పరీక్షలు రాశారు. ఈ విద్యార్థులు రాసిన జవాబు పత్రాలు మాయమయ్యాయి. దీంతో అప్పటి నుంచి ఫలితాలు ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు సిండికేట్ సభ్యుడు టీవీ రాజు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. వారి నివేదిక ఆధారంగా గత పరీక్షల్లో విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగా ఫలితాలను మంగళవారం ప్రకటించనున్నారు.

విషాదంలోనూ మానవత్వం

- తల్లీకొడుకు నేత్రదానం



తల్లీ కుమారుడు రూప, హేమంత్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: ఆదివారం సాయంత్రం దొడ్డ తాలూకా కోళూరు గ్రామంలో పొలంలో నీటి గుంతలో పడి తల్లీ కుమారుడు రూప (35), హేమంత్ (9) మృతి చెందడం తెలిసిందే. ఇంత విషాదంలోనూ వారి కుటుంబీకులు తల్లీ కొడుకు కళ్లను దానం చేయడం గమనార్హం. వారి ఔదార్యం చూసి గ్రామస్తులు కంటతడిపెట్టారు. కాగా, పశువుల మేపుతూ మొదట బాలుడు, ఆ తరువాత తల్లి రూప నీటి గుంతలో పడిపోయారు. అక్కడే ఉన్న ప్రేమ అనే యువతి వారిని కాపాడడానికి గుంతలో దూకింది. అయితే ఆమె కూడా మునిగిపోతుండడం చూసిన రూప మరో కుమార్తె ఖుషి దగ్గర్లోని పైపును తెచ్చి నీటిలోకి వేయగా దానిని పట్టుకుని ప్రేమ బయటకు వచ్చింది. సోదరుడు, తల్లిని మాత్రం ఖుషి కాపాడుకోలేకపోయింది. ప్రేమ, ఖుషి ఇద్దరూ గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులను తీసుకువచ్చేటప్పటికి కాలం మించిపోయింది. ఖుషి సాహసాన్ని గ్రామస్తులు కొనియాడారు.

పెద్దపులుల పదఘట్టనలు

- నాగరహొళెలో భారీగా పులుల సంతతి
- అటవీ గ్రామాలపై తరచూ దాడులు





అడవుల్లో భారీగా పులుల సంఖ్య వృద్ధి

బనశంకరి: ఒకప్పుడు పులులు కనిపించడమే తగ్గిపోయిన రోజుల నుంచి ఇప్పుడు ఎక్కడ పులి ఉందో అని కంగారు పడే స్థాయికి నాగరహొళె జాతీయ అభయారణ్యంలో వ్యాఘ్రాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మైసూరు, కొడగుతో పాటు అటు చామరాజనగర వరకూ వ్యాపించిన ఈ అరణ్యం ఇప్పుడు పులుల గాండ్రింపులతో మార్మోగుతోంది. 1989లో నాగరహొళెలో 36 ఉన్న పులులు ఉండగా, ప్రస్తుతం 112 కు చేరుకోవడమే దీనికి నిదర్శనం. రెండో పార్శ్వం చూస్తే పులులు పెరిగిన కారణంగా అడవిలో నివసిస్తున్న ప్రజలు, పశువులు, జంతువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడింది.

సంతతి పెరిగి పోట్లాటలు

నాగరహొళెలో 30 ఏళ్ల కిందట ఎన్నో కిలోమీటర్లు తిరిగితే ఒక్క పులి కనిపించేది. నేడు కిలోమీటరు దూరం ప్రయాణిస్తే ఓ పులి స్వాగతం పలుకుతుందనడంలో అతిశయోక్తి లేదు. అరణ్యంలో జింకలు, అడవి పందులు తదితర వన్యజీవులు అపరిమితంగా ఉండడం వల్ల పులులకు కావలసినంత ఆహారం లభిస్తోంది. అయితే సంతతి పెరగడంతో ఆహారం, ఆవాసం కోసం పులుల మధ్య కలహాలు విస్తరించాయి. వీటిలో గాయపడిన పులులు, వృద్ధ పులులు గత్యంతరం లేక జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. ఆహారం కోసం ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలపై దాడిచేస్తున్నాయి. మనుషుల రక్తం రుచి చూసిన పులులు ప్రజలపై పదేపదే దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు పులుల గురించి అధ్యయనం చేసే ప్రముఖ పరిసరవాది ఉల్లాస్‌కారంత్ తెలిపారు.



అడవిలో జింకలు. ఇవి పులులకు మంచి ఆహార వనరుగా ఉన్నాయి

దాడుల నుంచి పరిష్కారం కావాలి

చిక్కమగళూరు జిల్లాలో నరభక్షక పులిని బంధించి బెళగావి ప్రాంత అడవుల్లో వదలడంతో ఆ ప్రాంత వాసుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పొరుగునే కేరళలోని వయనాడులో ప్రస్తుతం 3 పులులు మనుషులపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. గత రెండేళ్లలో దక్షిణ కొడగులో పులి దాడికి 6 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రజలపై దాడులకు పాల్పడుతున్న పులులను బంధించి మరోచోట వదలడం పరిష్కారం కాదని, అంతకంటే తీవ్రమైన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పులుల దాడులకు ప్రభుత్వం పరిష్కారం కనుగొనాలని వన్యజీవి పరిశోధకుడు తమ్మయ్యపూవయ్య సూచించారు.

క్లుప్తంగా

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి కృషి

బాగేపల్లి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని మతాలు, ధర్మాల తీర్థ క్షేత్రాలు, పుణ్యస్థలాల అభివృద్ధికి, పర్యాటకాభివృద్ధికి శ్రమిస్తోందని మాజీసీఎం బీఎస్‌యడియూరప్ప అన్నారు. బాగేపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న యడియూరప్ప మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేవస్థానాలు, మఠాల అభివృద్ధికి వేలాది కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల, మహిళల క్షేమాభివృద్ధికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుధాకర్, ఎంపీ బీసీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర

కంప్లి: గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని కేసీఆర్‌ఓ సభ్యులు హెచ్‌సీ రాఘవేంద్ర తెలిపారు. దేవలాపురలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అమృత్ అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పిల్లల ఆరోగ్యాలపై దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహారం, స్వచ్ఛతపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జీపీ అధ్యక్షురాలు ఉమాదేవి, వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, సంపన్మూల ప్రముఖులు జగన్నాథ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి, ధ్యానాలు జ్ఞాన సంకేతాలు

గౌరిబిదనూరు: సకల జీవరాశుల సృష్టికర్త పరమశివుడే, జ్యోతిర్లింగాల దర్శనం వల్ల ముక్తి లభిస్తుందని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థానిక కేంద్రం ముఖ్యస్థురాలు బికె పద్మా బెహన్ తెలిపారు. ఆదివారం రాత్రి సొల్లాపురమ్మ,మరిగమ్మ దేవాలయంలో 108 శివలింగాల శివోత్సవం ముగింపు వేడుకలో పాల్గొని ప్రసంగించారు. శివుని ధ్యానంలో శాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల మనిషి ప్రశాంత జీవితం గడపడానికి వీలవుతుంది. భక్తి, ధ్యానాలు జ్ఞాన సంకేతాలు అని వివరించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ గీత, సిఐ సత్యనారాయణ, ప్రకాశ్, నగరసభ సభ్యుడు వెంకటరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిద్ధారూడ రథోత్సవం

హుబ్లీ: ఉత్తర కర్ణాటక ప్రజల ఆరాధ్య దైవం సిద్ధారూడ రథోత్సవం వేలాది భక్తుల మధ్య ఘనంగా జరిగింది. సిద్ధారూడ మఠం ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని మరునాడు సాయంత్రం జరిగిన ఈ రథోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొని హరహర మహాదేవ అంటూ అరటి పండ్లు, నిమ్మకాయలను రథంలోని ఉత్సవ మూర్తులకు సమర్పించారు. మఠం ఆవరణలో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఈ సందర్భంగా డోలు, బ్యాండ్ వాయిద్యాలతో సాగిన సామూహిక నృత్యాలు భక్తులను అలరించాయి. ఈ రథోత్సవంలో కర్ణాటకలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ధర్నా



శివమొగ్గ: శివమొగ్గ తాలూకాలోని హొళెహట్టి, హొళలూరు గ్రామాలకు కోతల్లేని పూర్తి స్థాయి విద్యుత్ సరఫరా చేయాలని సోమవారం మెస్కాం కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేశారు. విద్యుత్ కోతల వల్ల పంటలకు నీటి సరఫరా కావడం లేదని వాపోయారు. ఎండలు విపరీతంగా ఉన్నందున పంటలు పాడవుతున్నట్లు రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పగలు ఏడు గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయడంలో మెస్కాం విఫలం అవుతోందని వారు విమర్శించారు.

బ్లాక్‌మెయిలర్లు ఎవరో చెప్పండి

బళ్లారి రూరల్ : ఎమ్మెల్యేని మామూళ్లు అడిగిన విలేకరుల పేర్లను బయటపెట్టాలని కర్ణాటక పాత్రికేయుల సంఘ బళ్లారి శాఖ అధ్యక్షుడు వలీబాషా డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పత్రికాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. వారి పేర్లు చెప్పకపోవడంతో నగరంలో నిజాయితీగా పని చేస్తున్న విలేకరులు సైతం నిందలు మోయాల్సి వస్తోందన్నారు. విలేకరులపై సోషల్ మీడియాలో కొందరు అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఎమ్మెల్యే విలేకరులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని, వాటిని ఖండిస్తున్నామన్నారు. ఈసందర్భంగా సంఘం కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా- డ్రైవర్ మృతి

హొసపేట: తమ్ముడి పెళ్లి ముగించుకొని ట్రాక్టర్‌లో తిరిగి ఇంటికి వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడటంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా అళిగంజికెరె క్రాస్ వద్ద సోమవారం జరిగింది. హరపనహళ్లి పోలీసులు తెలిపిన వివరాలు.. హరపనహళ్లి తాలూకా గుండుగత్తి గ్రామ నివాసి పరసప్ప(45) తన తమ్ముడి పెళ్లికి కుటుంబం సమేతంగా ట్రాక్టర్‌లో వెళ్లారు. తమ బంధువులను వదలిపెట్టి తిరిగి ఒంటరిగా ట్రాక్టర్‌ను నడుపుతూ వస్తుండగా మార్గమధ్యంలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో తీవ్ర గాయాలై పరసప్ప మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు హరపనహళ్లి పోలీసుల దర్యాప్తులో ఉంది.

సమాజోద్ధారకుడు సర్వజ్ఞ

- ఘనంగా త్రిపదకవి జయంతి ఊరేగింపు
- కుంబార అభివృద్ధి మండలిని స్థాపించాలి



రాయచూరులో ఊరేగింపులో పాల్గొన్న కుంబార సంఘం నేతలు



బళ్లారిలో సర్వజ్ఞ చిత్రపటానికి నాయకులు, అధికారుల పుష్పాంజలి

రాయచూరు రూరల్: నగరంలో కవి సర్వజ్ఞ జయంతిని సోమవారం ఆచరించారు. బసవేశ్వర సర్కిల్ వద్ద కవి సర్వజ్ఞ చిత్రపటానికి సమాజం అధ్యక్షుడు సురేంద్ర బాబు పూలమాల వేసి పూజ చేశారు. అనంతరం కన్నడ భవనంలో త్రిపది సర్వజ్ఞ జయంతిని ప్రారంభించారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు లలిత, కమిషనర్ గురులింగప్ప, తహసీల్దార్ చెన్నమల్లప్ప, అధికారిణి మంగళ నాయక్‌లున్నారు.

వచన సాహిత్య వాగ్గేయకారుడు సర్వజ్ఞ

బళ్లారిఅర్బన్: త్రిపదలో వచన సాహిత్యాన్ని రచించిన వాగ్గేయకారుడు సంతకవి సర్వజ్ఞ అని కన్నడ సంస్కృతి శాఖాధికారి సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం బీడీఏఏ ఫుట్‌బాల్ మైదానంలో ఏర్పాటు చేసిన సర్వజ్ఞ జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆకాశవాణి ఎఫ్ఎం కేంద్ర అనౌన్సర్ బసవరాజ్, జనసైన్య అధ్యక్షులు ఎర్రిస్వామి, కుంబార సంఘం అధ్యక్షులు కే.రంగస్వామి, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నరసయ్య, సర్వేష్, నాగేంద్ర, సమాజ బాంధవులు పాల్గొన్నారు.

త్రిపది బ్రహ్మ కవి సర్వజ్ఞ

సిరుగుప్ప: త్రిపది కావ్యాలతో సమాజంలో తారతమ్యాలను సరిచేసిన సర్వజ్ఞుడు జ్ఞానవంతుడయ్యారని తహసీల్దార్ ఎస్.ఆర్.మంజునాథస్వామి పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలోని సీడీపీఓ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన త్రిపది బ్రహ్మకవి సర్వజ్ఞ జయంతిలో పాల్గొని మాట్లాడారు.ఈసందర్భంగా ఈఓ ఎం.బసప్ప, బసవభూషణ స్వామీజీ, కన్నడ ఉపన్యాసకులు జడెప్ప, మాజీ కౌన్సిలర్ సణ్ణ ఉచ్చీరప్ప, గోవిందప్ప, ఓబళేశప్ప పాల్గొన్నారు.

త్రిపద కవి సర్వజ్ఞ జయంతి

కంప్లి: కుంబార అభివృద్ధి మండలిని స్థాపించడంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని మెట్రి గ్రామ కుంబార శాలివాహన సంఘం అధ్యక్షులు కుంబార సిద్దప్ప డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన త్రిపదకవి సర్వజ్ఞ జయంతిలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఉపతహసీల్దార్ రవీంద్రకుమార్, శిరస్తిదార్ ఎస్‌.డీ.రమేష్, వీఏలు వనిత, రూపా, ఎఫ్‌డీఏలు తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞకు నివాళి

కోలారు : నాడు, నుడి, సంస్కృతి పరంపరను పెంచి పోషించిన మహనీయుడు సర్వజ్ఞ అని డిప్యూటీ కలెక్టర్ హెచ్.అమరేష్ తెలిపారు. సోమవారం నగరంలోని రంగమందిరంలో నిర్వహించిన సర్వజ్ఞ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. సర్వజ్ఞ భావి తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. జన సామాన్యుల మధ్య జీవించి సాహిత్యాన్ని రచించిన మహనీయుడు సర్వజ్ఞ అని కొనియాడారు. ఈ సందర్భంగా కన్నడ సంస్కృతి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలారులో సిద్ధూకు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న ఈశ్వరప్ప

రాయచూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు కోలారులో ఓటమి తప్పదని రాష్ట్ర మాజీమంత్రి ఈశ్వరప్ప పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్దరామయ్యను బయటికి పంపడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. చాముండేశ్వరి నుంచి పోటీకి విముఖత ఉండడంతో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే ప్రశ్న నెలకొందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై బడ్జెట్‌పై కాంగ్రెస్ నేతలు చెవిలో పూలు పెట్టుకొని అసెంబ్లీకి వచ్చి నిరసన తెలపడం విడ్డూరమన్నారు. ఐపీఎస్ అధికారిణి డి.రూపా, ఐఏఎస్ అధికారిణి సింధూరిలు వ్యక్తిగత దూషణలతో పత్రికలకు ఎక్కడం తగదన్నారు. కాంగ్రెస్ సంచాలకుడు సుర్జేవాలా బీజేపీ నేతలు రాక్షసులని అభివర్ణించడాన్ని ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏను గులాంటివారని, వారి వెనుక కుక్కలు మొరిగినట్లుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడడం తప్పు అని అన్నారు.

పారిపోతూ నదిలో పడి వేటగాడు మృతి

మైసూరు: చామరాజనగర జిల్లాలోని హనూరు తాలూకా సరిహద్దులో ఉన్న కావేరి నదిలో ఒక వ్యక్తి శవం లభ్యమైంది. ఇతడు తమిళనాడు గోవిందపడి గ్రామానికి చెందిన రాజు (45)గా గుర్తించారు. కావేరి వన్యధామం గోపినాథం జోన్ కిందకి వచ్చే పాలార్ ప్రాంతంలో మంగళవారం రాత్రి తమిళనాడుకు చెందిన నలుగురు జింకల వేటకు వచ్చారు. ఈ సమయంలో అటవీ శాఖ అధికారులు- వేటగాళ్ల మధ్య గాల్లోకి కాల్పులు జరిగాయి. దీంతో అక్కడి నుంచి వేటగాళ్లు పరారీ అయ్యారు. వారిలో ఒకరైన రాజు పారిపోతూ నదిలోకి పడి ఉంటాని అనుమానిస్తున్నారు.

బైక్ ప్రమాదంలో యువకుడు..

చెట్టుకు బైక్ ఢీ కొనడంతో ఒకరు మరణించాడు. ఈ ఘటన కొళ్లేగాల పట్టణంలో జాతీయ రహదారిపై జరిగింది. కొళ్లేగాల తాలూకా కుంతూరు గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ (23) బెంగళూరులోని ఒక కర్మాగారంలో పనిచేస్తుంటాడు. శివరాత్రికి కొళ్లేగాలకు వచ్చాడు. సోదరుని బైక్ తీసుకుని రోహిత్ అనే వ్యక్తితో వెళుతుండగా గురునారాయణ సర్కిల్ వద్ద ప్రధాన రహదారిపై పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టుకుంది. తీవ్రంగా గాయపడిన మనోజ్ అక్కడికక్కడే మరణించాడు. రోహిత్‌కు గాయాలయ్యాయి.

మంత్రిపై చర్యల కోసం బైక్ ర్యాలీ



నగరంలో బైక్ ర్యాలీ చేపట్టిన కార్యకర్తలు

గంగావతి: అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం సిద్దరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర విద్యా శాఖా మంత్రి అశ్వత్ నారాయణపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కురుబ సమాజం ఆధ్వర్యంలో సోమవారం నగరంలో బైక్ ర్యాలీని చేపట్టారు. మండ్య జిల్లా సాతనూరు గ్రామ కంబద నరసింహ స్వామి దేవస్థానం ఆవరణలో జరిగిన బీజేపీ మహాశక్తి కేంద్ర సమావేశంలో సిద్దరామయ్యను టిప్పు సుల్తాన్‌తో పోల్చి మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న వారు ఇలాంటి వ్యాఖ్యలతో కులమతాల మధ్య అశాంతిని రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. తక్షణం మంత్రిని ఆ పదవి నుంచి తొలగించి ప్రభుత్వం ఆయనపై సుమోటో కేసును దాఖలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కురుబ సమాజ అధ్యక్షులు యమునప్ప విట్లాపుర్, పదాధికారులు నేతృత్వం వహించారు.

కేఆర్‌పీపీలోకి బీజేపీ కార్యకర్తల చేరిక



వేదికపై బ్రాహ్మణి తదితరులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

బళ్లారిటౌన్: కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) యువనాయకురాలు బ్రాహ్మణి సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కేఆర్‌పీపీలోకి చేరారు. స్థానిక 5వ వార్డులోని కాకర్లతోట ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద చేపట్టిన కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన మాస్టర్ రుద్రయ్య చౌదరిస్వామి, ఎం.రామాంజనేయులు, లారీ యజమానుల సంఘం ఉపాధ్యక్షులు విశ్వనాథ, కే.ప్రసాద్, సోమశేఖర్, అమరేశ, సుధాకర్, బీ.పవన్‌కుమార్, వెంకటమ్మ కాలనీ బీ.సుంకణ్ణ తదితర 50 మందికి పైగా చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లాధ్యక్షులు గోనాళ్ రాజశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు హంపీ రమణ, నేతలు కుద్దూస్‌సాబ్, మెహపూజ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో కసాప సమ్మేళనం

గంగావతి రూరల్: నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్చి 6, 7 తేదీల్లో జరిగే తాలూకా స్థాయి 8వ కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కసాప తాలూకా అధ్యక్షులు శ్రీనివాస్ అంగడి తెలిపారు. మార్చి 6న సదస్సు ప్రారంభోత్సవం, 7న సాంస్కృతిక కళా బృందాలతో కళాప్రదర్శనలు ఉంటాయి. కన్నడ నాడు, నుడిపై కార్యక్రమాలను ప్రదర్శించే ఆసక్తిగల తాలూకాలోని సాంస్కృతిక బృందాలు ఈనెల 25లోగా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

గోమాతకు రాజవంశీకుల ప్రత్యేక పూజలు

- రెండో రోజున గణపతి హోమం



పూజ నిర్వహిస్తున్న రాజ వంశీక దంపతులు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది మేగోటె దుర్గామాత ఆలయంలో దుర్గామాత మూర్తి ప్రాణ ప్రతిష్ఠాపన వేడుకల రెండో రోజున సోమవారం రాజవంశస్థులు లలితారాణి శ్రీ రంగదేవరాయలు, రాజా కృష్ణదేవరాయల దంపతుల నేతృత్వంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులతో పాటు దుర్గామాత మానస పుత్ర, దాసోహరత్న బ్రహ్మనంద స్వామీజీ ఆధ్వర్యంలో గణపతి, వాస్తు, నవగ్రహ, రుద్రహోమాలతో పాటు వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ బృందంతో పాటు మేనేజర్ రాజన్న స్వామి, నరేంద్రప్ప, నాగరాజ్, వెంకటేశ్, రామణ్ణ, బాలు స్వామి, జీపీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

కనువిందుగా వస్త్ర మేళా





చీరలలో మోడల్ భామలు

బనశంకరి: మహాశివరాత్రి సందర్భంగా వీవ్స్ పేరుతో కొలువుదీరిన పట్టుచీరల ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేస్తోంది. సోమవారం మోడల్స్ భామలు మేళాలో సందడి చేశారు. జేపీ నగర ఫస్ట్‌ఫేజ్‌లోని సింధూర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ వస్త్రమేళాలో ఒడిస్సా సంబల్‌పురి ఇక్కత్‌చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సర్ శారీస్ మగువుల మనసు దోచేస్తున్నాయి. అస్సాం మూగా ఇరి సిల్క్ చీరలు, కర్ణాటక క్రేప్‌సిల్క్, ఆరణిపట్టు చీరలు, ప్రింటెడ్‌శారీస్ కంచి, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి చీరలు విక్రయాలు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన 22వ తేదీ వరకు నిర్వహిస్తారు.



కోలారు వార్తలు...

విద్యుత్ షాక్‌తో ఆటో డ్రైవర్ మృతి

శ్రీనివాసపురం : విద్యుత్ షాక్‌తో ఆటో డ్రైవర్ మరణించిన ఘటన ముళబాగిలు తాలూకా చెలువనాయకనహళ్లిలో చోటు చేసుకుంది. ఆటో నడుపుకునే గ్రామానికి చెందిన సత్యనారాయణ(50) అనే వ్యక్తి తమ ఇంటి నీటి తొట్టిని శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. బెస్కాం అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ముళబాగిలు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

కేజీఎఫ్ : పిల్లల ఆరోగ్యానికి పౌష్టికాహారం అందించాలని డాక్టర్ తిమ్మయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి లక్ష్మీపతి తెలిపారు. సోమవారం ఘట్టకామధేనహళ్లి జీపీలోని రైతులకు పాల ఉత్పత్తిపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆధునిక పశువుల కొట్టాన్ని సిద్ధం చేసుకొని నిత్యం వాటి స్వచ్ఛతపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు పచ్చిమేత అందిస్తే నాణ్యమైన పాల ఉత్పత్తి సాధ్యమన్నారు. డాక్టర్ టి వెంకటవర్ధన్, ప్రిన్సిపాల్ సయ్యద్ ఆరిఫ్, డాక్టర్ హెచ్‌టి శెట్టి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

శ్రీనివాసపురం : ముళబాగిలు తాలూకా ఆవణి గ్రామంలో వెలసిన పురాణ ప్రసిద్ధ రామలింగేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన రథోత్సవం, పశువుల జాతరకు తాలూకా నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సుందరంగా అలంకరించిన రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే హెచ్ నాగేష్, మాజీ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఆటగాళ్లకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: నేటి యువతలో మానసిక, శారీరక ఉత్సాహం నింపాలని, తద్వారా ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు జి కె వెంకటశివారెడ్డి అన్నారు. సోమవారం తాలూకాలోని గుమ్మరెడ్డిపుర గ్రామంలో జాతీయ వాలీబాల్ క్రీడాకారులైన శ్రీనాథ్, లక్ష్మణరెడ్డిలను సన్మానించారు. క్రీడలు, వ్యాయామాల ద్వారా అనేక రోగాల నుంచి దూరం కావచ్చన్నారు. తాలూకాలోని ఈ క్రీడాకారులు 5వ జాతీయ స్థాయి మాస్టర్ గేమ్స్ వారణాసిలో జరిగిన వాలీబాల్ పోటీలో విజేతలుగా నిలిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎన్నిక కావడం జిల్లాకే గర్వ కారణమన్నారు. తూపల్లి నారాయణస్వామి, గాయత్రి ముత్తప్ప, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై ఆడియో విడుదల



ఆడియో విడుదల చేస్తున్న దృశ్యం

మాలూరు : దేశంలో కొత్త రాజ్యాంగం అమలుకు కుట్ర జరుగుతోందని తమిళనాడులోని చిదంబరం ఎంపీ తోళ్ తిరుమావళవన్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో స్యామ్ ఆడియోస్ అధినేత సిద్దార్థ ఆనంద్ తెచ్చిన డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్‌పై ఆడియో విడుదలలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాశీలో 10 మంది నాయకులు కలిసి కొత్త రాజ్యాంగ రచనపై చర్చించారన్నారు. భారత్‌కు హిందూ దేశంగా తేవాలని, న్యూఢిల్లీకి బదులుగా వారణాసిని రాజధానిని చేయాలని, త్రివర్ణ ధ్వజానికి బదులుగా స్వస్తిక్ ధ్వజాన్ని తేవాలనే ఆలోచన చేశారన్నారు. ఎమ్మెల్యే కె వై నంజేగౌడ మాట్లాడుతూ రాజ్యాంగ ఆశయాలను అమలు చేయాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు హూడి విజయకుమార్, రామేగౌడ, నజ్మా నజీర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : వక్కలేరి సమీపంలోని మార్కండేయ ఆలయానికి నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ఎంపీ ఎస్ మునిస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లే ఆలయానికి స్థానికుల కోరిక మేరకు సీసీ రోడ్డును నిర్మించామన్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షల ఎంపీ నిధులకు తోడు దాతలు కూడా సహకారం అందించారన్నారు. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు ఉత్తర వలయ డీసీపీ డి.దేవరాజ్, ఆలయ కార్యదర్శి సీ ఎం వెంకటేశప్ప, కన్వీనర్ వేణుగోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

హుబ్లీ: ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి, ఐపీఎస్ అధికారిణి డీ.రూపాలపై ముఖ్యమంత్రి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూచించారు. హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది అనారోగ్యకర పరిణామం అన్నారు. పరస్పరం ఫిర్యాదులు ఉంటే సంబంధిత ప్రాధికారలకు పంపించాలి కానీ ఇలా రచ్చ చేసుకోవడం తగదన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

కోలారు : వివేకానంద, ఛత్రపతి శివాజీ జయంతులను పురస్కరించుకుని సమాజ సేవకుడు, బీజేపీ నాయకుడు హూడి విజయకుమార్ క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. సుమారు 700లకు పైగా క్రికెట్, వాలీబాల్ బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొని క్రికెట్, వాలీబాల్ కిట్లను పొందారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ప్రభాకర్, పార్టీ తాలూకా అధ్యక్షుడు పుర నారాయణస్వామి, ఆర్ ప్రభాకర్, నరేంద్ర రంగప్ప, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు, ప్రముఖులు

గంగావతి: సేవాలాల్ జయంతిని నగరంలో బంజారా సమాజం వారు ఘనంగా జరిపారు. సోమవారం నగరంలో సేవాలాల్ చిత్రపటాన్ని హంస వాహనంపై ఉంచి ముందు భాగంలో మహిళలు వరినారు బుట్టలను, కుంభాలను తలపై పెట్టుకొని ఊరేగింపు ముందు భాగంలో పాల్గొన్నారు. ఈ ఊరేగింపును డప్పుల వాయిద్యాల నడుమ నగర ప్రముఖ వీధుల గుండా బస్టాండ్ సర్కిల్, ఆనెగుందిలోని సేవాలాల్ రోడ్డు వరకు నిర్వహించారు. ఊరేగింపులో మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్, బంజార సమాజం అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్, మాజీ కౌన్సిలర్లు రామనాయక్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భార్యా హంతకుని అరెస్ట్

హొసపేట: తన భార్యను హత్య చేసి పరారైన నిందితుడిని పోలీసులు బంధించిన ఘటన సోమవారం హగరిబొమ్మనహళ్లి తాలూకా వరదాపుర గ్రామ శివార్లలో జరిగింది. గ్రామానికి చెందిన బంగి మల్లప్ప తన భార్య లక్ష్మీదేవి(32)తో గొడవపడి ఆదివారం తెల్లవారు జామున ఇనుప గునపంతో దాడి చేసి హతమార్చి పరారయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ముమ్మరంగా గాలించి 24 గంటల్లోగా నిందితుడు మల్లప్పను బంధించినట్లు సీఐ మంజణ్ణ తెలిపారు.

ఉన్నత విద్యకు ప్రాముఖ్యత



మాట్లాడుతున్న వీసీ శరణప్ప వైద్యనాథ్ హలస

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఓపెన్ విశ్వవిద్యాలయం(మానస గంగోత్రి)నుంచి ఉన్నత విద్యకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు వైస్ చాన్సలర్ శరణప్ప వైద్యనాథ్ హలస పేర్కొన్నారు. ఆయన సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడానికి వర్సిటీలో తక్కువ ఫీజులతో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ డిప్లొమా కోర్సుల అభ్యాసానికి అవకాశం కల్పించామన్నారు. దక్షిణ కర్ణాటకతో పోల్చుకుంటే ఈ ప్రాంత అభివృద్ధికి వర్సిటీ తరఫున తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిలో అధ్యయన కేంద్రం ప్రారంభిస్తామన్నారు.

ప్లేట్లు, గ్లాసుల అందజేత

కంప్లి: కంప్లి క్షేత్రం నుంచి తాను పోటీ చేసి గెలుపొందడం ఖాయమని కాంగ్రెస్ టికెట్ ఆకాంక్షి రాజానాయక్ తెలిపారు. సోమవారం కే.సోమలాపురలో పర్యటించిన ఆయనకు గ్రామస్తులు, మద్దతుదారులు భారీ ఊరేగింపుతో గ్రామంలోని దేవస్థానానికి పిలుచుకెళ్లారు. అక్కడి నుంచి గ్రామంలోని ప్రతి వార్డులో పర్యటించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం మారెమ్మదేవి ఆలయ ఆవరణలో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఇకపై ప్రతి గ్రామంలో పర్యటిస్తానన్నారు. తర్వాత గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఆలయంలో హుండీ చోరీ

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో నిత్యం ఏదో ఒక గ్రామంలో దేవాలయాల్లో చోరీ జరుగుతోంది. పోలీసులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా దొంగలు తగ్గేడం లేదనే విమర్శలున్నాయి. సోమవారం తెల్లవారుజామున దొడ్డ తాలూకా దొడ్డహెజ్జాజి గ్రామంలోని శని మహాత్మస్వామి దేవాలయంలో దొంగలు పడి హుండీ దోచుకున్నారు. గత మూడేళ్లుగా హుండీ తెరవలేదు. దీంతో పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆశావహులతో సుర్జేవాలా భేటీ



తుమకూరు: జిల్లాలోని విధానసభ ఆయా నియోజకవర్గాలకు సంబంధించి టికెట్లు ఆశిస్తున్న ఆశావహులతో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా భేటీ అయ్యారు. తుమకూరులోని అర్బన్ రిసార్ట్ హోటల్‌లో సమావేశం నిర్వహించి 11 అసెంబ్లీ నియోజకవర్గాల ఆశావహులతో మాట్లాడారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే కేఎన్ రాజణ్ణ ఇంటికి చేరుకుని ఆయనతో జిల్లా రాజకీయాలపై చర్చించారు. అనంతరం ఒకే కారులో సుర్జేవాలా, మాజీ డీసీఎం పరమేశ్వర, కేఎన్ రాజణ్ణలు రిసార్టు వద్దకు చేరుకున్నారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆశావహులకు సుర్జేవాలా సూచించారు.

హాఫ్ హెల్మెట్ వద్దు

మైసూరు: పోలీసుల తనిఖీ నుంచి తప్పించుకునేందుకు హాఫ్ హెల్మెట్ ధరించే వారు ఇకపై పూర్తిస్థాయి హెల్మెట్ ధరించాల్సిందే, లేదంటే జరిమానా కట్టాల్సి వస్తుంది. పోలీసుల జరిమానాను తప్పించుకునేందుకు కొందరు ఇష్టం లేకున్నా హాఫ్ హెల్మెట్ ధరిస్తూ బైక్‌ను నడుపుతున్నారు. ఇలాంటి వారిపై మైసూరు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు,. బైక్‌లో వెళ్లేవారు ఐఎస్‌ఐ ఉన్న నాణ్యమైన హెల్మెట్‌ను ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు. హాఫ్ హెల్మెట్ ధరిస్తే రూ. 500 జరిమానా విధిస్తామని చెప్పారు.

పర్మినెంట్ చేయండి



తుమకూరు: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను ఈ బడ్జెట్ ద్వారా క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటన వస్తుందని నమ్మకంతో ఉన్న తమకు నిరాశ ఎదురైందని మునిసిపల్ కార్మికులు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. సీఐటీయూ నేతృత్వంలో మునిసిపల్ సంఘాలు సోమవారం తుమకూరు మహానగర పాలికె ఎదుట ధర్నా నిర్వహించారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లు పరిష్కరించకుంటే తాము విధులు నిలిపివేసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మేయర్, కమిషనర్ అక్కడికి చేరుకుని కార్మికులతో మాట్లాడారు.

తాగిన మత్తులో.. చెరువులో పడి

మైసూరు: తాగిన మత్తులో చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా తెరకణాంబి గ్రామంలో జరిగింది. కీర్తి (30), వినోద్ (26) అనే ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి తాగిన మత్తులో చెరువు వద్దకు మూత్రవిసర్జన కోసం వచ్చారు. ఈ సమయంలో అదుపు తప్పి అందులో పడిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. తెరకాణంబి పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది.

కొడవలితో మహిళపై దాడి

దొడ్డబళ్లాపురం: స్థల వివాదం నేపథ్యంలో మహిళపై కొడవలితో దాడి చేసిన సంఘటన రామనగర తాలూకా జాలమంగల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని తానయ్య అనే వ్యక్తి రత్నమ్మ అనే మహిళపై కొడవలితో దాడికి పాల్పడ్డంతో తల, ఇతర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. తానయ్య, రత్నమ్మ కుటుంబాల మధ్య ఒక స్థలానికి సంబంధించి తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చి రత్నమ్మతో గొడవపడ్డాడు. కొడవలితో రత్నమ్మపై దాడి చేసి గాయపరిచాడు. అనంతరం పరారయ్యాడు. రామనగర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: హుణసూరు తాలూకా హనకొప్పే గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. ఈ చిరుత గ్రామానికి చెందిన నాగరాజ గౌడ అనే వ్యక్తి పొలంలో ఒక పశువుపై దాడి చేసి చంపేసింది. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు పొలంలో బోను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. సమాచారం అందుకున్న అధికారులు చిరుత బంధించి బండీపుర అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

అండర్‌పాస్ కోసం ధర్నా.. ఉద్రిక్తత

- ఊరికి దగ్గరగా కట్టాలని రైతులు, ప్రజల ఆందోళన
- పోలీసుల లాఠీచార్జీ

మండ్య: బెంగళూరు వేగమార్గంలో అండర్‌పాస్ వివాదంపై రైతులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జీ చేశారు. రైతు ముఖ్య నేతలను అరెస్టు చేశారు. ఈ ఆందోళన మండ్య తాలూకా హనకెరె వద్ద జరిగింది. హనకెరె వద్ద కాకుండా సుమారు 600 మీటర్ల దూరంలో అండర్‌పాస్‌ను నిర్మించడం అశాస్త్రీయమని ఆందోళనకారులు ఆరోపించారు. అందరికీ అనువుగా ఉన్న చోట అండర్‌పాస్ ఉండాలని కోరారు.



ఉదయం నుంచి నిరసన

సోమవారం ఉదయం ఏడు గంటలకు రైతు సంఘం నాయకులు, చుట్టుపక్కల గ్రామస్తులు బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో వాహనాలను అడ్డగించి తమ ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి ప్రాధికార సంస్థ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడినా పరిష్కారం కాలేదు. సుమారు మూడు గంటలకు పైగా రైతులు రోడ్డుపై బైఠాయించడంతో కిలోమీటర్ల కొద్దీ వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి ట్రాఫిక్ స్తంభించింది. జిల్లా ఎస్పీ ఎన్.యతీశ్ చేరుకుని రైతు నేతలతోమాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

రాళ్ల దాడి, లాఠీలతో జవాబు

ఈ క్రమంలో అధికారులు, పోలీసులపై రైతులు మండిపడ్డారు. ధర్నా విరమించకపోయినా, కనీసం వాహనాల రాకపోకలకు మార్గం వదలాలని పోలీసులు కోరారు. ఉద్రిక్తత ముదిరి రైతులు పోలీసులపై రాళ్లు విసరారు, ఎస్పీ ఆదేశంతో పోలీసులు లాఠీచార్జీ చేయడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. రాష్ట్ర రైతు సంఘం నాయకులు ఎస్‌సీ మధుచందన్, ప్రసన్న ఎన్.గౌడ సహా కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోరాటాలతోనే రైతు సమస్యల పరిష్కారం

గౌరిబిదనూరు: రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలు అనివార్యమని శాశ్వత నీటి పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి తెలిపారు. సోమవారం తాలూకా గుండ్లహళ్లి గ్రామంలో తాలూకా రైతు సంఘం, హసిరు సేనె సహభాగిత్వంలో రైతు సంఘం శాఖను ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడచినా రైతుల సమస్యలు సమస్యలుగానే మిగిలాయని అన్నారు. కరువు పీడిత కోలారు, చిక్కబళ్లాపురం జిల్లాలకు బెంగుళూరు మురికి నీటిని శుభ్రపరచి సరఫరా చేసే హెచ్ఎన్ వ్యాలీ నీటిని మూడవ దశ శుద్ధి చేసి సరఫరా చేయడానికి బడ్జెట్‌లో అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి లాయర్ లక్ష్మీనారాయణ, ముద్దురంగప్ప, తాలూకు అధ్యక్షుడు గుండాపురం లోకేశగౌడ, రామచంద్రారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, సనత్‌కుమార్, హీరేబిదనూరు రాజణ్ణ, నరసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతుసంఘం శాఖను ప్రారంభిస్తున్న ఆంజినేయరెడ్డి తదితరులు

పంక్చర్ షాపులో మంటలు

- పక్కనున్న మొబైల్ షాపు ఆహుతి

విజయపుర: బెంగళూరు రూరల్‌లోని విజయపుర పట్టణం బస్టాండ్‌లో ఉన్న పంక్చర్ దుకాణంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణంతో పాటు అందులోని టైర్లన్నీ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. పురసభ దుకాణాల కాంప్లెక్స్ పక్కనే ఉన్న కేఎస్ఆర్టీసీ కంట్రోల్ రూమ్ కార్యాలయానికి కూడా సెగ తగిలింది. కార్యాలయంలోని పుస్తకాలు, పేపర్లు కాలిపోకుండా స్థానికుల సహకారంతో బయటకు తీసుకురాగలిగారు. టైర్ పంక్చర్ షాపునకు ఆనుకుని ఉన్న మొబైల్ దుకాణానికి కూడా మంటలు వ్యాపించాయి. దీంతో మొబైల్ షాపులోని మొబైళ్లు, కంప్యూటర్ కాలిపోయాయి. పోలీసులు నీటి ట్యాంకర్‌ను వెంటనే తెప్పించి నీళ్లు చల్లడంతో మరిన్ని దుకాణాలు అగ్నికి ఆహుతి కాలేదు. కొందరు పోలీసులకు స్వల్పంగా కాలిన గాయాలు అయ్యాయి.



అగ్నిప్రమాద దృశ్యం

ఫైరింజన్ ఇవ్వరెందుకు?

దేవనహళ్లిలోని అగ్నిమాపక స్టేషన్ ఉన్నప్పటికీ విజయపురకు కనీసం ఒక్కటైన ఫైరింజన్ వాహనాన్ని ఇవ్వాలని పలమార్లు డిమాండ్ చేసినా ప్రభుత్వం, అధికారులు స్పందించలేదు. ఎండల వేడికి అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ క్రమంలో తమ పట్టణానికి ఒక ఫైర్ ఇంజన్‌ను కేటాయించాలని పురసభ మాజీ అధ్యక్షుడు ఎం.సతీశ్ కుమార్, స్థానికులు కోరారు.

మొబైల్ తీసుకున్నాడని హత్య

మైసూరు: అనుమతి లేకుండా మొబైల్ తీసుకున్నాడనే కోపంతో తోటి స్నేహితుడిని సహచర మిత్రులు చంపేశారు. ఈ ఘటన చాముండిబెట్టలో జరిగింది. మైసూరు గిరిదర్శని లేఔట్ నివాసి లోకేశ్, భరత్, సూర్యకుమార్ మిత్రులు. ఇదిలా ఉంటే లోకేశ్, సూర్యకుమార్ మొబైల్ తీసుకుని ఉపయోగించుకున్నాడు. దీంతో మిత్రులు అతనితో గొడవకు దిగారు. అది కాస్తా పెద్దదిగా మారింది. కోపోద్రిక్తులైన సూర్యకుమార్, భరత్‌లు లోకేశ్‌ను దారుణంగా కొట్టారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న రాయి ఎత్తి తలపై బాది హత్య చేశారు. అనంతరం పరారయ్యారు. ఈ విషయంపై నజర్‌బాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

నిలిపి ఉన్న లారీని ఢీకొన్న బైక్



తీవ్ర గాయాలతో పడి ఉన్న బైకిస్టు

దొడ్డబళ్లాపురం: రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో బైక్ చోదకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన దొడ్డ తాలూకా ఓబదేనహళ్లి వద్ద సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఓబదేనహళ్లి వద్ద నిత్యం అనేక లారీలను రోడ్డు పక్కనే నిలపడం వల్ల తెల్లవారుజామున ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఫ్యాక్టరీకి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి దగ్గరకు వచ్చే వరకూ లారీ కనబడకపోవడంతో వేగంగా వెళ్లి లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో బైక్ చోదకుడు తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌కి ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆ పార్టీలకు భయపడొద్దు

-కార్యకర్తలతో హెచ్.డీ.కుమారస్వామి

శివాజీనగర: జేడీఎస్ బలోపేతం, రానున్న శాసనసభ ఎన్నికలకు వేగవంతంగా ఏర్పాట్లు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి, సోమవారం బెంగళూరులో వేలాది మంది కార్యకర్తలతో నేరుగా ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో బెంగళూరు నుంచి కార్యకర్తలతో కాన్ఫరెన్స్ కాల్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ధైర్యం చెప్పిన కుమార, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేపడుతున్న దాడుల గురించి భయపడవద్దని, ఏ సంఘటన జరిగినా తనను సంప్రదించాలని, మీకు నేరుగా నిలుస్తానని భరోసానిచ్చారు. పార్టీలో ఎలాంటి గందరగోళం లేదని, అతి తర్వలో అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని, అందులో హాసన్ అభ్యర్థి పేరు కూడా ఉంటుందని తెలిపారు.

ఛత్రపతి శివాజీ జయంతి



చింతామణి: చింతామణి పట్టణ తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా జరిపారు. టీబీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. శివాజీకి జేజేలు పలుకుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్ర, అధికారులు, బీజేపీ నాయకులు గోపి, సత్యనారాయణరెడ్డి, అరుణబాబు తదితరులు శివాజీ గురించి వివరించారు.

ఉచిత వైద్య శిబిరాలు వరం



బనశంకరి: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఒక వరమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ నేత ఆర్‌కే.రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం ఉత్తరహళ్లి పరిధి తురహళ్లి సుబ్రమణ్యేశ్వర శ్రీమహాప్రత్యంగిరదేవి, జ్ఞానమునేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. కంటి పరీక్షలు చేసుకున్న వారికి కంటి అద్దాలను వితరణ చేశారు. నిర్వాహకులు ఎస్.శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్, శ్రీధర్ లక్ష్మణ్, ఈశ్వర్, డీజీ.శివకుమార్, గిరీశ్, సోమశేఖర్, నంజుండ, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై ధ్వజమెత్తిన డీ.కే

శివాజీనగర: స్యాంకి ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ పథకం టెండర్‌లో కూడా కమీషన్ పొందారని కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ అధికార బీజేపీపై ధ్వజమెత్తారు. స్యాంకి రోడ్డులో ఫ్లై ఓవర్ పనులను వ్యతిరేకిస్తూ సోమవారం నగరంలోని మల్లేశ్వరం నివాసులు చేపట్టిన ధర్నాకు మద్దతునిస్తూ ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడిగా ఉన్న చెట్లను ఫ్లై ఓవర్ కోసం తొలగించారు. స్యాంకి రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి ప్రజలను నుంచి తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ పథకం ద్వారా మల్లేశ్వరం, సదాశివనగరలో పరిసరాలు నాశనమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీసీసీ కార్యధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ... బీజేపీ చెప్పుకునేటంత ఒక్క పని కూడా చేయలేదు. ఈ పథకం ఎవరికి లాభమో అర్థం కావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దర్శకుడు భగవాన్ మృతి

యశవంతపుర: దివంగత నటుడు రాజ్‌కుమార్‌తో అధిక సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు ఎస్‌కే భగవాన్ (90) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. వయోభారంతో జయదేవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన ఇద్దరు కుమారులు, కుమార్తె, భార్య ఉన్నారు. ఆయన మృతికి సీఎం బొమ్మై, సీఎల్‌పీ నేత సిద్దు, శాండల్ వుడ్ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.



నటుడు రాజ్‌కుమార్‌తో ఎస్‌కే భగవాన్ (ఫైల్)

ఆళందలో ఓటర్ల తొలగింపునకు దరఖాస్తు

- ఎన్నికల కమిషన్‌కు ప్రియాంక్ ఖర్గే ఫిర్యాదు

శివాజీనగర: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కల్బుర్గి జిల్లాలో ఆళందలో ఓటర్ల పేర్లను ఉద్దేశ్యపూర్వకంగా తొలగిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ఆయన, చిలుమె సంస్థ ద్వారా ఓటర్ల జాబితా అక్రమం చేసిన తరువాత నేడు రాష్ట్రంలో వేర్వేరు నియోజకవర్గాల్లో వేర్వేరు విధాలుగా అక్రమాలకు సిద్ధమైందన్నారు. శాసనసభ నియోజకవర్గమైన కల్బుర్గి జిల్లా ఆళందలో ఆన్‌లైన్ ద్వారా 6,670 ఓటర్ల పేర్లను వారికి తెలియకుండానే ఓటర్ల జాబితా నుంచి రద్దు చేయాలని దరఖాస్తు చేశారని సమాచారం ఉందన్నారు.

ఫర్నిచర్ గోడౌన్ దగ్ధం

యశవంతపుర: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫర్నిచర్ గోడౌన్ పూర్తి కాలిపోయిన ఘటన కొడగు జిల్లా మడికేరిలో జరిగింది. ఆదివారం సాయంత్రం గోడౌన్ యజమాని తాళం వేసి వెళ్లారు. రాత్రి ఆకస్మికంగా మంటలు ఏర్పడి పెద్ద ఎత్తున ఫర్నిచర్ కాలిబూడిదైంది. తెల్లవారుజామున సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. అక్కడే నిద్రిస్తున్న ఇద్దరు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ఆటోకు నిప్పు

ఇంటి ముందు నిలిపిన ఆటోకు ఆకతాయిలు నిప్పు పెట్టాన ఘటన విజయపుర కాళికానగరలో ఆదివారం రాత్రి జరిగింది. కేణకా మండేగారకు చెందిన ఆటో, బైక్ కాలిపోయాయి. ఆదర్శనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

నిర్మాణ కార్మికులకు సభ్యత్వ నమోదు

హోసూరు: జిల్లా కేంద్ర క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దీపక్ జేకబ్ అధ్యక్షతన అసంఘటిత కార్మిక సంఘ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర అసంఘటిత కార్మికులు కార్మిక సంక్షేమ శాఖ సంఘంలో సభ్యులుగా చేరవచ్చునని, ఇందుకు కార్మికులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామాధికార్లు పరిశీలించి అర్హులైన వారికి గుర్తింపు కార్డులను అందజేస్తారని చెప్పారు. సభ్యులైనవారికి పెళ్లికి సహాయం, సహజ మరణ సహాయం, ప్రమాదాల్లో మరణిస్తే బీమా వసతి లభిస్తాయని తెలిపారు. క్రిష్ణగిరి జిల్లాలో ఇప్పటి వరకు 2.10 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అధికారులు జయశంకర్, పారిశ్రామిక సంఘ ప్రతినిధులు బాలక్రిష్ణన్, మోహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యాంత్రిక సేద్యంపై జాగృతి



కెలమంగలం: వ్యవసాయంలో యంత్రాలను సమర్థవంతంగా ఉపయోగించడం గురించి ఆ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఉప డైరెక్టర్ కళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆదియమ్మాన్ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు లక్ష్మణకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆధునిక పద్ధతిలో యంత్రాలను ఉపయోగించడం ద్వారా కూలీల కొరతను తగ్గించవచ్చునని, యంత్రాల పంపిణీకి ప్రభుత్వం రాయితీలు కల్పించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంయుక్త వ్యవసాయ సంఘాలకు వ్యవసాయ శాఖ ద్వారా అభివృద్ధి పథకాలతో వ్యవసాయ ఉపకరణాలందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికార్లు రామచంద్రన్, గీత తదితరులు పాల్గొని రైతులకు శిక్షణ అందజేశారు.

ఎమ్మెల్యే ముమ్మర ప్రచారం



ఈరోడ్డులో ఎమ్మెల్యే వై. ప్రకాష్ ఎన్నికల ప్రచారం

హోసూరు: ఈరోడ్డు పశ్చిమ విభాగం శాసనసభ ఎన్నికల్లో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముమ్మర ప్రచారం చేపట్టారు. అక్కడి ఎమ్మెల్యే అకాల మృతి చెందడంతో ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇళంగోవన్ బరిలో ఉన్నాడు. ఆయనకు మద్దతుగా హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ విభాగ ఆర్గనైజర్ వినోద్ తదితరులు కలిసి ఇంటింటికి ప్రచారం చేస్తున్నారు.

వృద్ధాప్య పెన్షన్ అందజేత

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో 17 మంది లబ్ధిదారులకు కలెక్టర్ దీపక్‌జేకబ్ వృద్ధాప్యపెన్షన్ అందజేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, రోడ్లవసతి, మురికి కాల్వల ఏర్పాటు, ఇళ్ల పట్టాలు, బస్సు వసతులు, వీధిదీపాల ఏర్పాటు, కుట్టు యంత్రాలు, వృద్ధాప్య పెన్షన్, ఆర్థిక సాయం కోరుతూ 319 వినతులు అందజేశారు. వినతులను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా 17 మంది వృద్ధాప్య పెన్షన్ అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళా సంఘాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన చేతివృత్తుల ప్రదర్శన, ఆహార పదార్థాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, అధికారులు వేడియప్పన్, ద్రాక్షాయిణి, తంగై, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్

చేపల వేటకెళ్లి రైతు మృతి

క్రిష్ణగిరి: రైతుబావిలో చేపలు పడుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి సమీపంలోని బెత్తనపల్లి గ్రామానికి చెందిన రైతు శరవణన్ (42) ఆదివారం సాయంత్రం అదే ప్రాంతంలోని రైతు బావిలో చేపలు పడుతూ కాలు జారి బావిలో పడ్డాడు. శరవణన్‌కు ఈతరాక నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న క్రిష్ణగిరి పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో చిరు వ్యాపారి ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన మత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...తిరుపత్తూరు జిల్లా వదనవాడి ప్రాంతానికి చెందిన పరమశివం (35) క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని క్రిష్ణాపురం ప్రాంతంలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వ్యాపారం ముగించుకొని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా నాడార్‌వట్టం వద్ద ఎదురుగా వచ్చి లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన పరమశివం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

శ్యానమావు అటవీ ప్రాంతంలో ఏనుగుల మంద

హోసూరు: హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతంలో మకాం వేసిన 60 ఏనుగుల మందలో మరో 20 ఏనుగులు వచ్చి చేరాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం బన్నేరు ఘట్ట అటవీ ప్రాంతం నుంచి వలస వచ్చిన ఏనుగులు జవళగిరి, డెంకణీకోట, అయ్యూరు, తిమ్మసంద్రం, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో మకాం వేసి రైతు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. శ్యానమావు అటవీ ప్రాంతంలో మకాం వేసిన 60 ఏనుగులను కొద్ది రోజుల క్రితం అటవీ శాఖాధికారులు డెంకణీకోట వైపు మళ్లించేదుకు చేపట్టిన ప్రయత్నం విఫలమైంది. ఈ నేపథ్యంలో 60 ఏనుగుల మంద పగటి వేళలో అటవీ ప్రాంతంలో ఉంటూ రాత్రి వేళలో రైతు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగుల మంద సంచారంపై అటవీశాఖ సిబ్బంది నిఘా పెట్టిందని, రైతులు పొలాల వద్దకు వెళ్లరాదని, పశువుల మేత కోసం అటవీ ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.



శ్యానమావు అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద

నటుడిపై దాడి

యశవంతపుర: నటుడు ప్రవీణ్‌తేజ్‌పై దిలీప్ అనే వ్యక్తి దాడి చేశారు. ఆదివారం కోణనకుంట పరిధిలోని ఒక పార్టీకి వెళ్లగా అసభ్యంగా మాట్లాడి దాడి చేసినట్లు ప్రవీణ్ కోణనకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు అద్దాలను ధ్వంసం చేశారు. దిలీప్‌పై కోణనకుంట పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు దిలీప్ ఎవరో తెలియదు, తనపై ఎందుకు దాడి చేశాడో అర్థం కావడం లేదని ప్రవీణ్ తేజ్ తెలిపారు.

బంగారం స్వాధీనం

మంగళూరు విమానాశ్రయంలో ఫిబ్రవరి ఒకటి నుంచి 15 వరకు అక్రమంగా తరలిస్తున్న 1.65 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ విలువ రూ. 91.35లు లెక్కించారు. 6 లక్షలు విలువగల విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకుని ఒక ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు.

అవినీతిరహిత రాజకీయాలు కావాలి

శివమొగ్గ: అవినీతి రహిత సమాజ నిర్మాణం, రాజకీయాల్లో మార్పు రావాలని పిలుపునిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ వినూత్నంగా ప్రచారం నిర్వహించింది. ఈ క్రమంలో శివమొగ్గలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో చెత్త ఊడ్చుతూ తమ ప్రచారాన్ని చేపట్టింది. దీనికి తోడు నగరంలోని ప్రధాన రోడ్లలో చెత్తను ఊడ్చే చీపురును ప్రదర్శిస్తూ ఊరేగింపుగా ఆప్ నేతలు సాగారు. పార్టీ నాయకురాలు నేత్రావతి నేతృత్వంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

యాసిడ్ బాధితురాలికి పరామర్శ

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకాలో సైకో ప్రేమికుడి చేతిలో యాసిడ్ దాడికి గురై తీవ్రంగా గాయపడి బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కేపీసీసీ అధ్యక్షుడు, కనకపుర ఎమ్మెల్యే డీకే శివకుమార్ సోమవారం పరామర్శించారు. సంఘటనపై ఆరా తీసారు. ఏ సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని, బాధితురాలిని కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. నిందితుడికి కఠినశిక్ష పడేలా చూడాలని పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు.

150 కిలోల గుట్కా స్వాధీనం

హోసూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి శివకాశికి అక్రమంగా తరలిస్తున్న కారుతో పాటు 150 కిలోల గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి గుట్కా తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు క్రిష్ణగిరి పట్టణ సబ్‌ఇన్స్పెక్టర్ చంద్రు, పోలీసులు ఆదివారం రాత్రి హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో వచ్చిన కారును అడ్డగించి చూడగా గుట్కా బయటపడింది. విరుదునగర్ జిల్లా శివకాశి ప్రాంతానికి చెందిన డ్రైవర్ ముత్తుక్రిష్ణన్‌ను అరెస్ట్ చేశారు.

మృతులకు శ్రద్ధాంజలి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తిరుమావళవన్

కెలమంగలం: వారం రోజుల క్రితం డెంకణీకోట సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన మృతి చెందిన వారికి విడుదల చిరుత పార్టీ నిర్వాహకుడు తిరుమావళవన్ శ్రద్ధాంజలి ఘటించారు. డెంకణీకోట తాలూకా ఇరుదుకోట గ్రామానికి చెందిన విడుదల చిరుత పార్టీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా ఉపకార్యదర్శి సెల్వం కూతుర్లు తమిళరసి (19), తమిళ్ ప్రియ (17), బంధువు కొడుకు అంబేత్‌వాళన్ (14)లు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఆ పార్టీ వ్యవస్థాపకుడు తిరుమావళవన్ సోమవారం డెంకణీకోటకు చేరుకొని బాధిత కుటుంబానికి సంతాపం తెలియజేశారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మిస్ ఇండియా పోటీలకు గ్రామీణ రైతుబిడ్డ

- మిస్ ఆంధ్రా పోటీలో విజేతగా అన్నమయ్య జిల్లా యువతి గోమతిరెడ్డి
- మార్చి 5న ముంబైలో జరిగే ఫెమీనా మిస్ ఇండియా పోటీలకు ఎంపిక



ఓబులవారిపల్లె: గ్రామీణ రైతుబిడ్డ జాతీయ స్థాయి అందాల పోటీలకు ఎంపికైంది. తన అందం, ఆత్మ విశ్వాసం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మిస్ ఆంధ్రాగా నిలిచింది. మరో రెండు వారాల్లో ముంబైలో నిర్వహించనున్న మిస్ ఇండియా పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. అన్నమయ్య జిల్లా ఓబుల వారిపల్లె మండలంలోని ముక్కావారిపల్లె గ్రామానికి చెందిన ముక్కా శ్రీనివాసులరెడ్డి, అరుణ కుమారి దంపతుల ఏకైక కుమార్తె ముక్కా గోమతి రెడ్డి మార్చి 5వ తేదీన ముంబైలో నిర్వహించనున్న ఫెమీనా మిస్ ఇండియా పోటీలకు ఎంపికై ంది. గోమతిరెడ్డి చిన్ననాటి నుంచి పాఠశాలల్లో బెస్ట్ బేబి తదితర పోటీల్లో రాణిస్తూ వచ్చింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను అందాల పోటీల్లో పాల్గొనేందుకు అన్ని విధాల సహకారం అందించారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అందాల పోటీల్లో గెలుపొందింది. అనంతరం బెంగళూరులో నిర్వహించిన సౌత్ ఇండియా మిస్ ఫెమీనా పోటీల్లో పాల్గొని రన్నరప్‌గా నిలిచింది. అక్కడితో ఆగిపోకుండా మోడలింగ్ రంగంలోకి కూడా ప్రవేశించింది. ఈ ఏడాది జనవరి, 25వ తేదీన ముంబైలో నిర్వహించిన ఫెమీనా మిస్ ఆంధ్రా పోటీల్లో పాల్గొని టైటిల్ కైవసం చేసుకుంది. దీంతో మిస్ ఇండియా పోటీలకు రాష్ట్రం తరఫున ఎంపికైంది. ప్రస్తుతం బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం చేస్తున్న గోమతిరెడ్డి... మిస్ వరల్డ్ సాధించడమే తన లక్ష్యమని తెలిపింది. తల్లిదండ్రుల సహకారంతో ఏదైనా సాధించవచ్చనే లక్ష్యంతో ముందుకువెళుతున్నానని, తన గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పింది.

క్లుప్తంగా...

పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాల పంపిణీ మంచి పరిణామం


- కేంద్ర గ్రామీణ గృహ నిర్మాణ డైరెక్టర్ శైలేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న శైలేష్‌కుమార్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని పేదలకు పక్కా గృహాల కల్పనలో భాగంగా ప్రభుత్వమే పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం మంచి పరిణామమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖలోని గ్రామీణ గృహ నిర్మాణ డైరెక్టర్(రూరల్ హౌసింగ్) శైలేష్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం అమలు పట్ల శైలేష్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్(పీఎంఏవై–గ్రామీణ్) పురోగతిని పరిశీలించడంలో భాగంగా సోమవారం రాష్ట్రానికి వచ్చిన శైలేష్‌కుమార్ విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు, ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక, సబ్సిడీపై నిర్మాణ సామగ్రి, పావలా వడ్డీకి రూ.35 వేలు సాయం వంటి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. పీఎంఏవై–గ్రామీణ్ కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పథకం అమల్లో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా చెప్పడంతో సచివాలయాల వ్యవస్థ గురించి శైలేష్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. జేఎండీ ఎం.శివప్రసాద్, చీఫ్ ఇంజినీర్ జీవీ ప్రసాద్, ఎస్ఈలు జయరామాచారి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హమాలీ చార్జీలపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: రేషన్ షాపుల వద్ద సరుకులు దించినందుకు గాను డీలర్ల నుంచి హమాలీలు ఎలాంటి చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. రేషన్ షాపుల వద్ద సరుకు దించినా.. ఎత్తినా హమాలీలు ఎలాంటి చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదంటూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ 2019లో జారీ చేసిన సర్క్యులర్ అమల్లోనే ఉందని గుర్తు చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు హమాలీలు ఎలాంటి చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. చౌక ధరల దుకాణ దారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.



రాష్ట్రంలో ఎన్నికలకు మరో 14 నెలలు మాత్రమే సమయం ఉంది. ఈ పరిస్థితిలో ఎన్నికల బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే అన్ని రకాలుగా సన్నద్ధమవుతూ బిజిబిజీగా ఉండాలి. టీడీపీలో ఎక్కడా ఆ వాతావరణం కన్పించడం లేదు. చాలా నియోజకవర్గాల్లో నేతలు పోటీకి విముఖత చూపుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈసారి కూడా టీడీపీకి అధికారం దక్కదని ఆయా ప్రాంతాల్లో వారు చేయించిన సర్వేల్లో స్పష్టం కావడమే ఇందుకు కారణం.

రాయలసీమలో పార్టీ కంటే వర్గాలు తీవ్రంగా ప్రభావం చూపిస్తాయి. గెలిచినా, ఓడిపోయినా తమ వర్గాన్ని కాపాడుకునేందుకు ఏదో ఒక పార్టీ నుంచి బరిలో నిలవాలనుకుంటారు. అలాంటి ఈ ప్రాంతంలో సైతం పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదంటే టీడీపీ పరిస్థితి ఎంత తీసికట్టుగా మారిందో స్పష్టమవుతోంది. అందుకే చాలా మంది నేతలు ప్రత్యామ్నాయం చూసుకున్నారు. ఏదారీ లేని వారు.. అంటే ఎక్కడా గెలవలేమనుకునే వారు మాత్రమే.. అన్ని ఖర్చులు పార్టీ భరిస్తేనే పోటీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబుకు అల్టిమేటం జారీచేస్తున్నారు.

మేమేం చేసేది..?



'రానున్న ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేయడానికి ఎందుకు వెనకాడుతున్నారు?' అని ఓ మాజీ ఎమ్మెల్యేను ఆయన ముఖ్య అనుచరుడు ప్రశ్నిస్తే.. 'ఇటీవల రోజుకు 10 మంది చొప్పున పది రోజులపాటు 100 మందితో ఫోన్లో, ప్రత్యక్షంగా మాట్లాడాను. వారిలో 94 మంది జగన్ ప్రభుత్వం వల్ల తమకు మేలు జరిగిందని చెప్పారు. ఇంత కచ్చితంగా వారు ఆ మాట చెప్పినప్పుడు వారంతా నా వెంటే నడుస్తారన్న గ్యారంటీ ఏముంది? ఏం చూసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలి? పరిస్థితి ఇలా ఉంటే మేమేం చేసేది?' అని ఎదురు ప్రశ్న వేశారట. ప్రజల నాడి ఇలా ఉన్నందుకే టీడీపీ నేతలు పోటీ చేయడానికి విముఖత చూపుతున్నారు.

టికెట్టా.. వద్దే వద్దు!

గ్రేటర్ రాయలసీమలో నానాటికీ తీసికట్టుగా టీడీపీ పరిస్థితి

అంతఃకలహాలు, వర్గ విభేదాలతో పార్టీ శ్రేణులు బలహీనం

- గత ఎన్నికల్లో 74 అసెంబ్లీ స్థానాల్లో 67 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపు
- టీడీపీకి కేవలం 7 స్థానాలే.. అందులో ఒకరు ఆ పార్టీకి దూరం
- ప్రభుత్వ పని తీరు, ప్రస్తుత పరిస్థితిపై టీడీపీ నేతల ఇంటర్నల్ సర్వేలు
- టీడీపీ అధికారంలోకి వచ్చే అవకాశాలే లేవని సుస్పష్టం
- అందుకే పోటీ చేసేందుకు విముఖత..
- పూర్తిగా ఖర్చులు పార్టీ భరిస్తేనే పోటీ చేస్తామని పలు చోట్ల అల్టిమేటం
- రియల్టర్లు, వ్యాపారవేత్తలు, ఎన్ఆర్ఐల కోసం చంద్రబాబు వేట

సాక్షి, ఏపీ నెట్‌వర్క్

గ్రేటర్ రాయలసీమలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోడుమూరు, నందికొట్కూరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో 2019లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పీఆర్ అండ్ ఆర్డీ మాజీ కమిషనర్ రామాంజనేయులు, జయరాజ్ పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పత్తా లేరు. అక్కడి నుంచి ఈసారి పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా టీడీపీకి దొరకలేదు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన బొల్లినేని రామారావు 2019లో ఓడిపోయారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ససేమిరా అంటున్నారు. 'ఎటూ గెలవలేం.. పైగా టీడీపీ అధికారంలోకి వచ్చే పరిస్థితే లేదు.. ఇలాంటప్పుడు ఎంత ఖర్చు చేసినా ఏం లాభం?' అని పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో వ్యాపారవేత్త కావ్య కృష్ణారెడ్డి, ఎన్ఆర్ఐ కాకర్ల సురేశ్‌లను బరిలోకి దింపేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. కందుకూరులో 2019 ఎన్నికల్లో ఓడిపోయిన పోతుల రామారావు పార్టీకి దూరంగా ఉన్నారు. దీంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావును ఇన్‌చార్జ్‌గా నియమించారు. పోతుల రామారావు కూడా రియల్టరే. మధ్యలో నాగేశ్వరరావు హ్యాండిస్తే మరో రియల్టర్ రాజేశ్‌కు టికెట్ ఇవ్వాలని ఆప్షన్‌గా పెట్టుకున్నారు. మచ్చుకు ఈ మూడు ఉదాహరణలు పరిశీలిస్తే 'గ్రేటర్ రాయలసీమ'లో టీడీపీ పరిస్థితి ఏంటో, ఆ పార్టీ నేతల మనుసులో ఎలాంటి భావన ఉందో స్పష్టమవుతోంది.

ప్రత్యామ్నాయం వైపు పార్టీ శ్రేణులు

గ్రేటర్ రాయలసీమలో 74 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో 67 మంది వైఎస్సార్‌సీపీ, ఏడుగురు మాత్రమే టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ ఏడుగురిలో నలుగురు ప్రకాశం జిల్లాలో, మిగిలిన ఐదు ఉమ్మడి జిల్లాల్లో ముగ్గురు (కుప్పంలో చంద్రబాబు, హిందూపురంలో బాలకృష్ణ, ఉరవకొండలో పయ్యావుల కేశవ్) గెలిచారు. ప్రకాశం జిల్లాలోని నలుగురిలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం ఆ పార్టీని వీడారు. ఎన్నికల తర్వాత సింహభాగం నియోజకవర్గాల్లో ఇప్పటికీ టీడీపీ నేతలు ప్రజలకు కన్పించడం లేదు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో అత్యధికులు ప్రత్యామ్నాయాలు చూసుకున్నారు. ఎక్కువ మంది సీఎం వైఎస్ జగన్ పథకాలు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 సీట్లలో గత 20 ఏళ్లలో టీడీపీ నేతలు అత్యధికంగా గెలిచిన అసెంబ్లీ సీట్లు కేవలం నాలుగే. 2004లో 3, 2009లో 4, 2014లో 3, 2019లో సున్నా. ఈ గణాంకాలు చూస్తే ఇక్కడ టీడీపీ పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దీంతో పోటీ చేసేందుకు అభ్యర్థులు జంకుతున్నారు. కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా టీజీ భరత్ ఉన్నారు. ఇతని తండ్రి టీజీ వెంకటేశ్ బీజేపీ నేత. ఒకే ఇంట్లో ఉంటూ, రెండు పడవల మీద ప్రయాణం చేస్తున్న వీరు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. దీంతో భరత్‌కు టికెట్ ఇచ్చినా ఓడిపోతారని తెలిసి, మైనార్టీ కోటాలో అహ్మదుల్లాఖాన్‌కు టికెట్ ఇవ్వాలని భావించారు. డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ఖాన్, ఆ తర్వాత సర్వేలు చేయించుకుని టీడీపీ తరఫున బరిలో నిలిస్తే ఓటమి తప్పదని తేలడంతో పార్టీలో చేరకుండా మొహం చాటేశారు. డోన్ అభ్యర్థిగా కేఈ కుటుంబాన్ని కాదని ధర్మవరం సుబ్బారెడ్డిని అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. అయితే కేఈ

ఇప్పుడు కూడా వార్ వన్‌సైడే!

ప్రభాకర్ మాత్రం డోన్‌లో తమ కుటుంబం పోటీలో ఉంటుందని, అన్ని రకాలుగా తాము సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని మరవొద్దని నేరుగా చంద్రబాబును ఉద్దేశించి స్పష్టం చేశారు. అంటే తమకు టికెట్ ఇవ్వకపోతే మరో పార్టీలోనో, స్వతంత్ర అభ్యర్థిగానో బరిలోకి దిగి.. టీడీపీని ఓడిస్తామనే భావన స్పష్టమవుతోంది. ఆదోనిలో మీనాక్షి నాయుడు పోటీకి అయిష్టంగా ఉన్నారు. దీంతో బీసీ వర్గానికి చెందిన ఎన్ఆర్ఐ, రియల్టర్ కోసం టీడీపీ అన్వేషిస్తోంది. ఆళ్లగడ్డలో భూమా అఖిల ప్రియ కేసులు, ఇతర వ్యవహారాల్లో తరచూ వివాదాల్లో ఉన్నారు. అక్కడ ఆమె ఏ లెక్కనా గెలిచే పరిస్థితే లేనందున, భూమా కిషోర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని టీడీపీ యోచిస్తోంది. నంద్యాలలో అఖిలకు, ఆమె సోదరుడు భూమా బ్రహ్మానందరెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. చివరకు గత నెల భూమా జయంతిని కూడా వేర్వేరుగా జరిపారు.

ఇన్‌చార్జ్‌ల కోసం వెంపర్లాట

- నెల్లూరు జిల్లాలో గత ఎన్నికల్లో 10 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో ఇక్కడ టీడీపీ అభ్యర్థులు పోటీ అంటేనే జంకుతున్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా 2019 ఎన్నికల్లో ఓడిపోయిన కృష్ణయ్య వ్యాపారాల్లో నిమగ్నమయ్యారు. కావలిలో కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డి పార్టీకి దూరంగా ఉన్నారు. సర్వేపల్లిలో మూడు పర్యాయాలు ఓడిపోయిన సోమిరెడ్డి మళ్లీ ఓటమి తప్పదని.. నెల్లూరు రూరల్ ఆశిస్తున్నారు.
- తిరుపతి నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఖర్చులు పార్టీ భరించాలని కండిషన్ పెట్టింది. చంద్రగిరిలో ఇందు శేఖర్‌ను కాదని పులివర్తి నానికి టికెట్ ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. అయితే చంద్రగిరిలో చెవిరెడ్డిని ఎదుర్కోవడం అంత సులువు కాదని నాని చిత్తూరు టికెట్ ఆశిస్తున్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి ఖర్చు భరించలేనంటున్నారు.
- పుంగనూరులో పోటీ చేసేందుకు అభ్యర్థే లేరు. ఖర్చు పార్టీ చూసుకుంటే పోటీ చేస్తానని చల్లా రామచంద్రారెడ్డి తేల్చి చెప్పాడు. పూతలపట్టులో అభ్యర్థే దొరకని పరిస్థితి. ఖర్చు పార్టీ భరించాలని వెంకటగిరిలో కురగొండల రామకృష్ణ తేల్చి చెప్పారు. నగరిలో గాలి ముద్దు కృష్ణమనాయుడు కుమారుడు గాలి భానుప్రకాశ్ కూడా ఇదే విషయం చెప్పాడు. దీంతో సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ అశోక్‌రాజ్‌కు టికెట్ ఇవ్వాలన్న యోచనలో టీడీపీ ఉంది.
- ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిరలో ఎన్నికల ఖర్చులు పూర్తిగా భరిస్తేనే పోటీ చేస్తానని ఇన్‌చార్జ్ ఈరన్న చెబుతున్నారు. పెనుకొండలో పార్థసారథి, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు, గుంతకల్లులో జితేంద్రగౌడ్‌తో పాటు చాలా చోట్ల నాయకుల మాట ఇదే! దీంతో బీజేపీ నేత సూరికి ధర్మవరం టికెట్ ఇస్తే.. మరో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ఖర్చు భరించాలని చెప్పినట్లు సమాచారం. పార్టీ గెలిచే అవకాశాలు లేనందున ఇంత ఖర్చు చేయాలా? వద్దా? అనే ఆలోచనలో సూరి ఉన్నారు.
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో టీడీపీకి ఎప్పుడూ గడ్డుకాలమే. ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, కడప, జమ్మలమడుగుతో పాటు చాలా నియోజకవర్గాల్లోని అభ్యర్థులు అన్ని ఖర్చులు పార్టీ భరిస్తేనే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఆర్థికంగా లబ్ధి పొంది, తర్వాత బీజేపీలోకి వెళ్లిన సీఎం రమేశ్‌ను తిరిగి రప్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. మొత్తంగా ఈ పరిస్థితిలో చాలా నియోజకవర్గాల్లో పూర్తి స్థాయి ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు బాబు తల పట్టుకుంటున్నారు.

మూడేళ్లు.. ముగ్గురు ఇన్‌చార్జ్‌లు

ప్రకాశం జిల్లా దర్శి టీడీపీ ఇన్‌చార్జిగా 2019 ఎన్నికల వరకు శిద్దా రాఘవరావు ఉన్నారు. ఆయన ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల సమయంలో దర్శి ఇన్‌చార్జిగా వచ్చిన కదిరి బాబూరావు.. 2019లో పోటీ చేసి ఓడిపోయాక వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వచ్చిన పమిడి రమేశ్‌బాబు కూడా గతేడాది జూలైలో 'సైకిల్' దిగేశాడు. దీంతో ఇక్కడ ఎవరిని ఇన్‌చార్జ్‌గా నియమించాలో తెలియని పరిస్థితి. కనిగిరి టీడీపీ ఇన్‌చార్జ్ ఉగ్రనరసింహారెడ్డిని అక్కడి నేతలు పోకానాయుడు, హుస్సేన్‌యాదవ్, గంగరాజు, మాల్యాద్రి వ్యతిరేకిస్తున్నారు. మార్కాపురంలో టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి ఉన్నారు. ఇక్కడ కీలక నేతలుగా ఉన్న డీవీ కృష్ణారెడ్డి, షేక్షావలి, మక్బుల్‌బాషా, బీఎల్‌పీ యాదవ్ ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పొదిలికి చెందిన శ్రావణి వెంకటేశ్వర్లు, జి.భాస్కర్ పార్టీకి దూరంగా ఉన్నారు.

గన్నవరం రణరంగం



గన్నవరంలో పోలీసులతో టీడీపీ నేతల వాగ్వాదం



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- ఎమ్మెల్యే వంశీపై అసభ్య పదజాలంతో విరుచుకుపడిన టీడీపీ నేతలు
- అది సరికాదంటూ నిరసన తెలపడానికి వెళ్లిన వంశీ అభిమానులు
- టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టాభి వీరంగం
- కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడి
- గన్నవరం టౌన్ సీఐ కనకారావు తలకు తీవ్ర గాయం



టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన సీఐ కనకారావు

సాక్షి ప్రతినిధి, విజయవాడ / గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీమోహన్‌ను లక్ష్యంగా చేసుకుని మూడు రోజులుగా టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభితో పాటు ఆ పార్టీ నియోజకవర్గ నేతలు పక్కా వ్యూహంతో చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు తీవ్ర దుమారానికి దారి తీశాయి. టీడీపీ నేతల వైఖరికి నిరసనగా ఆ పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన వంశీ అభిమానులు, అనుచరులపై టీడీపీ నేతలు దాడికి దిగారు. దీంతో వారు ఆత్మరక్షణ కోసం ప్రతిఘటించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొద్ది రోజులుగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై పట్టాభి పలు అసత్య ఆరోపణలు, తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీంతో పట్టాభిపై స్థానిక కోర్టులో ఎమ్మెల్యే వంశీ పరువు నష్టం దావా వేశారు. దీంతో మూడు రోజులుగా ఎమ్మెల్యేను టార్గెట్‌గా చేసుకుని పట్టాభితో పాటు స్థానిక టీడీపీ నేతలు మీడియా సమావేశాల్లో విమర్శలను, ఆరోపణలను తీవ్రతరం చేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ పథకం ప్రకారం సోమవారం గన్నవరం వచ్చిన పట్టాభి.. మరోసారి ఎమ్మెల్యేను తిడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. అప్పటికే ఎమ్మెల్యే కార్యాలయం వద్ద విలేకరుల సమావేశానికి, వివిధ పనుల నిమిత్తం వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు.. టీడీపీ నేతల వ్యాఖ్యలపై నిరసన తెలుపుతూ ర్యాలీగా ఆ పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లారు. వీరిపై టీడీపీ నేతలు రాళ్లు విసురుతూ.. జెండా కర్రలతో దాడికి దిగడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాల నేతలను నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో టీడీపీ నేత విసిరిన రాయి తగలడంతో సీఐ పి.కనకారావు తలకు బలమైన గాయమైంది. వెంటనే పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఏడు కుట్లు వేశారు. డీఎస్పీ కె.విజయపాల్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పోలీస్ బలగాలను ఆక్కడ మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నా పని నేను చేసుకుంటున్నా..

గన్నవరం నియోజకవర్గంలో గడపగడపకు తిరుగుతూ నా పని నేను చేసుకుంటున్నా. టీడీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. సంకల్పసిద్ధి మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు సంబంధించి ఆధారాలు లేకుండా నాపై అత్యంత దారుణంగా అసత్యాలు ప్రచారం చేశారు. అయినప్పటికీ నేను ఎంతో సంయమనంతో వ్యవహరించాను. ప్రత్యక్ష గొడవల జోలికి పోకుండా న్యాయం కోసం వారిపై కోర్టులో కేసు వేశాను. కొంత మంది కిరాయి జీతగాళ్లు వారి జీతం పెంచుకోవడం కోసం.. ఏరా.. ఒరేయ్.. బోసిడికే.. అంటూ ఇక్కడికొచ్చి నన్ను అతి దారుణంగా తిడుతుంటే నన్ను అభిమానించే వారికి బాధేసింది. అందుకు నిరసన తెలుపుదామని వెళ్లిన వారిపై దాడికి పాల్పడ్డారు. బయట నుంచి టీడీపీ నాయకులు వచ్చి గన్నవరం ప్రజలను రెచ్చగొట్టడం ఎంత వరకు సబబు? ఇక్కడ టీడీపీ నాయకులు లేరా?

– మీడియాతో వల్లభనేని వంశీమోహన్, గన్నవరం ఎమ్మెల్యే

పట్టాభి రెచ్చగొట్టడం వల్లే..

టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి గన్నవరంలో ఓ గుంపును వెనకేసుకుని తిరుగుతూ వారిని రెచ్చగొట్టడం వల్లే ఘర్షణకు కారణమైందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులపై ఉద్దేశ పూర్వక దాడికి దిగడం ద్వారా వారిని నియంత్రించి, వంశీ వర్గీయులపై తీవ్ర దాడికి కుట్ర పన్నారని తెలిపారు. గన్నవరానికి చెందిన వారు కాకుండా, బయటి నుంచి ఇతరులను రప్పించి దాడికి పాల్పడ్డారని స్పష్టమవుతోంది. టీడీపీ కార్యాలయంలో పెనమలూరు మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వంద మందితో గుంపుగా మోహరించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడమే ఇందుకు నిదర్శనం.

మెడ్‌టెక్ జోన్‌లో కృత్రిమ అవయవాల తయారీ

- ఇందుకోసం 30 రోజుల్లోనే ఏటీసీ సెంటర్ నిర్మాణం
- తాజాగా బీజీఎంఎస్ పరికరాల తయారీ



బీజీఎంఎస్ పరికరాల్ని పరిశీలిస్తున్న ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్

సాక్షి, విశాఖపట్నం : భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) కృత్రిమ అవయవాల తయారీపై దృష్టిసారించింది. ఇందుకోసం పలు ప్రాంతాల్లో అసిస్టివ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటు చేసిన ఐసీఎంఆర్.. తాజాగా విశాఖలోనూ ప్రారంభించింది. ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోగా.. కేవలం 30 రోజుల వ్యవధిలోనే నిర్మించడం విశేషం. మరోవైపు, వైద్య ఉపకరణాలకు వేదికగా నిలుస్తూ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్‌లో మరో తయారీ సంస్థ తన కార్యకలాపాలు ప్రారంభించింది. చక్కెర స్థాయిల్ని తెలిపే బీజీఎంఎస్ పరికరాల తయారీ ప్రాజెక్టుకు యాక్యూరెక్స్ సంస్థ శ్రీకారం చుట్టింది. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో వైద్య పరికరాల తయారీ క్రమక్రమంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం మెడ్‌టెక్ జోన్‌లో 100కి పైగా సంస్థలు వైద్య పరికరాల ఉత్పత్తి, పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. తాజాగా యాక్యురెక్స్ సంస్థ కూడా తమ పరికరాల తయారీ కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించింది. బ్లడ్ గ్లూకోజ్ మోనిటరింగ్ సిస్టమ్(బీజీఎంఎస్) పరికరాల్ని మెడ్‌టెక్‌జోన్‌లో ఇక నుంచి తయారు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించిన పరిశ్రమని ఇటీవల ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డా.రాజీవ్‌భాల్, ఏఎంటీజెడ్ సీఈవో, ఎండీ డా.జితేంద్రశర్మ ప్రారంభించారు. దేశంలో మొట్టమొదటి యూరిన్ స్ట్రిప్స్ తయారీ సంస్థగా రికార్డు సృష్టించామని, భవిష్యత్తులో మరిన్ని నూతన పరికరాల్ని తయారు చేసేందుకు విశాఖ కేంద్రంగా అడుగులు వేస్తున్నామని యాక్యురెక్స్ ఎండీ అభినవ్ ఠాకూర్ తెలిపారు.

తెలంగాణ

తారకరత్నకు కన్నీటి వీడ్కోలు

రాయదుర్గంలోని మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు



తారకరత్న భౌతికదేహం వద్ద రోదిస్తున్న తండ్రి మోహనకృష్ణ. పక్కన బాలకృష్ణ, విజయసాయిరెడ్డి తదితరులు

రాయదుర్గం/బంజారాహిల్స్(హైదరాబాద్): సినీనటుడు నందమూరి తారకరత్నకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో అంత్యక్రియలను సోమవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అంతకుముందు ఫిలింఛాంబర్ నుంచి మహాప్రస్థానం వరకు ప్రత్యేక వాహనంలో తారకరత్న భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు, సినీప్రముఖులు, రాజకీయ నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. మహాప్రస్థానానికి చేరుకున్న తర్వాత పాడెపైకి తారకరత్న పార్థివదేహాన్ని చేర్చగానే సినీ హీరో బాలకృష్ణ, ఆయన సోదరుడు రామకృష్ణతోపాటు బంధువులు, సన్నిహితులు మోసుకుంటూ చితి వద్దకు తీసుకొచ్చారు. చితికి తండ్రి మోహనకృష్ణ నిప్పు అంటించారు. ఈ సమయంలో తారకరత్న అమర్‌రహే నినాదాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నారా లోకేష్, మాగంటి బాబు, జవహర్, నారాయణ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు నందమూరి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఫిలించాంబర్‌లో నివాళులు

తొలుత అభిమానులు, ప్రముఖుల సందర్శనార్థం ఉదయం 9 గంటలకు తారకరత్న భౌతికకాయాన్ని ఫిలిం చాంబర్‌కు తీసుకొచ్చి సాయంత్రం 3 గంటల వరకు ఇక్కడే ఉంచారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, యర్రబెల్లి దయాకర్‌రావు, సినీనటులు దగ్గుబాటి వెంకటేష్, తరుణ్, అశోక్ కుమార్, శివాజీ, కేంద్రమాజీ మంత్రి పురందరేశ్వరి, కేఏ పాల్ తదితరులు తారకరత్న భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. పెద్దసంఖ్యలో అభిమానులు తరలివచ్చారు.

తెలంగాణ

సంధ్య కన్వెన్షన్ ఎండీ అరెస్టు

ట్రాన్సిట్ వారెంట్‌పై తరలించిన ఢిల్లీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్/రాజేంద్రనగర్: సంధ్య కన్వెన్షన్ మేనేజింగ్ డైరెక్టర్, రియల్టర్ సరనాల శ్రీధర్‌ను సోమవారం ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ సమీప బంధువు, ఢిల్లీకి చెందిన వ్యాపారి అవనీష్ చంద్ర ఝా, అనిల్ నందలను మోసం చేసిన కేసులో అక్కడి పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఆయనను రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఢిల్లీ తరలించారు. రెండేళ్లుగా శ్రీధర్‌రావుపై కొందరు బాధితులు ఫిర్యాదులు చేయడం, కేసులు నమోదు కావడంతో అరెస్టు కూడా అయ్యారు. కొన్ని కేసుల్లో బెయిల్ సైతం పొందారు. ఢిల్లీకి చెందిన జేపీఎల్ సంస్థ నిర్వాహకులు అవనీష్, అనిల్‌లతో శ్రీధర్ రూ.250 కోట్ల లావాదేవీలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన తమను మోసం చేశారంటూ బాధితులు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కు గతేడాది డిసెంబర్ 24న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు ఈ ఏడాది జనవరి 12న శ్రీధర్‌కు నోటీసులు జారీ చేశారు. ఆదివారం నగరానికి వచ్చిన ప్రత్యేక బృందం శ్రీధర్‌ను సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం వద్ద అరెస్టు చేసింది. వైద్య పరీక్షల అనంతరం రాజేంద్రనగర్‌లోని కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఢిల్లీ తరలించారు. కోర్టు వద్ద శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ తనపై వచ్చినవి నిరాధార ఆరోపణలని, తాను ఎవరినీ మోసం చేయలేదని అన్నారు. లావాదేవీలకు సంబంధించిన అన్ని పత్రాలు కోర్టుకు అందిస్తానని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
మంగళవారం ॥ 21-2-2023



వేతన వివక్ష

జెండర్ ఈక్వాలిటీ కోసం సమాజంలో దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద ఉద్యమం సాగుతూనే ఉంది. కానీ మహిళ అయిన కారణంగా వేతనంలో వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. వేతనంలో అసమానతలకు బీజాలు అడుగడుగునా పడుతూనే ఉన్నాయి. ఈ విషయంలో పాశ్చాత్య దేశాల పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని, మనదేశంలో సమానత సాధనలో అంతరం పెరుగుతోందని, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) నివేదికను ఉదహరించారు సామాజిక కార్యకర్త మమతా రఘువీర్. ఆమె తన అధ్యయన వివరాలను సాక్షితో పంచుకున్నారు.

ఐటీలోనూ ఉంది!

"చదువులో సమానత్వసాధనలో లక్ష్యానికి దగ్గరకు వస్తున్నట్లే చెప్పాలి. కానీ ఉద్యోగాల దగ్గరకు వచ్చేటప్పటికి సమానత్వం చాలాదూరంలోనే ఉంది. అలాగే ఉద్యోగంలో వేతనాలు కూడా. ఐఎల్‌వో గ్లోబల్ రిపోర్ట్ 2020–21లో విడుదల చేసిన నివేదిక అతిపెద్ద ఆశనిపాతం. 1993–94లో మగవాళ్లకు ఆడవాళ్లకు మధ్య వేతన దూరం 48 శాతం ఉండేది. 2018–19 నాటికి ఆ దూరం తగ్గి 28 శాతానికి చేరింది. అయితే కరోనా కుదుపుతో మహిళల వేతనాల తగ్గుదల ఏడు శాతం పెరిగింది. ఇప్పుడు మగవాళ్లకు మహిళలకు మధ్య వేతన అసమానత 35 శాతం. వ్యవసాయరంగం, భవన నిర్మాణరంగం వంటి అవ్యవస్థీకృత రంగాల్లోనే ఈ అసమానత అనుకుంటాం. కానీ ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో కూడా తేడా ఉంటోందని లింక్‌డ్ ఇన్ చేసిన సర్వేలో వెల్లడైంది. వేతనంలో కనిపిస్తున్న జెండర్ గ్యాప్, జెండర్ డిస్క్రిమినేషన్‌తోపాటు హెరాస్‌మెంట్‌ను కూడా ప్రస్తావించింది లింక్‌డ్ ఇన్.

మెటర్నిటీ లీవులేవీ!

వేతనంలో జెండర్ డిస్క్రిమినేషన్‌కు గురి కానిది ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే. కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులు ఈ వివక్షకు గురవుతూనే ఉన్నారు. మరో విషయం ఏమిటంటే. ఒకేసారి ఉద్యోగంలో చేరిన మగవాళ్లకు ఆడవాళ్లకు మధ్య ఏళ్లు గడిచేకొద్దీ వేతనంలో తేడా పెరుగుతూనే ఉంటోంది. ఇందుకు కారణం కుటుంబ బాధ్యతలు, తల్లి అయినప్పుడు తీసుకునే విరామం. చాలా కంపెనీలు మహిళలకు వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు ఇవ్వడం లేదు. గర్భిణి అనగానే ఏదో ఓ కారణంతో ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు ఒకవేళ సెలవు ఇచ్చినా వేతనం ఇవ్వని కంపెనీలు కొల్లలు. ఇక కాంట్రాక్టు ఉద్యోగంలో ఉన్న మహిళలకు జరిగే అన్యాయం మీద దృష్టి పెట్టే సమయం ప్రభుత్వాలకు ఉండడం లేదు.

ఏడేళ్లే ఉంది!

యూఎన్‌ఓ సూచించిన లక్ష్యాల్లో 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్ నంబర్ 8' ఒకటి. దీని ప్రకారం 2030 నాటికి సమాన వేతన సాధన అనే లక్ష్యాన్ని సాధించాలి. ఆ గడువు ముగియడానికి ఏడేళ్లే ఉంది. లక్ష్య సాధనలో మనం మరింత దూరం జరుగుతున్నాం తప్ప దగ్గరకు చేరడం లేదు. నాకు తెలిసిన ఐఐటీ, ఐఐఎమ్‌లో చదివిన మహిళలు కూడా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వరకు వెళ్ల గలుగుతున్నారు. ఆ తర్వాత స్థానాలకు వెళ్లడం లేదు, వెళ్లడం లేదు అనేకంటే వెళ్లనివ్వడం లేదు అనడమే కరెక్ట్. సంఖ్యాపరంగా మహిళా ఉద్యోగులు దాదాపు సమానంగా ఉన్న కంపెనీల్లో కూడా ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థానాల్లో మహిళలను చూడలేం. ఆశావహంగా అనిపించే విషయం ఏమిటంటే... మునుపటి తరం కంటే ఈ తరం అమ్మాయిలు గట్టిగా నిలబడ గలుగుతున్నారు. రాబోయే తరం ఇంకా గట్టి మనో నిబ్బరంతో ముందడుగు వేస్తారని నా ఆకాంక్ష" అన్నారామె.

– వాకా మంజులారెడ్డి



అవకాశాల్లోనే హంసపాదు



పబ్లిక్ సెక్టార్‌లోనూ, ప్రభుత్వ రంగంలోనూ అనేక ఆఫీసుల్లో వర్క్‌ప్లేస్ హెరాస్‌మెంట్ కమిటీల్లో మెంబర్‌గా ఉన్నాను. మగ అధికారులు ఉద్యోగినులతో 'నీకు ఇవన్నీ రావు, పక్కన ఉండు' అంటారని తెలిసింది. ఐటీ రంగంలో అయితే కంపెనీ ప్రతినిధిగా బయటి నగరాలకు, విదేశాలకు వెళ్లి ప్రాజెక్టు నిర్వహించే అవకాశాలు మహిళలకు కాకుండా జూనియర్ అయిన మగవాళ్లకు దక్కుతున్న సందర్భాలే ఎక్కువ. చాలెంజింగ్ ప్రాజెక్టుల్లో తమను తాము నిరూపించుకునే అవకాశాల దగ్గరే వెనక్కు లాగుతుంటే... 'ఒకే సీనియారిటీ – ఒకే వేతనం' అనే సమానత్వం ఎక్కడ నుంచి వస్తుంది?

– మమతారఘువీర్ ఆచంట,
ఫౌండర్, తరుణి స్వచ్ఛంద సంస్థ,
టెక్నికల్ డైరెక్టర్, భరోసా, తెలంగాణ

న్యూస్‌మేకర్

ఇలాంటి కూతురు ఉండాలి!

'ఈ అమ్మాయిని చూస్తే చాలా సంతోషంగా ఉంది. ప్రతి తల్లిదండ్రులకు ఇలాంటి కూతురు ఉండాలి' అని సాక్షాత్తు కేరళ హైకోర్టు 17 ఏళ్ల దేవనంద గురించి అంది. ఎందుకో చదవండి!

కేరళలోని త్రిసూర్‌లో కాఫీ హోటల్ నడుపుకునే 48 ఏళ్ల ప్రతీష్‌కు నిన్న మొన్నటి దాకా జీవితం సాఫీగానే సాగింది. భార్య ధన్య, కూతురు దేవనంద, కొడుకు ఆదినాథ్... అందరిలాంటి ఒక మామూలు మధ్యతరగతి కుటుంబం. అయితే ఈ మధ్య కాలు వాపు తరచూ కనిపిస్తుండేసరికి డాక్టర్ దగ్గరకు వెళ్లాడు. పరీక్షలు చేశాక డాక్టర్లు పిడుగులాంటి వార్త చెప్పారు– లివర్ కేన్సర్. వైద్యం అంటూ లేదు... లివర్ ట్రాన్స్‌ప్లాంటేషనే శరణ్యం అని తేల్చి చెప్పారు. అది కూడా వెంటనే జరగాలని చెప్పారు.

ఆ మధ్యతరగతి కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. కొచ్చిలోని రాజగిరి హాస్పిటల్ వారు మీరు డోనర్‌ని తెస్తే మేము ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాం అని భరోసా ఇచ్చారు. కాని లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు డోనర్ దొరకడం అంత సులభం కాదు. దొరికినా సూట్ కావాలి. సమయం లేదు...



తండ్రికే తల్లి అయిన కూతురు దేవనంద

మరి ఏం చెయ్యాలి? నేనే ఎందుకు ఇవ్వకూడదు అనుకుంది కూతురు. ఇంటర్ సెకండియర్ చదువుతున్న దేవనంద తండ్రిని కోల్పోవడానికి సిద్ధంగా లేదు.

మరో ఆలోచన చేయకుండా ఆస్పత్రి వర్గాల దగ్గరకు పోయి తనే లివర్‌లోని కొంత భాగం డొనేట్ చేయవచ్చా అని అడిగింది. చేయచ్చు గాని 'ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్ యాక్ట్ 1994' ప్రకారం మైనర్లకు అనుమతి లేదని చెప్పారు. దేవనంద ఇంటర్‌నెట్ జల్లెడ పట్టింది. గతంలో ఇలాంటి కేసులో ఒక మైనర్‌కు ఆర్గాన్ డొనేట్ చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చినట్టుగా చదివింది. అయితే ఆ మైనర్ నుంచి ఆర్గాన్ డొనేషన్ జరగలేదు. ఆ తీర్పు ఆధారంగా తాను హైకోర్టుకు వెళ్లాలని నిశ్చయించుకుంది.

జడ్జి పూనుకొని

హైకోర్టులో జస్టిస్ వి.జి.అరుణ్ సమక్షానికి ఈ కేసు వచ్చింది. ప్రత్యేకమైన కమిటీని వేసి ఆర్గాన్ యాక్ట్‌లో ఏదైనా మినహాయింపుతో దేవనంద తన తండ్రికి లివర్ ఇవ్వొచ్చో కూడదో సూచించమని ఆదేశించాడాయన. కమిటీ అధ్యయనం చేసి చిన్న వయసులో ఇవ్వడానికి ఏ మాత్రం వీలు లేదని, దేవనందను ఇందుకు అనుమతించ వద్దని తేల్చి చెప్పింది. కాని దేవనంద కమిటీ రిపోర్టును మళ్లీ సవాలు చేసి తండ్రిని కాపాడుకునే హక్కు తనకు ఉందని కోర్టుకు చెప్పింది. 'నాన్నను కోల్పోతే మేము దిక్కులేని వాళ్లం అవుతాం' అని చెప్పింది. జస్టిస్ వి.జి.అరుణ్ దేవనంద పట్టుదలను, తండ్రి కోసం ఆమె పడుతున్న ఆరాటాన్ని ఎంతో ప్రశంసించారు. 'ఇలాంటి కూతురు అందరికీ ఉండాలి' అన్నారు. ఈసారి మరో కమిటీని వేశారు. ఆ కమిటీ దేవనందకు అనుకూలంగా రిపోర్టు ఇవ్వడంతో డిసెంబర్ 2022లో అనుమతి ఇస్తూ తీర్పు చెప్పారు.

అన్ని విధాలా సిద్ధమయ్యి

ఈ విషయం తెలిసి బంధువులు వారించినా దేవనంద వెనక్కు తగ్గలేదు. తండ్రికి ఆరోగ్యకరమైన లివర్ ఇవ్వడానికి జిమ్‌లో చేరింది. మంచి పోషకాహారం తీసుకుంది. తండ్రి కోసం ఫిబ్రవరి 9న ఆపరేషన్ బల్ల ఎక్కింది. పెద్ద వైద్యుల బృందం ఆధ్వర్యంలో తండ్రీకూతుళ్లకు సర్జరీ చేసి లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతం చేశారు. ఆపరేషన్ జరిగిన రాజగిరి హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ల బృందం దేవనందకు ఫ్యాన్స్ అయ్యా రు. తండ్రీ కూతుళ్ల డిశ్చార్జ్ అవుతుంటే అందరూ వచ్చి జ్ఞాపికతో వారిని సాగనంపారు. అంతేనా? దేవనంద పట్టుదల, ప్రేమను చూసి తండ్రి ఆపరేషన్ ఖర్చులను మాఫీ చేశారు. కూతురు ప్రేమ సాధించిన ఘన విజయంగా దీనిని అభివర్ణించవచ్చు.

ఫస్ట్ టైమ్

మేఘనత

భారతీయ మూలాలు ఉన్న ప్రొఫెసర్ మేఘనా పండిత్ బ్రిటన్‌లోని ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ హాస్పిటల్స్ సీయివోగా నియమితురాలై ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా ప్రత్యేకత చాటుకుంది.

గత సంవత్సరం జులై నుంచి బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ హాస్పిటల్స్(వోయుహెచ్), నేషనల్ హెల్త్ సర్వీసెస్ ట్రస్ట్(ఎన్‌హెచ్‌ఎస్)కు తాత్కాలిక సీయివో గా బాధ్యతలు నిర్వహించిన మేఘన ఇప్పుడు శాశ్వత ప్రాతిపదికన ఆ బాధ్యత లు చేపట్టబోతోంది. 'సీయివోగా మేఘన నియామకం సంతోషం కలిగిస్తుంది. విషయం మీద ఆసక్తి, అనురక్తి మాత్రమే కాదు అంకిత భావం, క్రమశిక్షణ ఉంటే ఉన్నతస్థాయికి ఎదగవచ్చు అని చెప్పడానికి ఆమె ఉదాహరణ. ఉద్యోగులతో కలిసి పనిచేసే తీరు ఆమెలోని నాయకత్వ లక్షణాలకు అద్దం పడుతుంది. ట్రస్ట్‌కు సంబంధించిన విలువలు కాపాడడంలో, ట్రస్ట్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆమె నాయకత్వ బలం ఉపయోగపడుతుంది' అంటున్నారు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ జోనాథన్.



మేఘనా పండిత్

'ఎన్‌హెచ్‌ఎస్'కు బ్రిటన్‌లో ఎన్నో టీచింగ్ హాస్పిటల్స్ ఉన్నాయి. యూరప్‌లో అత్యధిక సంఖ్యలో హాస్పిటల్స్ ఉన్నాయి. ట్రస్ట్ ఆధ్వర్యంలో విలువైన పరిశోధనలు జరుగుతున్నాయి. గతంలో 'ఎన్‌హెచ్‌ఎస్'కు సంబంధించి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సిఎంవో)గా విధులు నిర్వహించింది మేఘన. వార్‌విక్ యూనివర్శిటీ హానరరీ ప్రొఫెసర్‌గా నియామకం అయింది. ముంబైలో ఎంబీబీఎస్ చేసిన మేఘనా పండిత్ బోధన నుంచి నిర్వహణ వరకు తనదైన ప్రతిభతో ముందుకు దూసుకువెళుతుంది.

పుష్కరకాలంగా ప్రకృతి సేద్యం

సేంద్రియ కర్బనం 3%

● ఎకరానికి 45 బస్తాల వరకు ధాన్యం దిగుబడి ● తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం ● విదేశాలకు ఎగుమతి చేస్తున్న రైతు కృష్ణ



ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగవుతున్న వరి పొలంలో రైతు అరిమిల్లి కృష్ణ

● ధాన్యం చూపుతున్న కృష్ణ

ఈ రైతు పేరు అరిమిల్లి కృష్ణ. ఆయనది కర్నూలు జిల్లా పశ్చిమాన కరువు కేరాఫ్‌గా ఉన్న కోసిగి మండలం కోల్మాన్‌పేట గ్రామం. బీటెక్ మెకానికల్ ఇంజనీర్ చదివారు. అయినా, పాతికేళ్ల నుంచి మక్కువతో వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం నష్టదాయకంగా పరిణమించటంతో పన్నెండేళ్ల క్రితం సాగు పద్ధతిని మార్చుకున్నారు. కృష్ణ వ్యవసాయ క్షేత్రంలో 40 కుపైగా ఆవులున్నాయి. 70 ఎకరాల్లో స్వచ్ఛమైన ప్రకృతి వ్యవసాయం కొనసాగిస్తూ ఇటు భూసారం, అటు దిగుబడుల పెంపుదల, నేరుగా వినియోగదారులకు బియ్యం విక్రయం వంటి అనేక విషయాల్లో అద్భుతాలు సాధించారు. 44 ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో మామిడి, 5 ఎకరాల్లో పప్పుధాన్యాలు, 8 ఎకరాల్లో మల్బరీతోట,4 ఎకరాల్లో జీలుగ, 3 ఎకరాల్లో నేపియర్ పశుగ్రాసం వేస్తున్నారు.

రసాయనిక సేద్యంలో నుంచి ప్రకృతి సేద్యంలోకి కృష్ణ మళ్లేనాటికి ఆయన పొలం మట్టిలో సేంద్రియ కర్బనం 0.6 శాతానికి పడిపోయి భూమి నిస్సారమైపోయింది. పేడ, ఘన జీవామృతం, ద్రవ జీవామృతంతో భూసారాన్ని కాపాడుకోగలమని ఆయన నిరూపించారు. ప్రస్తుతం ఆయన పొలంలో సేంద్రియ కర్బనం 3%కి పెరిగింది. రసాయనాలకు బదులుగా జీవామృతాలు, కషాయాలు సొంతంగా తయారు చేసుకుని పంట సంరక్షణ చేస్తున్నారు.

ఎకరానికి 35–45 బస్తాల ధాన్యం

ఆర్.ఎస్.ఆర్. 15048, ఎన్‌డిఎల్ఆర్7 వరి రకాలు ప్రకృతి వ్యవసాయానికి బాగా నప్పుతాయని కృష్ణ అనుభవపూర్వకంగా చెబుతున్నారు. ఎకరానికి ఖరీఫ్‌లో 35 బస్తాలు, రబీలో 40–45 బస్తాల మేరకు రసాయనిక సేద్యం చేసే రైతులతో సమానంగా దిగుబడి పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితోనే రసాయన సాగుకు మించి లాభాలు తీస్తున్నానని కృష్ణ తెలిపారు. 2012 ఏటా నుంచి ఇదే పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం, యాగంటిపల్లె, బనవాసి కేవీకేల శాస్త్రవేత్తలు ఆయన పొలంలో, పంట దిగుబడుల్లో వస్తున్న మార్పుల్ని గమనిస్తూ సూచనలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. భారతీయ వైద్య పరిశోధనా మండలికి చెందిన జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) కృష్ణ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆర్ఎస్ఆర్ 15048 వరి బియ్యంపై అధ్యయనం చేసింది. ఈ బియ్యం షుగర్ రోగులు, హృద్రోగుల ఆరోగ్యం మెరుగుదలకు ఇవి ఉపయోగపడుతున్నాయని తేల్చింది. ఈ అధ్యయన వివరాలతో ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డా. దమయంతి రాసిన వ్యాసం అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో అచ్చయ్యింది.

ఏటా 700 బస్తాలకుపైగా బియ్యాన్ని విక్రయిస్తున్నారు. టోకుగా కిలో రూ.60–62, రిటైల్‌గా రూ. 70లకు బియ్యాన్ని వారానికి రెండు సార్లు మరపట్టించి వినియోగదారులకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపుతున్నారు. రసాయన ఎరువులతో సాగు చేసిన బియ్యం కంటే సేంద్రియ బియ్యాన్ని ఎక్కువ ధరకు ప్రజలు కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. తాను పండించిన వరి బియ్యం దుబాయ్, ఖతర్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వివిధ కంపెనీల ద్వారా ఎగుమతి చేశారు. దుబాయిలో కేజీ బియ్యం రూ.280 చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. త్వరలో సొంతంగా బ్రాండ్‌పై విదేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నానని కృష్ణ వివరించారు. భవిష్యత్తు దృష్ట్యా విషతుల్య సాగు పద్ధతులను విడనాడి ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని రైతులకు ఆయన సూచిస్తున్నారు. తమ ఊర్లో 300 మంది రైతులు ఆవులను పెంచేలా అవగాహన తీసుకువచ్చానని, వరి సాగులో ఎవ్వరూ రసాయన పురుగు మందులు వాడటం లేదని కృష్ణ (95533 42667) గర్వంగా చెబుతున్నారు.

– కుమ్మరి పరశురాం,
సాక్షి, మంత్రాలయం, కర్నూలు జిల్లా

సాగుబడి
శతభిష కార్తె:
ఫిబ్రవరి 19
నుంచి

● సమీకృత సేంద్రియ సేద్యం

ఎకరంన్నరలో ఏటా రూ.4 లక్షలు

● ప్రతి రోజూ రూ. 1,500 ఆదాయాన్నందించే సమీకృత సేద్యం ● ఎకరంన్నరలో ఏకకాలంలో ఎన్నో పంటలు, మేకలు, కోళ్లు, ముత్యాలు, పుట్టగొడుగుల పెంపకం.. ఏడాదికి రూ. 4 లక్షలకు పైగా నికరాదాయం ● మార్గదర్శకంగా నిలుస్తున్న శేషు, లక్ష్మీప్రియ దంపతులు

ఏదో ఒక పంట సాగుపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలు ఆదాయపరంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతుంటాయి. ముఖ్యంగా, ఎకరం, రెండెకరాల భూమి మాత్రమే కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఏక పంటల సాగుతో తగినంత ఆదాయం పొందలేక అప్పుల పాలవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఈ దుస్థితి నుంచి రైతులు బయటపడాలంటే సమీకృత సేంద్రియ వ్యవసాయం ఒక్కటే మార్గం. సమీకృత సేద్యం అంటే.. చిన్న కమతం నుంచి కూడా ఒకటికి నాలుగు విధాలుగా ఆదాయం వచ్చే విధంగా కృషి చెయ్యటం అన్నమాట. నిరంతర ఆదాయం వచ్చేలా సమీకృత సేంద్రియ సేద్యం చేపట్టి.. నిరంతరం ఆదాయం పొందే మార్గాలను ఆచరించి చూపుతున్నారు సూర్యాపేట జిల్లాకు చెందిన రైతు దంపతులు వాసికర్ల శేషుకుమార్, లక్ష్మీప్రియ.



1. ఎలివేటెడ్ షెడ్
2. ముత్యాల సాగు
3. షెడ్‌లో నాటు కోళ్లు
4. షెడ్‌లో గొర్రెలు, మేకలు
5. పుట్టగొడుగుల సాగుకు ఉపయోగిస్తున్న డ్రమ్ములు
6.పుట్టగొడుగులు

రెక్కల కష్టాన్ని నమ్ముకునే చిన్న, సన్నకారు రైతు దంపతులకు ఏడాది పొడవునా అనుదినం ఆదాయాన్ని అందించే విధంగా సమీకృత సేంద్రియ సేద్య పద్ధతులను విజయవంతంగా ఆచరించి చూపిస్తున్నారు వాసికర్ల శేషుకుమార్(53), లక్ష్మీప్రియ దంపతులు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన శేషుకుమార్(53) ఎమ్మే చదువుకొని గత 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. అభ్యుదయ భావాలు కలిగిన ఆయన 25 ఎకరాల్లో డ్రమ్‌సీడర్, వెద పద్ధతుల్లో వరి పండిస్తున్నారు. నాగార్జునసాగర్ కాల్వ పక్కనే పొలం ఉండటంతో సాగు నీటికి దిగులు లేదు. వరి సాగు నష్టదాయకంగా పరిణమిస్తున్న నేపథ్యంలో వరికి బదులుగా.. కాయకష్టం చేసే రైతు కుటుంబాలకు రోజూ ఆదాయాన్నిచ్చే సమీకృత సేంద్రియ వ్యవసాయ నమూనా వైపు ఏడాదిన్నర క్రితం దృష్టి సారించారు. ఎకరంన్నర విస్తీర్ణంలో సమీకృత సేంద్రియ సేద్యం చేపట్టారు. ఈ క్షేత్రం ప్రదర్శన క్షేత్రంగా, రైతులకు శిక్షణా కేంద్రంగా మారింది. శేషు అనుసరిస్తున్న సమీకృత సేంద్రియ సేద్య నమూనా రైతులను ఆకర్షిస్తోంది. కూరగాయలు, పశుగ్రాస పంటలతో పాటు దీర్ఘకాలిక పండ్ల చెట్లను పూర్తి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. దీనితో పాటు.. మేకలు గొర్రెలు, నాటుకోళ్లు, పుట్టగొడుగులు, ముత్యాల పెంపకాన్ని చేపట్టి ఒకటికి నాలుగు రకాలుగా నిరంతరం ఆదాయం పొందటమే ఈ నమూనాలో ప్రత్యేకత. ఎకరంన్నరలో మొదట గొర్రెలు, మేకలు పెంచేందుకు ప్రత్యేకంగా ఎలివేటెడ్ షెడ్‌ను రూ. 5 లక్షల ఖర్చుతో నిర్మించారు. షెడ్ పైఅంతస్థులో మేకలు, గొర్రెలు పెరుగుతూ ఉంటే.. షెడ్ కింద కొంత భాగంలో నాటు కోళ్ళ పెంపకకానికి శ్రీకారం చుట్టారు. షెడ్ కింద మిగతా భాగంలో ఒక డార్క్ రూమ్‌ను నిర్మించి పాల పుట్టగొడుగుల పెంపకానికి ఉపయోగిస్తున్నారు. 3 సిమెంటు ట్యాంకులు నిర్మించి స్థానికంగా సేకరించిన 5 వేల ఆల్‌చిప్పల్లో 3 నెలల క్రితం ముత్యాల సాగు ప్రారంభించారు.

ఈ సమీకృత వ్యవసాయం క్షేత్రం చుట్టూ ప్రత్యేకంగా కంచె ఏర్పాటు చేశారు. చుట్టూతా కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్ తదితర దీర్ఘకాలిక పండ్ల మొక్కలు నాటారు. ప్లాస్టిక్ షీట్‌తో మల్చింగ్ చేసి.. బోడ కాకర, బీర, సొర, కాకర సాగు చేపట్టారు. వంగ, టమాటో, మిర్చి, బోడ కాకర, బీర, సొర, నేతి బీర, కాకర, పొట్ల, చిక్కుడు, మునగ, బంతి, గులాబీ తదితర రకాల పంటల సాగు చేపట్టారు. పశువుల కోసం నేపియర్, దశరథ గడ్డి, మొక్కజొన్న గడ్డిని పెంచుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎక్కడా చోటు వృథా కాకుండా అధిక సాంద్రతలో అనేక పంటలు, పండ్ల మొక్కలు నాటారు. ఈ క్షేత్రంలో ఎలాంటి రసాయనాలను ఉపయోగించటం లేదు. ఒకటికి నాలుగు దారుల్లో ఆదాయం పొందే సాగు పద్ధతిపై చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు స్ఫూర్తినిస్తున్న శేషుకుమార్ దంపతులు ధన్యులు.

– మొలుగూరి గోపి, సాక్షి, నడిగూడెం, సూర్యాపేట జిల్లా

చిన్న రైతులు నిత్యం ఆదాయం పొందాలి

వరి పంట సాగులో పెట్టుబడులు బాగా పెరిగాయి. కూలీల కొరత ఇబ్బందిగా మారింది. దీంతో నిత్యం ఆదాయం పొందే విధంగా ఈ సమీకృత వ్యవసాయంపై ఆసక్తి కలిగింది. తక్కువ భూమిలో విభిన్న రకాల పంటల సాగు చేపట్టాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికతో ముందుకువెళ్తున్నాం.

– వాసికర్ల లక్ష్మీప్రియ, సమీకృత సేంద్రియ మహిళా రైతు, సిరిపురం, సూర్యాపేట జిల్లా

సులువుగా సేంద్రియ పుట్టగొడుగుల పెంపకం

సమీకృత వ్యయసాయ క్షేత్రంలో షెడ్డులో సేంద్రియ పద్ధతుల్లో పాల పుట్టగొడుగుల పెంపకం చేపట్టారు. వరిగడ్డి ముక్కలను, మట్టిని ప్రత్యేక పద్ధతుల్లో శుద్ధి చేసి, పుట్టగొడుగుల పెంపకానికి పాలిథిన్ బ్యాగ్‌లను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ అంతా పరిశుద్ధమైన 27 డిగ్రీల వాతావరణంలో గాలి, వెల్తురు తగలని చీకటి గదిలో జరుగుతుంది. బ్యాగ్‌లలో నింపిన గడ్డిపై మైసీలియం అనే శిలీంధ్రం అభివృద్ధి చెందిన తర్వాత బ్యాగ్‌లను మామూలు గదిలోకి మార్చుతారు. వారం తర్వాత నుంచి పుట్టగొడుగుల దిగుబడి వస్తుంది. వరిగడ్డి ముక్కలను స్టెయిన్‌లెస్ స్టీల్ డ్రమ్స్ సహాయంతో ఆవిరి ద్వారా శుద్ధి చేసే ప్రత్యేక పద్ధతిని శేషు అనుసరిస్తున్నారు. దీని వల్ల గడ్డి వెంటనే తడి ఆరిపోతుందన్నారు. ఈ విధంగా సేంద్రియ పద్ధతిలో పుట్టగొడుగుల పెంపకం సులభతరమైందని శేషు చెప్పారు.

ముత్యాల సాగును ఒక్క రోజులో నేర్చుకోవచ్చు

ఎకరంన్నరలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న శేషుకుమార్ దంపతులు ప్రత్యేక షెడ్‌లో మూడు సిమెంటు ట్యాంకులను నిర్మించి ముత్యాల సాగు చేపట్టారు. దేవతా రూపాల్లో డిజైనర్ ముత్యాలైతే 14 నెలల్లో, ఎం.ఓ.పి. న్యూక్లియస్‌ల ద్వారా గుండ్రటి ముత్యాలైతే 18 నెలల్లో దిగుబడి వస్తుందన్నారు. ఒక ఆల్‌చిప్పకు రెండు ముత్యాలు వస్తాయి. నాణ్యతను బట్టి ధర ఉంటుంది. సగటున ధర రూ. 150–200 ఉంటుంది. ఒక రోజు శిక్షణతో మహిళలు కూడా ముత్యాల సాగును నేర్చుకోవచ్చు.

చిన్న రైతులకు దారి చూపాలని..

భూమి తక్కువగా ఉండే చిన్న, సన్నకారు రైతు దంపతులు ఏదో ఒకే పంట సాగుపై ఆధారపడితే తగినంత ఆదాయం రాదు. సమీకృత సేంద్రియ సాగు చేపడితే రోజువారీగా మంచి ఆదాయం పొందే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. అందుకని, ఎకరంన్నర పొలంలో ఈ క్షేత్రాన్ని రూపొందించాం. ఎకరంన్నర భూమిలో భార్య, భర్త స్వయంకృషి చేస్తే అన్ని ఖర్చులూ పోను రూ. 4 లక్షలకు పైగా నికరాదాయం వస్తోంది. ఈ సందేశం రైతులందరికీ తెలియజెప్పాలనేదే మా తపన. రోజుకు రూ.1,500 ఆదాయం వస్తున్నది. రెండు వేలకు పెంచాలనేది లక్ష్యం. ప్రతి రైతూ ముందుకు రావాలి. ప్రభుత్వం అవగాహన కల్పించాలి.

– వాసికర్ల శేషుకుమార్ (91824 06310),
సమీకృత సేంద్రియ రైతు, సిరిపురం, సూర్యాపేట జిల్లా

నిర్వహణ:
పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



టైటిల్‌తో అల్‌కరాజ్ పునరాగమనం

కుడి కాలి గాయం నుంచి కోలుకున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) ఈ ఏడాది బరిలోకి దిగిన తొలి టోర్నీలోనే టైటిల్ సాధించాడు. అర్జెంటీనా ఓపెన్ టోర్నీ ఫైనల్లో 19 ఏళ్ల అల్‌కరాజ్ 6-3, 7-5తో 12వ ర్యాంకర్ కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలిచాడు. అల్‌కరాజ్‌కు 95,305 డాలర్ల (రూ. 78 లక్షల 83 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 పాయింట్లు లభించాయి. గతేడాది యూఎస్ ఓపెన్ గెలిచాక నంబర్‌వన్ అయిన అల్ కరాజ్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరం కావడంతో టాప్ ర్యాంక్ కోల్పోయాడు.

సానియా మ్యాచ్ నేటికి వాయిదా



దుబాయ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ సానియా మీర్జా మహిళల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్ నేటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం సోమవారమే సానియా మీర్జా–మాడిసన్ కీస్ (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లో కుదెర్‌మెతోవా–సమ్‌సనోవా (రష్యా) ద్వయంతో ఆడాల్సింది. అయితే ఇతర మ్యాచ్‌లు సుదీర్ఘంగా సాగడంతో సానియా మ్యాచ్ అనుకున్న సమయానికి ప్రారంభమయ్యే అవకాశం లేకపోవడంతో నిర్వాహకులు నేటికి వాయిదా వేశారు. ఈ టోర్నీతో సానియా తన కెరీర్‌కు వీడ్కోలు పలకనుంది.

దర్జాగా సెమీస్‌కు...



స్మృతి మంధాన

- మహిళల టి20 ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు టీమిండియా
- చివరి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై విజయం
- స్మృతి మంధాన మెరుపులు



వికెట్ తీసిన ఆనందంలో రేణుక సింగ్

కెబెహా (దక్షిణాఫ్రికా): ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా, ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడకుండా భారత మహిళల జట్టు టి20 ప్రపంచకప్‌లో నేరుగా సెమీ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఐర్లాండ్‌తో సోమవారం జరిగిన గ్రూప్–2 చివరి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిలో ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 155 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (56 బంతుల్లో 87; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడి టాప్ స్కోరర్‌గా నిలిచింది. టి20 కెరీర్‌లో స్మృతికిదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం. స్మృతి మూడుసార్లు ఇచ్చిన క్యాచ్‌లను ఐర్లాండ్ ఫీల్డర్లు వదిలేయడం గమనార్హం. షఫాలీ వర్మ (29 బంతుల్లో 24; 3 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించిన స్మృతి... హర్మన్‌ప్రీత్ (20 బంతుల్లో 13)తో రెండో వికెట్‌కు 52 పరుగులు జత చేసింది. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ 8.2 ఓవర్లలో 2 వికెట్లకు 54 పరుగులు సాధించిన సమయంలో వర్షం రావడంతో ఆటకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గకపోవడంతో మిగతా ఓవర్ల ఆట సాధ్యపడలేదు. 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతి ప్రకారం 8.2 ఓవర్లలో ఐర్లాండ్ విజయసమీకరణం 59 పరుగులుగా ఉంది. అయితే ఆ జట్టు ఐదు పరుగులు వెనుకపడి ఉండటంతో భారత విజయం ఖరారైంది. ఈ టోర్నీలో ఐర్లాండ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడం గమనార్హం. ఈ గెలుపుతో భారత్ ఆరు పాయింట్లతో గ్రూప్–2లో రెండో స్థానంతో సెమీఫైనల్ చేరింది. గురువారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, గ్రూప్–1 టాపర్ ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది.

పాకిస్తాన్‌తో నేడు తమ చివరి లీగ్ మ్యాచ్ ఆడనున్న ఇంగ్లండ్ ఆరు పాయింట్లతో ఇప్పటికే గ్రూప్–2 నుంచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రన్‌రేట్ పరంగా భారత్ (0.253) కంటే ఇంగ్లండ్ (1.776) మెరుగ్గా ఉంది. ఒకవేళ నేటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓడిపోయినా గ్రూప్–2లో ఆ జట్టే 'టాప్'లో నిలుస్తుంది. గ్రూప్–2 టాపర్ హోదాలో ఇంగ్లండ్ శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో గ్రూప్–1లో రెండో స్థానంలో నిలిచే అవకాశమున్న న్యూజిలాండ్ లేదా దక్షిణాఫ్రికాతో ఆడుతుంది. గ్రూప్–1లో న్యూజిలాండ్ నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. నేడు బంగ్లాదేశ్‌తో చివరి మ్యాచ్ ఆడనున్న దక్షిణాఫ్రికా సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాలి. అలా జరిగితే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక 4 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలుస్తాయి. ఈ దశలో న్యూజిలాండ్, శ్రీలంకకంటే మెరుగైన రన్‌రేట్ ఉన్న దక్షిణాఫ్రికా సెమీస్ చేరుకుంటుంది.

1 ఐర్లాండ్ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 150 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డు నెలకొల్పింది. 2009 తొలి **టి20** ప్రపంచకప్‌లో మొదటి మ్యా**చ్** ఆడిన హర్మన్ 2023లో టి20 ప్రపంచకప్‌లోనే తన 150**వ** మ్యాచ్ ఆడటం విశేషం.



4 అంతర్జాతీయ మహిళల **టి20ల్లో** 3,000 పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో క్రికెటర్‌గా, భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా హర్మన్‌ప్రీత్ గుర్తింపు పొందింది. టాప్–3లో సుజీ బేట్స్ (3,820–న్యూజిలాండ్), మెగ్ లానింగ్ (3,346–ఆస్ట్రేలియా), స్టెఫానీ టేలర్ (3,166–వెస్టిండీస్) ఉన్నారు.

5 టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత మహిళల జట్టు సెమీఫైనల్ చేరుకోవడం ఇది ఐదోసారి. 2009, 2010, 2018లలో సెమీఫైనల్లో ఓడిన భారత్ 2020లో రన్నరప్‌గా నిలిచింది.

గ్రూప్–2 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	ర.రే.
ఇంగ్లండ్	3	3	0	6	1.776
భారత్	4	3	1	6	0.253
వెస్టిండీస్	4	2	2	4	–0.601
పాకిస్తాన్	3	1	2	2	0.981
ఐర్లాండ్	4	0	4	0	–1.814

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, ర.రే–రన్‌రేట్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) అమీ హంటర్ (బి) లౌరా డెలానీ 24; స్మృతి మంధాన (సి) గ్యాబీ లూయిస్ (బి) ఒర్లా ప్రెండర్‌గాస్ట్ 87; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) లౌరా డెలానీ 13; రిచా ఘోష్ (సి) గ్యాబీ లూయిస్ (బి) లౌరా డెలానీ 0; జెమీమా రోడ్రిగ్స్ (స్టంప్డ్) వాల్డ్రోన్ (బి) కెల్లీ 19; దీప్తి శర్మ (సి) డెంప్సీ (బి) ప్రెండర్‌గాస్ట్ 0; పూజా వస్త్రకర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 155. **వికెట్ల పతనం:** 1–62, 2–114, 3–115, 4–143, 5–143, 6–155. **బౌలింగ్:** ఒర్లా ప్రెండర్‌గాస్ట్ 4–0–22–2, డెంప్సీ 3–0–27–0, కెల్లీ 4–0–28–1, లెహ్ పాల్ 3–0–27–0, కారా ముర్రే 2–0–16–0, లౌరా డెలానీ 4–0–33–3.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: అమీ హంటర్ (రనౌట్) 1; గ్యాబీ లూయిస్ (నాటౌట్) 32; ప్రెండర్‌గాస్ట్ (బి) రేణుక సింగ్ 0; లౌరా డెలానీ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (8.2 ఓవర్లలో 2 వికెట్లకు) 54. వికెట్ల పతనం:** 1–1, 2–1. **బౌలింగ్:** రేణుక 2–0–10–1, శిఖా పాండే 2.2–0 –14–0, దీప్తి 1–0–11–0, రాజేశ్వరి 1–0–5–0.

'మిక్స్‌డ్'లో పసిడి కాంతులు

ఎయిర్ రైఫిల్, పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు స్వర్ణ పతకాలు





బంగారు పతకాలతో భారత షూటర్లు నర్మద, రుద్రాంక్ష్ పాటిల్, వరుణ్ తోమర్, రిథమ్ సాంగ్వాన్

కైరో (ఈజిప్ట్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో రోజు భారత్ ఖాతాలో పతకాలు చేరాయి. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో భారత జోడీలు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాయి. ఎయిర్ రైఫిల్ విభాగంలో నర్మద నితిన్ రాజు–రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ జోడీ... ఎయిర్ పిస్టల్ విభాగంలో వరుణ్ తోమర్–రిథమ్ సాంగ్వాన్ జోడీ విజేతగా నిలిచాయి. ఎయిర్ రైఫిల్ టీమ్ మిక్స్‌డ్ ఫైనల్లో తమిళనాడుకు చెందిన నర్మద, మహారాష్ట్రకు చెందిన రుద్రాంక్ష్ జోడీ 16–6తో ఎస్టెర్ డెనిస్–ఇస్త్‌వాన్ పెని (హంగేరి) ద్వయంపై గెలిచింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో నర్మద–రుద్రాంక్ష్ 635.8 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు చేరారు. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఫైనల్లో వరుణ్–రిథమ్ ద్వయం 16–10తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) జోడీని ఓడించింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో వరుణ్–రిథమ్ ద్వయం 583 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. ఆదివారం జరిగిన ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో వరుణ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలతో అగ్రస్థానంలో ఉంది.

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలకు సురేఖ, ధీరజ్





సోనీపత్ (హరియాణా): ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టోర్నీలు... ప్రపంచ చాంపియన్‌షిప్... అనంతరం ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత పురుషుల, మహిళల రికర్వ్, కాంపౌండ్ జట్లను భారత ఆర్చరీ సంఘం సోమవారం ప్రకటించింది. పురుషుల రికర్వ్ జట్టులో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు తరఫున పోటీపడ్డ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్... మహిళల కాంపౌండ్ జట్టులో ఆంధ్రప్రదేశ్ మేటి క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ, తెలంగాణ అమ్మాయి తనిపర్తి చికిత చోటు సంపాదించారు. సోనీపత్‌లోని భారత స్పోర్ట్స్ అథారిటీ కేంద్రంలో నిర్వహించిన ట్రయల్స్ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. పురుషుల, మహిళల రికర్వ్ విభాగాల్లో ఎనిమిది మంది చొప్పున... పురుషుల, మహిళల కాంపౌండ్ విభాగాల్లో ఎనిమిది మంది చొప్పున ఎంపిక చేశారు. ఇందులో టాప్–4లో నిలిచిన వారికి తొలి ప్రాధాన్యత లభిస్తుంది. రెండు ప్రపంచకప్ టోర్నీ లు ముగిశాక టాప్–4లో నిలిచిన వారు విఫలమైతే తదుపరి టోర్నీకి 5 నుంచి 8 స్థానాల్లో నిలిచిన వారికి చాన్స్ ఇస్తారు. మూడు ప్రపంచకప్ టోర్నీలు అంటాల్యాలో (ఏప్రిల్ 18–23)... షాంఘైలో (మే 16–21)... కొలంబియాలో (జూన్ 13–18) జరుగుతాయి. ప్రపంచ చాంపియన్‌షిప్ జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు జర్మనీలో... ఆసియా క్రీడలు సెప్టెంబర్‌లో చైనాలో జరుగుతాయి. ట్రయల్స్‌లో విఫలమైన 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి మహిళల రికర్వ్ జట్టులో చోటు సంపాదించలేకపోయింది.

మార్చి 18న ఐఎస్‌ఎల్ ఫైనల్



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్ మార్చి 18న గోవాలోని ఫటోర్డా పట్టణంలో జరుగుతుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌లు మార్చి 3న మొదలవుతాయి. ఇప్పటికే టాప్–2లో నిలిచిన ముంబై సిటీ, డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఎఫ్‌సీ నేరుగా సెమీఫైనల్ చేరాయి.

సినిమా

కథ ఎవర్నైనా ఎక్కడికైనా తీసుకెళ్లగలదు. అలా ఈ మధ్య కొన్ని కథలు కొందరు బాలీవుడ్ యాక్టర్స్‌ను సౌత్‌కు రమ్మన్నాయి. ఆల్రెడీ హిందీ హీరోయిన్లు కొన్నేళ్లుగా సౌత్‌లో రాణిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు నటులు కూడా సౌత్‌లో స్టెప్ఇన్ అవుతున్నారు. మంచి కథలు పిలుస్తుండటంతో కాదనకుండా వచ్చేస్తున్నాం అంటూ కొందరు నార్త్ స్టార్స్ సౌత్ బాట పట్టారు. ఆ నటులు కమిట్ అయిన సౌత్ సినిమాల గురించి తెలుసుకుందాం.

కథ రమ్మంటే కాదంటారా!



అమితాబ్



సంజయ్ దత్



సైఫ్ అలీఖాన్



బాబీ డియోల్



నవాజుద్దీన్



అభిషేక్

నాగార్జున 'మనం' సినిమాలో అతిథిగా కనిపించిన బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఆ తర్వాత చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రస్తుతం అమితాబ్ బచ్చన్ 'ప్రాజెక్ట్ కె' సినిమా చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌ది కీలక పాత్ర. ఈ చిత్రంతోనే తెలుగుకు పరిచయం అవుతున్నారు దీపికా పదుకోన్. 'ప్రాజెక్ట్ కె' వచ్చే ఏడాది జనవరి 12న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఇక బాలీవుడ్ స్క్రీన్‌పై హీరోగా ఓ వెలుగు వెలిగారు సంజయ్ దత్. ఇప్పటి తరానికి తెలిసి ఉండకపోవచ్చు కానీ 1998లో వచ్చిన 'చంద్రలేఖ' సినిమాతో తెలుగు తెరపైనా కనిపించారు సంజయ్. నాగార్జున హీరోగా నటించిన ఆ చిత్రంలో సంజయ్ దత్ ఓ అతిథి పాత్ర చేశారు. అలా ఈ బాలీవుడ్ స్టార్ సౌత్ ఎంట్రీ 25 ఏళ్ల క్రితమే జరిగింది. మళ్లీ ఆయన 2022లో కన్నడ 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' ద్వారా దక్షిణాది తెరపై కనిపించారు. కన్నడంలో సంజయ్ దత్ చేసిన తొలి చిత్రం ఇదే. తాజాగా తమిళ చిత్రం 'లియో'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు సంజయ్ దత్. విజయ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి లోకేష్ కనగరాజ్ దర్శకుడు. సంజయ్‌కు తమిళంలో 'లియో' తొలి సినిమా కావడం విశేషం. అలాగే తెలుగులోనూ ఆయన ఓ ఫుల్ లెంగ్త్ రోల్ చేయనున్నారనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్' (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంజయ్ దత్‌ను ఓ కీ రోల్‌కు సంప్రదించారనే టాక్ గతంలో వినిపించింది. అదే నిజమైతే పాతికేళ్లకు సంజయ్ తెలుగులో సినిమా కమిట్ అయినట్లు అవుతుంది. మరో బీటౌన్ స్టార్ సైఫ్ అలీఖాన్ సైతం సౌత్‌పై ఫోకస్ పెట్టారని చెప్పొచ్చు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్'లో నటించారు సైఫ్ అలీఖాన్. ప్రభాస్ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రానికి ఓం రౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది. కాగా ఎన్టీఆర్ హీరోగా నటించనున్న తాజా చిత్రంలో సైఫ్ అలీఖాన్ ఓ కీ రోల్ చేయనున్నారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది. మరోవైపు హిందీలో రెండు దశాబ్దాలుగా మంచి పాత్రలు చేస్తూ, నటుడిగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవాజుద్దీన్ సిద్ధిఖీ ఇప్పుడు మళ్లీ ఓ సౌత్ సినిమాకి 'సై' అన్నారు. రజనీకాంత్ హీరోగా 2019లో విడుదలైన తమిళ చిత్రం 'పేట్టా' (తెలుగులో 'పేట')లో ప్రతినాయకుడి పాత్ర చేశారు నవాజుద్దీన్. ఇప్పుడు ఐదు సంవత్సరాల తర్వాత మరో సౌత్ సినిమా 'సైంధవ్'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంకటేశ్ హీరోగా 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే 'సైంధవ్'. విడుదలైన గ్లింప్స్‌ని బట్టి ఈ చిత్రం మెడికల్ మాఫియా నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. నవాజుద్దీన్‌కు తెలుగులో ఇది తొలి చిత్రం. వెంకటేశ్ కెరీర్‌లో 75వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. ఇక ఇంకో బాలీవుడ్ హీరో బాబీ డియోల్ సైతం తెలుగు డైలాగ్స్ చెబుతున్నారు. ఎందుకంటే 'హరి హర వీర మల్లు' చిత్రం కోసం. క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు బాబీ డియోల్. ఈ చిత్రంలో ఔరంగజేబు పాత్రలో కనిపిస్తారాయన. ఈ సినిమాను ఈ ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఓ పీరియాడికల్ క్రైమ్ థ్రిల్లర్‌ను తెరకెక్కించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. రెండు ప్రధాన పాత్రలతో సాగే ఈ చిత్రంలో ఓ హీరోగా విజయ్ సేతుపతిని, మరో హీరోగా అభిషేక్ బచ్చన్‌ను అనుకున్నారట గౌతమ్ మీనన్. అభిషేక్ బచ్చన్‌కు ఆల్రెడీ కథ కూడా వినిపించారట. మరి.. అభిషేక్ ఓకే చెబుతారా? వేచి చూడాలి. ఇదే కోవలో మరి కొందరు హిందీ తారలు దక్షిణాది చిత్రాలకు డేట్స్ ఇచ్చారు.

మా అన్నయ్య బంగారం



''మా అన్నయ్య మనసు బంగారం. అందుకే ఆయనపై బంగారాన్ని కురిపించడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని రజనీకాంత్ అన్నారు. సోదరుడు సత్యనారాయణ రావు గైక్వాడ్ పుట్టినరోజుని రజనీకాంత్ అట్టహాసంగా జరిపారు. సతీమణి లతతో కలిసి బంగారు నాణేలతో తన అన్నయ్యకు అభిషేకం చేశారు రజనీ. ''ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం మా అన్నయ్య. ఆయన 80వ పుట్టినరోజుని, అదే రోజు అన్నయ్య కుమారుడు రామకృష్ణ 60వ పుట్టినరోజుని జరపటం చాలా ఆనందంగా అనిపించింది. ఆ దేవుడికి ధన్యవాదాలు'' అని ఈ సందర్భంగా రజనీ ట్వీట్ చేశారు.

రజనీ, లత, సత్యనారాయణ

ఎన్టీఆర్ 30 వాయిదా



ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్– డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'ఎన్టీఆర్ 30' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకి ఈ నెల 24న కొబ్బరికాయ కొట్టాల్సింది. అయితే హీరో తారకరత్న మృతితో నందమూరి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఈ కారణంగా ఎన్టీఆర్–కొరటాల శివ తాజా చిత్రం ప్రారంభోత్సవం వాయిదా పడింది. నందమూరి కల్యాణ్‌రామ్, సుధాకర్ మిక్కిలినేని నిర్మించనున్న ఈ చిత్రం ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ మూవీ. ఈ నెలలో షూటింగ్ ప్రారంభించి, మార్చిలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టి, 2024 ఏప్రిల్ 5న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు 'అమిగోస్' ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ స్వయంగా ప్రకటించారు. కాగా తాజాగా తారకరత్న మృతితో ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటిస్తూ ట్వీట్ చేసింది. ఇక 'ఎన్టీఆర్ 30'తో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనున్నారని టాక్.

మహేశ్ సినిమాలో?



భూమి

'టాయ్‌లెట్ ఏక్ ప్రేమ్ కథ, బాలా, బధాయి దో' వంటి చిత్రాలతో బాలీవుడ్ ఆడియన్స్‌ని అలరించిన హీరోయిన్ భూమి ఫెడ్నేకర్ తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వనున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ద్వారానే భూమి టాలీవుడ్‌లోకి అడుగు పెట్టనున్నారని టాక్. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. కాగా ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర కోసం భూమి ఫెడ్నేకర్‌ని సంప్రదించారట. ఇది కానిస్టేబుల్ పాత్ర అని, సెకండాఫ్‌లో ఈ పాత్ర వస్తుందని వినికిడి. మరి.. ఈ చిత్రంలో ఈ పాత్ర ఉందా? ఉంటే.. భూమి ఫెడ్నేకర్‌నే చేస్తారా? లేక వేరే తార సీన్లోకి వస్తారా? వెయిట్ అండ్ సీ..

ప్రవేశం లేదు



ఆండ్రియా

ఆండ్రియా జెర్మియా లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'నో ఎంట్రీ' (ప్రవేశం లేదు). ఆర్. అళగు కార్తీక్ దర్శకత్వంలో శ్రీధర్ అరుణాచలం నిర్మించిన ఈ చిత్రం తెలుగు–తమిళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'నో ఎంట్రీ' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అళగు కార్తీక్, శ్రీధర్ అరుణాచలం మాట్లాడుతూ– ''అటవీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. అటవీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లిన కొందరు ఫ్రెండ్స్ కొండ శిఖరంలోని ఓ విల్లాలో బస చేస్తారు. ఆ విల్లాని అడవి కుక్కలు చుట్టుముడతాయి. వాటి బారి నుంచి వారు ఏ విధంగా తప్పించుకున్నారు? అన్నదే ఈ చిత్రకథ. ఈ చిత్రంలో ఆండ్రియా సాహసంతో కూడిన యాక్షన్ సన్నివేశాల్లో నటించారు'' అన్నారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
21-2-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
311	100
60,691	17,845

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్‌	11,787	▽	69
డోజోన్స్‌	33,827	△	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,014	△	10
డాక్స్‌	15,478	▽	4
షాంఘై	3,290	△	66
నికాయ్‌	27,532	△	19

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్‌)	56,601
బంగారం (22 క్యారట్‌)	56,374
వెండి (కేజీ)	65,760

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	81.95	83.62
£	బ్రిటన్‌ పౌండ్‌	86.90	90.00
€	యూరో	97.92	101.20
¥	జపాన్‌ ఎన్‌ (100)	60.66	62.63
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	55.88	58.26
S$	సింగపూర్‌ డాలర్‌	60.94	62.93
SAR	సౌదీ రియాల్‌	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్‌	21.63	23.42
¥	చైనా యువాన్‌	10.94	13.01

నీతి ఆయోగ్‌ సీఈఓగా సుబ్రహ్మణ్యం

ప్రపంచ బ్యాంక్‌ ఈడీగా అయ్యర్‌



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్‌ కొత్త సీఈఓగా మాజీ ఐఏఎస్‌ అధికారి బీవీఆర్‌ సుబ్రహ్మణ్యం నియమితుల య్యారు. ఇప్పటివరకు నీతి ఆయోగ్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న పరమేశ్వరన్‌ అయ్యర్‌ ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా వెళుతున్నారు. కేబినెట్‌ నియామకాల కమిటీ ఈ నియామకాలకు ఆమోదముద్ర వేసింది. అయ్యర్‌ మూడేళ్ల పాటు వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంక్‌ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తారు. ఇక సుబ్రహ్మణ్యం రెండేళ్లపాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. కాగా, 1988 బ్యాచ్‌ ఐఏఎస్‌ అధికారి రాజేష్‌ కుల్లార్‌ స్థానంలో అయ్యర్‌ నియామకం జరిగింది.

అదానీ పోర్ట్స్‌ రుణ చెల్లింపు

తాజాగా రూ. 1,500 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్‌ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్‌ అండ్‌ సెజ్‌ తాజాగా రూ. 1,500 కోట్ల రుణాన్ని తిరిగి చెల్లించింది. మరిన్ని రుణాల చెల్లింపులను చేపట్టనున్నట్లు తెలియజేసింది. తాజా మొత్తం ఎస్‌బీఐ మ్యూచువల్‌ ఫండ్స్‌కు చేరగా.. మార్చిలో గడువు తీరనున్న మరో రూ. 1,000 కోట్ల కమర్షియల్‌ పేపర్స్‌కు సైతం చెల్లింపులు చేపట్టనున్నట్లు వెల్లడించింది. నగదు బ్యాలన్స్‌ నుంచి ప్రీపేమెంట్‌ చేసినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలియజేశారు. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్ల రుణాలను తిరిగి చెల్లించనున్నట్లు ఈ నెల 8న కంపెనీ స్పష్టం చేసింది. వచ్చే నెలలో 50 కోట్ల డాలర్ల బ్రిడ్జి రుణాన్ని సైతం తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

21-2-2023	
విశాఖ	420-00
చిత్తూరు	458-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్‌ ధర (డజను)	66.00
20-2-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	395-00
వరంగల్‌	397-00
రిటైల్‌ ధర	4.55

టాటా మోటార్స్‌–ఉబర్‌ భారీ డీల్‌

25,000 ఎక్స్‌ప్రెస్‌-టి ఈవీల సరఫరా



హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: ఎలక్ట్రిక్‌ వెహికిల్స్‌ రంగంలో భారీ డీల్‌కు వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్‌, రైడ్‌ షేరింగ్‌ యాప్‌ ఉబర్‌ తెర లేపాయి. ఇరు సంస్థల మధ్య సోమవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా 25,000 యూనిట్ల ఎక్స్‌ప్రెస్‌-టి ఎలక్ట్రిక్‌ సెడాన్‌ వాహనాలను ఉబర్‌కు టాటా మోటార్స్‌ సరఫరా చేయనుంది. ఎక్స్‌ప్రెస్‌-టి ఈవీలను ప్రీమియం సేవల కింద ఉపయోగించనున్నట్టు ఉబర్‌ వెల్లడించింది. హైదరాబాద్‌సహా ఢిల్లీ ఎన్‌సీఆర్‌, ముంబై, కోల్‌కత, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌ నగరాల్లో ఈ నెల నుంచే వీటిని నడుపుతామని తెలిపింది.

దశలవారీగా డెలివరీలు..

'ఎలక్ట్రిక్‌ వెహికల్స్‌ సరఫరా విషయంలో వాహన తయారీ కంపెనీ, రైడ్‌ షేరింగ్‌ సంస్థ మధ్య దేశంలో ఈ స్థాయి డీల్‌ కుదరడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి నుంచే దశలవారీగా ఉబర్‌ ఫ్లీట్‌ పార్ట్‌నర్స్‌కు డెలివరీలను టాటా మోటార్స్‌ ప్రారంభించనుంది. దేశంలో పర్యావరణ, స్వచ్ఛ వాహనాల వినియోగం పెరిగేందుకు ఈ డీల్‌ దోహదం చేస్తుందని టాటా మోటార్స్‌ ప్యాసింజర్‌ వెహికిల్స్‌, టాటా ప్యాసింజర్‌ ఎలక్ట్రిక్‌ మొబిలిటీ ఎండీ శైలేశ్‌ చంద్ర అన్నారు. ట్యాక్సీల కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ప్రెస్‌ బ్రాండ్‌ను టాటా మోటార్స్‌ 2021 జూలైలో తెచ్చింది. ఈ బ్రాండ్‌ కింద ఎక్స్‌ప్రెస్‌-టి తొలి ఉత్పాదన. ఫేమ్‌ సబ్సిడీ పోను హైదరాబాద్‌ ఎక్స్‌షోరూం ధర.. ఎక్స్‌ప్రెస్‌-టి ఎక్స్‌ఎమ్‌ ప్లస్‌ రూ.13.04 లక్షలు, ఎక్స్‌టీ ప్లస్‌ రూ.13.54 లక్షలు ఉంది.

నిర్మాణ ప్లాన్స్‌లో డిజిటల్‌ ఇన్‌ఫ్రాను చేర్చాల్సిందే!

- రెరా చట్టంలో నిబంధనలు చేర్చాలి
- ప్రభుత్వానికి ట్రాయ్‌ సిఫార్సులు



న్యూఢిల్లీ: భవంతుల నిర్మాణ ప్రణాళికల్లో నీరు, విద్యుత్‌, గ్యాస్‌ మొదలైన వాటికి సదుపాయాలు కల్పించినట్లుగానే డిజిటల్‌ కనెక్టివిటీ ఇన్‌ఫ్రా (డీసీఐ)కి కూడా చోటు కల్పించాలని ప్రభుత్వానికి టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్‌ సూచించింది. డీసీఐ కల్పన, నిర్వహణ, అప్‌గ్రెడేషన్‌ తదితర అంశాలను కూడా తప్పనిసరిగా పొందుపర్చేలా చూడాలని సూచించింది. ఇందుకోసం రియల్‌ ఎస్టేట్‌ చట్టం రెరాలో తగు నిబంధనలను చేర్చాలని పేర్కొంది. 'డిజిటల్‌ కనెక్టివిటీకి సంబంధించి భవంతులకు రేటింగ్‌ అంశంపై ప్రభుత్వానికి ఈ మేరకు ట్రాయ్‌ సిఫార్సులు చేసింది. అపార్ట్‌మెంట్లు లేదా రియల్టీ ప్రాజెక్టుల్లో ఏదో ఒక నిర్దిష్ట టెల్కో గుత్తాధిపత్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. వైర్‌లెస్‌ పరికరాలను ఇన్‌స్టాల్‌ చేయడం టెలికం లేదా ఇంటర్నెట్‌ సర్వీస్‌ లైసెన్సు హోల్డర్‌ బాధ్యతగా ఉంటుందని ట్రాయ్‌ తెలిపింది. బిల్డింగ్‌ల్లో డీసీఐ ప్రస్తుత ప్రమాణాలు, ప్రక్రియలను సమీక్షించే బాధ్యతను బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌ (బీఐఎస్‌)కు అప్పగించాలని పేర్కొంది.

డిజిటల్‌ సేవల పటిష్టంపై త్వరలో చర్చాపత్రం

దేశీయంగా డిజిటల్‌ సేవలను మరింత పటిష్టం చేసేందుకు, అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకోదగిన చర్యలపై కూడా ట్రాయ్‌ దృష్టి సారిస్తోంది. డివైజ్‌లు, కనెక్టివిటీ, డిజిటల్‌ అక్షరాస్యతపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. ఇందుకు సంబంధించిన చర్చాపత్రాన్ని రాబోయే నెలల్లో విడుదల చేయనున్నట్లు ఇండియా డిజిటల్‌ సదస్సు 2023లో పాల్గొన్న సందర్భంగా ట్రాయ్‌ చైర్మన్‌ పీడీ వాఘేలా తెలిపారు. దేశవ్యాప్తంగా టెల్కోలు 5జీ సేవలను వేగంగా విస్తరిస్తున్నప్పటికీ డివైజ్‌ల రేట్లు అధికంగా ఉన్నాయని సామాన్య ప్రజానీకం భావిస్తున్న నేపథ్యంలో వాఘేలా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వచ్చే 25 ఏళ్లలో దేశీయంగా డిజిటల్‌ వినియోగాన్ని వేగవంతం చేయాలంటే డిజిటల్‌ గవర్నెన్స్‌ మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీపై విధానాల రూపకల్పన వంటి ఎనిమిది కీలక సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని వాఘేలా చెప్పారు. ప్రజోపయోగకరమైన ఆధార్‌, యూపీఐ, డిజిలాకర్‌ వంటి డిజిటల్‌ వ్యవస్థలతో ప్రపంచానికి భారత్‌ ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సామాజిక ఆర్థిక సవాళ్లను పరిష్కరించేందుకు మన దేశ పరిస్థితులకు ఉపయోగపడేలా వినూత్న డిజిటల్‌ ఆవిష్కరణలను రూపొందించాల్సిన అవసరం ఉందని వాఘేలా తెలిపారు.

మార్కెట్‌కు వడ్డీరేట్ల భయాలు

- ఇంధన, బ్యాంకింగ్‌, ఫైనాన్స్‌ షేర్లలో అమ్మకాలు
- సూచీలు రెండోరోజూ డీలా
- నిఫ్టీ నష్టం 100 పాయింట్లు
- 61 వేల దిగువకు సెన్సెక్స్‌



ముంబై: అమెరికా ఫెడ్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో దేశీయ స్టాక్‌ సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. ఇంధన, బ్యాంకింగ్‌, ఫైనాన్స్‌ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా సోమవారం సూచీలు అరశాతం నష్టపోయాయి. తొలి సెషన్‌లో సానుకూలంగా ట్రేడయ్యాయి. మిడ్‌ సెషన్‌ నుంచి తలెత్తిన అమ్మకాలతో ఆరంభ నష్టాలను కోల్పోయాయి. మార్కెట్‌ ముగిసే వరకు విక్రయాలు కొనసాగడంతో సూచీలు ఏ దశలో కోలుకోలేకపోయాయి. ఉదయం సెన్సెక్స్‌ 61,003 పాయింట్ల వద్ద మొదలైంది. ప్రథమార్థంలో 290 పాయింట్లు బలపడి 61,290 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్లు నష్టపోయి 60,691 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,966 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,818 – 18,004 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 100 పాయింట్లు నష్టపోయి 17,845 వద్ద నిలిచింది. ఆటో, ఐటీ షేర్లకు మాత్రమే కొనుగోళ్ల మద్దతు లభించింది. సూచీల అరశాతం నష్టంతో ఇన్వెస్టర్లకు రూ.95,756 కోట్ల నష్టం వాటిల్లింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.159 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.86 కోట్ల షేర్లను కొన్నారు. ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి విలువ తొమ్మిది పైసలు బలపడి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా, యూరప్‌ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. యూఎస్‌ ప్రెసిడెంట్‌ డే సందర్భంగా అమెరికా మార్కెట్లకు సోమవారం సెలవు.

''ఆర్‌బీఐ, ఫెడ్‌ రిజర్వ్‌ మినిట్స్‌ వెల్లడి (బుధవారం)కి ముందు దేశీయ మార్కెట్‌ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంగా ఫెడ్‌ రిజర్వ్‌ ద్రవ్య విధానంపై కఠిన వైఖరితో ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఉత్తర కొరియా మరోసారి బాలిస్టిక్‌ క్షిపణులను ప్రయోగించింది. ఈ అంశాలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. నిరంతర వడ్డీరేట్ల పెంపుతో డిమాండ్‌, ఆదాయాలు మందగిస్తాయి. దేశీయంగా అదానీ గ్రూప్‌ షేర్లలో విక్రయాలు కొనసాగడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. స్వల్పకాలం పాటు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' జియోజిత్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ రీసెర్చ్‌ హెడ్‌ వినోద్‌ నాయర్‌ తెలిపారు.

ఎన్‌ఎండీసీ స్టీల్‌ లిస్టింగ్‌ సూపర్‌ సక్సెస్‌

మైనింగ్‌ దిగ్గజం ఎన్‌ఎండీసీ నుండి విడిపోయి ఎక్స్ఛేంజీలో లిస్టయిన ఎన్‌ఎండీసీ స్టీల్‌ షేరు తొలి రోజే ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. బీఎస్‌ఈలో రూ.30.25 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలోనే భారీ డిమాండ్‌ లభించడంతో క్షణాల్లో షేరు ఐదుశాతం అప్పర్‌ సర్క్యూట్‌ను తాకి రూ.31.75 వద్ద లాకైంది. ఎక్స్ఛేంజీలో మొత్తం 87.65 లక్షల షేర్లు చేతులు మారాయి. మార్కెట్‌ విలువ రూ.9,304.67 కోట్లుగా నమోదైంది.

- సూచీల్లో అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ 1.33%, ఐసీఐసీఐ బ్యాంక్‌ 1.18%, రిలయన్స్‌, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయి సూచీల పతనానికి ప్రధానమైన కారణమయ్యాయి.
- పీతంపూర్‌ ప్లాంట్‌లో 8 లోపాలు గుర్తించి యూఎస్‌ఎఫ్‌డీఏ ఫామ్‌ 483 అబ్జర్వేషన్‌ జారీ చేయడంతో సిప్లా కంపెనీ షేరు 6% నష్టపోయి రూ.964 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% పతనమై రూ.956 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

వేదాంతా - హిందుస్తాన్‌ జింక్‌ డీల్‌కు బ్రేక్‌!

- ప్రతిపాదనను వ్యతిరేకించిన కేంద్రం
- విలువల్లో వ్యత్యాసాలపై ఆందోళన
- దీంతో నిలిచిపోనున్న 2.98 బిలియన్‌ డాలర్ల డీల్‌
- వేదాంతా రుణ భారం తగ్గింపు ప్రయత్నానికి విఘాతం



న్యూఢిల్లీ: రుణ భారాలను తగ్గించుకోవాలని భావిస్తున్న బిలియనీర్‌ అనిల్‌ అగర్వాల్‌ మైనింగ్‌ గ్రూప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. అగర్వాల్‌ నియంత్రణలోని వేదాంతా తన అంతర్జాతీయ జింక్‌ వ్యాపారాన్ని (అసెట్స్‌) హిందుస్తాన్‌ జింక్‌ (హెచ్‌జెడ్‌ఎల్‌)కు 2.98 బిలియన్‌ డాలర్లకు విక్రయించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం వ్యతిరేకించింది. విలువలకు సంబంధించి తలెత్తిన ఆందోళనలే దీనికి కారణం కావడం గమనార్హం. ఈ డీల్‌ ద్వారా తన దాదాపు 10 బిలియన్‌ డాలర్ల రుణ భారంలో కొంత తగ్గించుకోవాలన్న వేదాంతా ప్రయత్నానికి తాజా పరిణామం విఘాతంగా నిలుస్తోంది.

చట్టపరమైన చర్యలకూ ప్రభుత్వం సిద్ధం

ఆఫ్రికా ఆధారిత వ్యాపారాన్ని హిందుస్తాన్‌ జింక్‌కు విక్రయించడాన్ని నిలువరించడానికి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు హిందుస్తాన్‌ జింక్‌ లిమిటెడ్‌కు గనుల మంత్రిత్వశాఖ ఒక లేఖ రాస్తూ, ''ఈ లావాదేవీకి సంబంధించి ప్రభుత్వం తన అసమ్మతిని పునరుద్ఘాటించాలనుకుంటోంది'' అని పేర్కొంది. హిందుస్తాన్‌ జింక్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన డాక్యుమెంట్లలో ఈ విషయాన్ని తెలిపింది. హిందుస్తాన్‌ జింక్‌లో కేంద్రానికి 29.54 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. మాతృ సంస్థ వేదాంతా నుంచి టీహెచ్‌ఎల్‌ జింక్‌ లిమిటెడ్‌ మారిషస్‌ను 2.98 బిలియన్‌ డాలర్లకు కొనుగోలు చేయాలని హిందుస్తాన్‌ జింక్‌ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రతిపాదన ప్రకారం 18 నెలల్లో దశలవారీగా ఈ కొనుగోలు ప్రక్రియ జరగాల్సి ఉంది. జింక్‌, సీసం, వెండి సమీకృత ఉత్పత్తిదారు.. హిందుస్తాన్‌ జింక్‌లో వేదాంతాకు 64.92 శాతం వాటా ఉంది. కాగా.. మైనింగ్‌ శాఖ లేఖను బోర్డు ముందు ఉంచనున్నట్లు హిందుస్తాన్‌ జింక్‌ తాజాగా వెల్లడించింది. వేదాంతా గ్రూప్‌లోకెల్లా భారీ డివిడెండ్ల ద్వారా హెచ్‌జెడ్‌ఎల్‌ సంపన్న సంస్థగా నిలుస్తూ వస్తోంది.

హిందుస్తాన్‌ జింక్‌ షేర్‌ ధర సోమవారం 1% తగ్గి, రూ.321 వద్ద స్థిరపడగా, వేదాంతా షేర్‌ ధర కూడా అంతే శాతం తగ్గి, రూ.311 వద్ద ముగిసింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్‌, న్యూఢిల్లీలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్‌ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **మాస్టర్స్‌ ప్రోగ్రామ్‌:** రెండేళ్ల వ్యవధి (ఫుల్‌ టైం)
» మాస్టర్‌ ఆఫ్‌ ఆర్కిటెక్చర్‌ (ఆర్కిటెక్చరల్‌ కన్జర్వేషన్‌) » మాస్టర్‌ ఆఫ్‌ ఆర్కిటెక్చర్‌(అర్బన్‌ డిజైన్‌)
» మాస్టర్‌ ఆఫ్‌ బిల్డింగ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ » మాస్టర్‌ ఆఫ్‌ డిజైన్‌(ఇండస్ట్రియల్‌ డిజైన్‌)
» మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ (ఇన్విరాన్‌మెంటల్‌ ప్లానింగ్‌) » మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ (హౌసింగ్‌)
» మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ (రీజినల్‌ ప్లానింగ్‌)
» మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ (ట్రాన్స్‌పోర్ట్‌ ప్లానింగ్‌)
» మాస్టర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ (అర్బన్‌ ప్లానింగ్‌)
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్‌/సీడ్‌/యూజీసీ నెట్‌ వ్యాలిడ్‌ స్కోరు ఉండాలి.
» **పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ (ఫుల్‌ టైం, పార్ట్‌టైం):** ఏడాదికి రెండు సార్లు ప్రవేశాలు ఉంటాయి.
» **బ్యాచిలర్స్‌ ప్రోగ్రామ్‌ (బ్యాచిలర్‌ ఆఫ్‌ ఆర్కిటెక్చర్‌, బ్యాచిలర్‌ ఆఫ్‌ ప్లానింగ్‌):** ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ(మెయిన్‌) 2023 ద్వారా ప్రవేశాలు ఉంటాయి.
» దరఖాస్తులకు చివరితేది: 28.02.2023.
» ఇంటర్వ్యూ తేదీలు: 27.03.2023 నుంచి 31.03.2023 వరకు
» ఎంపిక జాబితా వెల్లడి తేది: 14.04.2023
» వెబ్‌సైట్‌: **spa.ac.in**

ఏఎన్‌యూ దూరవిద్యలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌ ఎడ్యుకేషన్‌.. దూర విద్య విధానంలో క్యాలెండర్‌ ఇయర్‌ 2023 కింద యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **పీజీ ఆర్ట్స్‌ ప్రోగ్రామ్‌:** రెండేళ్లు(4 సెమిస్టర్లు) ఎంఏ: ఇంగ్లిష్‌, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్‌, చరిత్ర, పొలిటికల్‌ సైన్స్‌, సోషియాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ సోషల్‌ వర్క్‌, జర్నలిజం-మాస్‌ కమ్యూనికేషన్‌, హ్యూమన్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌.
» **పీజీ కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌:** రెండేళ్లు (4 సెమిస్టర్లు)
ఎంకాం: అకౌంటెన్సీ, బ్యాంకింగ్‌.
» **యూజీ ఆర్ట్స్‌ ప్రోగ్రామ్‌:** మూడేళ్లు(6 సెమిస్టర్లు) బీఏ: ఎకనామిక్స్‌, హిస్టరీ, పొలిటిక్స్‌/ఎకనామిక్స్‌, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, పొలిటిక్స్‌/ఎకనామిక్స్‌, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, సోషియాలజీ/ఎకనామిక్స్‌,హిస్టరీ,సోషియాలజీ/ఎకనామిక్స్‌, పాలిటిక్స్‌, సోషియాలజీ/హిస్టరీ, పొలిటిక్స్‌, సోషియాలజీ/పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, పొలిటిక్స్‌, హిస్టరీ/స్పెషల్‌ ఇంగ్లిష్‌, హిస్టరీ, స్పెషల్‌ తెలుగు/ఎకనామిక్స్‌, బ్యాంకింగ్‌, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌.
» **యూజీ కామర్స్‌, మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌:** మూడేళ్లు (6 సెమిస్టర్లు)
» **బీకాం:** జనరల్‌, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌.
» **బీబీఏ:** బ్యాచిలర్‌ ఆఫ్‌ బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌
» **లైబ్రరీ ప్రోగ్రామ్‌:** ఏడాది (2 సెమిస్టర్లు)
» బీఎల్‌ఐఎస్సీ (బ్యాచిలర్‌ ఆఫ్‌ లైబ్రరీ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్స్‌) » ఎంఎల్‌ఐఎస్సీ (మాస్టర్‌ ఆఫ్‌ లైబ్రరీ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్స్‌)
» **సర్టిఫికేట్‌/డిప్లొమా ప్రోగ్రామ్‌:** ఏడాది.
» సర్టిఫికేట్‌ కోర్సు ఇన్‌ హెచ్‌ఐవీ ఎయిడ్స్‌ కౌన్సిలింగ్‌ » సర్టిఫికేట్‌ కోర్సు ఇన్‌ హోటల్‌ అండ్‌ హాస్పిటల్‌ మేనేజ్‌మెంట్‌ » డిప్లొమా (ఫుడ్‌ ప్రొడక్షన్‌) » డిప్లొమా (సైకలాజికల్‌ గైడెన్స్‌ అండ్‌ కౌన్సిలింగ్‌) » **అర్హత:** కోర్సును బట్టి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్‌, డిప్లొమా, బ్యాచిలర్స్‌ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 28.02.2023.
» వెబ్‌సైట్‌: **www.anucde.info**

బెల్‌, ఘజియాబాద్‌లో 50 పోస్టులు

భారత్‌ ఎలక్ట్రానిక్స్‌ లిమిటెడ్‌, ఘజియాబాద్‌ యూనిట్‌ తాత్కాలిక ప్రాతిపదికన ఇంజనీర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్‌1-14, ప్రాజెక్ట్‌ ఇంజనీర్‌1-36.
» **అర్హత:** 55% మార్కులతో బీఎస్సీ (ఇంజనీరింగ్‌)/బీఈ, బీటెక్‌ (ఎలక్ట్రానిక్స్‌/మెకానికల్‌)తో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.02.2023 నాటికి టీఈ పోస్టులకు 28ఏళ్లు,పీఈ పోస్టులకు 32ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 25.02.2023.
» **రాతపరీక్ష తేది:** 2023 మార్చిలో.
» వెబ్‌సైట్‌: **www.bel-india.in**

ఈ కోర్సులతో.. వెండితెర కెరీర్‌!

సినిమా ప్రపంచం.. అందరూ ఆసక్తి చూపే రంగం! చలన చిత్రాలపై యువతకు ఎంతో క్రేజ్‌!! రీల్‌ లైఫ్‌లో సత్తా చాటి.. రియల్‌లైఫ్‌లో కెరీర్‌ వెలుగులు సొంతం చేసుకోవాలని ఎంతో మంది కలలు కంటుంటారు. కాని ఎంతటి సృజనాత్మకత ఉన్నా.. దానికి మెరుగులు దిద్దుకుంటేనే.. వెండితెరపై వెలుగులీనే అవకాశం దక్కుతుంది! అలాంటి చలన చిత్ర రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించే ఎఫ్‌టీటీఐ, సత్యజిత్‌రే ఫిల్మ్‌ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి చక్కటి మార్గం.. జెట్‌!! ఇటీవల జాయింట్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌(జెట్‌) 2022-23 నోటిఫికేషన్‌ వెలువడింది. ఈ నేపథ్యంలో.. జెట్‌ ద్వారా ప్రవేశం కల్పిస్తున్న కోర్సులు, అడ్మిషన్‌ విధానం, ప్రవేశ పరీక్ష, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..

- ఫిల్మ్‌ అండ్‌ టెలివిజన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండియా సంక్షిప్తంగా.. ఎఫ్‌టీటీఐ.
- సత్యజిత్‌ రే ఫిల్మ్‌ అండ్‌ టెలివిజన్‌ ఇన్‌స్టిట్యూట్‌.. ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐగా సుపరిచితం.

గత కొన్ని దశాబ్దాలుగా సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించి దాదాపు అన్ని విభాగాల్లోనూ అకడమిక్‌ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తూ.. ఈ రంగానికి ఎందరో ప్రముఖులను పరిచయం చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు. వీటిల్లో చేరి తమకు ఆసక్తి ఉన్న విభాగంలోని కోర్సులు పూర్తి చేసుకుంటే.. సినీ, టీవీ రంగాల్లో ఆన్‌-స్క్రీన్‌, ఆఫ్‌-స్క్రీన్‌ అవకాశాలు స్వాగతం పలుకుతాయనడంలో సందేహం లేదు.

16 ప్రోగ్రామ్‌లు

ఎఫ్‌టీటీఐ నిర్వహించే జాయింట్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌లో మెరిట్‌ ఆధారంగా.. ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలో.. పీజీ సర్టిఫికెట్‌, పీజీ డిప్లొమా, యూజీ సర్టిఫికెట్‌ పేరుతో 16 ప్రోగ్రామ్‌లో సీట్లు భర్తీ చేస్తారు. వీటిని గ్రూప్‌-ఎ, బి, సిలుగా వర్గీకరించారు.

గ్రూప్‌-ఎ కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్‌ ఆర్ట్‌ డైరెక్షన్‌ అండ్‌ ప్రొడక్షన్‌ డిజైన్‌;వ్యవధి మూడేళ్లు;ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ
- పీజీ డిప్లొమా ఇన్‌ స్క్రీన్‌ యాక్టింగ్‌; వ్యవధి-రెండేళ్లు; ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ. • పీజీ డిప్లొమా ఇన్‌ స్క్రీన్‌ రైటింగ్‌(ఫిలిం, టీవీ, వెబ్‌ సిరీస్‌); వ్యవధి-రెండేళ్లు; ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ.
- యూజీ సర్టిఫికెట్‌ ఇన్‌ యానిమేషన్‌ అండ్‌ విజువల్‌ ఎఫెక్ట్స్‌ డిజైన్‌; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ.
- పీజీ డిప్లొమా ఇన్‌ యానిమేషన్‌ సినిమా; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌- ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్‌ ప్రొడ్యూసింగ్‌ ఫర్‌ ఫిల్మ్‌ అండ్‌ టెలివిజన్‌; వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ. • పీజీ డిప్లొమా ఇన్‌ ఎలక్ట్రానిక్‌ అండ్‌ డిజిటల్‌ మీడియా మేనేజ్‌మెంట్‌; వ్యవధి-రెండేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.



గ్రూప్‌-బి కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్‌ డైరెక్షన్‌ అండ్‌ స్క్రీన్‌ ప్లే రైటింగ్‌, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌- ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్‌ సినిమాటోగ్రఫీ,వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ,ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్‌ ఎడిటింగ్‌, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.
- పీజీ డిప్లొమా ఇన్‌ సౌండ్‌ రికార్డింగ్‌ అండ్‌ సౌండ్‌ డిజైన్‌, వ్యవధి-మూడేళ్లు, ఇన్‌స్టిట్యూట్‌-ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ.

గ్రూప్‌-సి కోర్సులు

- **పీజీ సర్టిఫికెట్‌ కోర్సులు:** డైరెక్షన్‌; ఎలక్ట్రానిక్‌ సినిమాటోగ్రఫీ; వీడియో ఎడిటింగ్‌; సౌండ్‌ రికార్డింగ్‌ అండ్‌ టెలివిజన్‌ ఇంజనీరింగ్‌;
- **పీజీ డిప్లొమా కోర్సులు:** డైరెక్షన్‌ అండ్‌ ప్రొడ్యూసింగ్‌ ఫర్‌ ఈడీఎం; సినిమాటోగ్రఫీ ఫర్‌ ఈడీఎం; ఎడిటింగ్‌ ఫర్‌ ఈడీఎం; సౌండ్‌ ఫర్‌ ఈడీఎం; రైటింగ్‌ ఫర్‌ ఈడీఎం.

అర్హతలు

- బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. మూడేళ్ల వ్యవధిలోని పీజీ డిప్లొమా ఇన్‌ ఆర్ట్‌ డైరెక్షన్‌ అండ్‌ ప్రొడక్షన్‌ డిజైన్‌,యూజీ సర్టిఫికెట్‌ ఇన్‌ యానిమేషన్‌ అండ్‌ విజువల్‌ ఎఫెక్ట్స్‌ డిజైన్‌ కోర్సులకు మాత్రం ప్రత్యేక అర్హత ప్రమాణాలను నిర్దేశించారు. • **పీజీ డిప్లొమా ఇన్‌ ఆర్ట్‌ డైరెక్షన్‌ అండ్‌ ప్రొడక్షన్‌ డిజైన్‌:** అప్లైడ్‌ ఆర్ట్స్‌, ఆర్కిటెక్చర్‌, పెయింటింగ్‌, స్కల్ప్చర్‌, ఇంటీరియర్‌ డిజైన్‌ లేదా సంబంధిత విభాగాల్లో ఫైన్‌ ఆర్ట్స్‌లో బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **యూజీ సర్టిఫికెట్‌ కోర్స్‌ ఇన్‌ యానిమేషన్‌ అండ్‌ విజువల్‌ ఎఫెక్ట్స్‌ డిజైన్‌:** ఇంటర్మీడియెట్‌ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- పీజీ డిప్లొమా, పీజీ సర్టిఫికెట్‌ కోర్సులకు బ్యాచిలర్‌ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు పేపర్లు..100 మార్కులు

- ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని పైన పేర్కొన్న కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న జాయింట్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ రెండు పేపర్లుగా, 100 మార్కులకు ఉంటుంది. వివరాలు..
- **పేపర్‌-1:** ఈ పేపర్‌ను పార్ట్‌-ఎ, పార్ట్‌-బిలుగా మొత్తం 50 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్‌-ఎలో.. ఆర్ట్‌ అండ్‌ క్రాఫ్ట్‌ ఆఫ్‌ ఫిల్మ్‌ అండ్‌ టీవీ, అల్లయిడ్‌ ఆర్ట్స్‌, లిటరేచర్‌, జనరల్‌ అవేర్‌నెస్‌, ఎన్విరాన్‌మెంటల్‌ అవేర్‌నెస్‌, ఆర్ట్‌, కల్చర్‌, మీడియా విభాగాలకు సంబంధించి జనరల్‌ నాలెడ్జ్‌ అంశాలుంటాయి. పార్ట్‌-ఎలో మొత్తం 20 ప్రశ్నలు (20 మార్కులు) అడుగుతారు.
- పార్ట్‌-బిలో అభ్యర్థులు పేర్కొన్న సబ్జెక్ట్‌ సంబంధిత అంశాలుంటాయి. ఈ విభాగంలో మొత్తం 15 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున 30 మార్కులకు పార్ట్‌-బి నిర్వహిస్తారు.

పేపర్‌-2 ఇలా

- జెట్‌లో కీలకమైన పేపర్‌-2లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగంలో డిస్క్రిప్టివ్‌ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఒక సుదీర్ఘ వివరణాత్మక సమాధానం ఇవ్వాల్సిన విధంగా ప్రశ్న అడుగుతారు. దీనికి 20 మార్కులు కేటాయించారు. • రెండో విభాగంలో.. స్కెచెస్‌, ఫొటోగ్రాఫ్స్‌కు సంబంధించిన డిస్క్రిప్టివ్‌ ప్రశ్నలు, షార్ట్‌ నోట్స్‌ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం ఆరు ప్రశ్నలు ఇచ్చి..అందులో మూడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వమని అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు చొప్పున మూడు ప్రశ్నలకు 30 మార్కులు ఉంటాయి.
- ఇలా మొత్తం రెండు పేపర్లు కలిపి 100 మార్కులు(పేపర్‌-1- 50 మార్కులు; పేపర్‌-2-50 మార్కులు)కు పరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్‌-1ను ఒక గంట వ్యవధిలో, పేపర్‌-2 రెండు గంటల వ్యవధిలో మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.

మలిదశ ఎంపిక ప్రక్రియ

- జెట్‌లో సాధించిన స్కోర్‌ ఆధారంగా.. మలిదశలో ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలు ఆడిషన్‌, ఓరియెంటేషన్‌, ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహిస్తాయి.
- మలిదశ ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో.. జెట్‌ పేపర్‌-2 మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు పేపర్‌-1లో తప్పనిసరిగా నిర్దిష్ట అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

తుది జాబితా ఇలా

రాత పరీక్షలో పొందిన మార్కులు, మలి దశలో సాధించిన మార్కులను క్రోడీకరించి.. ఫైనల్‌ మెరిట్‌ లిస్ట్‌ రూపొందిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల నుంచి ప్రాథమ్యాలను సేకరించి.. అందుబాటులోని సీట్లు, అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

ప్రతి గ్రూప్‌ నుంచి ఒక కోర్సుకు

ఎఫ్‌టీటీఐ,ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని కోర్సులను మూడు గ్రూప్‌లుగా విభజించిన నేపథ్యంలో..అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు ప్రతి గ్రూప్‌ నుంచి ఒక కోర్సుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఉజ్వల అవకాశాలు

- ఎఫ్‌టీటీఐ, ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐలలోని కోర్సులు పూర్తి చేసుకుంటే.. సంబంధిత విభాగాల్లో విస్తృత అవకాశాలు సొంతం చేసుకునే నైపుణ్యం లభిస్తుంది. యాక్టింగ్‌, డైరెక్షన్‌, ఎడిటింగ్‌, మ్యూజిక్‌, ఫొటోగ్రఫీ, స్క్రీన్‌ ప్లే, సౌండ్‌ టెక్నాలజీ తదితర విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.
- కేవలం సినీ రంగంలోనే కాకుండా..టెలివిజన్‌ విభాగంలోనూ కొలువులు లభిస్తున్నాయి. అదే విధంగా ఇటీవల కాలంలో ఓటీటీ కల్చర్‌ విస్తరిస్తూ.. పలు వెబ్‌ సిరీస్‌లు విడుదలవుతున్న నేపథ్యంలో.. వాటిలోనూ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు.

ప్రతిభ ప్రధానం

సినీ రంగంలో గుర్తింపు పొందాలంటే.. వ్యక్తిగత ప్రతిభ ఎంతో ముఖ్యం. సన్నివేశానికి తగినట్లుగా యాక్టింగ్‌, డైరెక్షన్‌, ఎడిటింగ్‌, స్క్రీన్‌ ప్లే, బ్యాక్‌గ్రౌండ్‌ మ్యూజిక్‌ వంటి వాటిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు పర్సనల్‌ టాలెంట్‌ అవసరం. ప్రతిభ, ప్రొడక్షన్‌ హౌస్‌ని బట్టి ఆయా విభాగాల్లో నెలకు రూ.50 వేల వరకూ అందుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ:** మార్చి 4, 2023
- **జెట్‌ పరీక్ష తేదీలు:** మార్చి 18 – 19(మార్చి 18న గ్రూప్‌-ఎ కోర్సులకు, మార్చి 19 ఉదయం 9 నుంచి 12 వరకు గ్రూప్‌-బి కోర్సులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు గ్రూప్‌-సి కోర్సులకు పరీక్ష).
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్‌
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌:** https://applyadmission.net/jet-2022_23

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ప్రథమ వర్ధంతి నివాళులు



కీ॥శే॥ మేకపాటి గౌతమ్ రెడ్డి గారు

దివంగత మంత్రివర్యులు - ఆంధ్రప్రదేశ్

జననం:
02.11.1971

మరణం:
21.02.2022

ప్రతి ఒక్కరినీ ప్రేమగా పలకరించి...
పెద్దలను ఎంతగానో గౌరవించి...
ప్రజా సమస్యలను పరిష్కరించి...
మంచితనం మూర్తీభవించి...
మానవత్వం మేళవించి...
అందరి మన్ననలను పొంది, అందరి వాడివైన
మనసున్న మారాజుకు
ప్రథమ వర్ధంతి నివాళి...



మేకపాటి కుటుంబ సభ్యులు

బంధు మిత్రులు మరియు అభిమానులు